

## పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు,
## భారత విప్లవోద్యమ నేత,
## సీపీఐ (మావోయిస్టు)
## పొలిట్‌బ్యూరో సభ్యుడు

# కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ/రాంజీ)

## క్రూర హత్యను ముక్తకంఠంతో ఖండించండి!

### నవంబర్ 29 నుండి డిసెంబర్ 5 వరకు దేశవ్యాప్త నిరసన వారాన్ని,
### డిసెంబర్ 4-5 తేదీలలో 48 గంటల 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!!

నవంబర్ 24, 2011 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటిదినంగా మిగిలిపోతుంది. సీపీఐ (మావోయిస్టు)ను 'దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదం'గా ప్రచారం చేస్తూ దేశవ్యాప్త దమనకాండను, పీడిత ప్రజలకు వ్యతిరేకంగా అన్యాయమైన యుద్ధాన్ని సాగిస్తున్న ఫాసిస్టు సోనియా-మన్మోహన్‌సింగ్-ప్రణబ్-చిదంబరం-జయరాం రమేష్‌ల పాలక ముఠా బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కుమ్మక్కయ్యి కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వరరావును కుట్రపూరితంగా సజీవంగా పట్టుకొని హత్య చేసింది. గత సంవత్సరం జూలై 1న పార్టీ అధికార ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్‌ను హత్య చేసిన ఈ ముఠా మరోసారి పంజా విసురుతూ తన రక్తదాహాన్ని తీర్చుకుంది. అధికారంలోకి రాకముందు కామ్రేడ్ ఆజాద్ హత్యపై మొసలి కన్నీరు కార్చిన మమతా బెనర్జీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక వైపు మావోయిస్టు పార్టీతో చర్చల నాటకం ఆడుతూనే మరో అగ్రనేత కామ్రేడ్ కోటేశ్వరరావును హతమార్చి తన ప్రజావ్యతిరేక, ఫాసిస్టు ముఖాన్ని బైటపెట్టుకుంది. కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ హంతక ఇంటలిజెన్స్ సంస్థలు చాలా పథకం ప్రకారం ఆయన వెంటబడి సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా పిరికిగా హత్య చేసి ఎన్‌కౌంటర్ అనే కట్టుకథను ప్రచారం చేస్తున్నాయి. కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆర్.కే. సింగ్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది ఎవరో నూటికి నూరు శాతం ఇంకా తెలియదనీ, శవాన్ని గుర్తుపట్టాల్సి వుందనీ

# క్రాంతి

### లోపలి పేజీల్లో...


సకలజనుల సమ్మె....................4
అవినీతి వ్యతిరేక పోరాటం..............11
పంట విరామం....................16
ఆర్థిక అభివృద్ధి-సామాజిక..............19
అమరుల త్యాగాలను..............మధ్యపేజీ
ప్రపంచ ఆర్థిక సంక్షోభం..............32
కబళిస్తోన్న పోస్కో....................39
ఆఫ్రికాన్-భారత్ సదస్సు....................43



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 35 సంచిక: 4 | జూలై - అక్టోబర్ 2011 | వెల: పది రూపాయలు

అంటూనే మావోయిస్టు వుద్యమానికి ఇది గట్టి దెబ్బ అని ప్రకటించడం ద్వారా ఈ హత్య వెనుక వున్న కుట్రను తనంతట తానే బైటపెట్టాడు. విప్లవోద్యమ అగ్ర నాయకత్వాన్ని మట్టుబెట్టడం ద్వారా మావోయిస్టు పార్టీని సమూలంగా నిర్మూలించగలమని పగటి కలలు గంటున్న దోపిడీ పాలకవర్గాలకు, వారికి మార్గదర్శకత్వం వహిస్తున్న సామ్రాజ్యవాదులకు పీడిత ప్రజలు ప్రజాయుద్ధంతో తప్పక గోరీ కడతారు.

పార్టీలో, ప్రజలలో ప్రహ్లాద్‌గా, రాంజీగా, కిషన్‌జీగా, బిమల్‌గా సుపరిచితుడైన కామ్రేడ్ కోటేశ్వర్ భారత విప్లవోద్యమ కీలక నేతల్లో ఒకరు. గత 37 సంవత్సరాలుగా అలుపెరుగని యోధుడిగా, ఎత్తిన తుపాకీ దించకుండా పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం నిండు ప్రాణాలర్పించిన కామ్రేడ్ కోటేశ్వర్ 1954లో ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి పట్టణంలో జన్మించాడు. స్వాతంత్ర సమరయోధుడైన తండ్రి వెంకటయ్య, అభ్యుదయ భావాలు గల తల్లి మధురమ్మల పెంపకంలో పెరిగి పెద్దవాడైన కామ్రేడ్ కోటేశ్వరరావు చిన్నతనం నుండే దేశం పట్ల, పీడిత ప్రజల పట్ల ప్రేమను పెంచుకున్నాడు. పెద్దపల్లి పట్టణంలో హైస్కూలు విద్యను అభ్యసిస్తున్న సమయంలో 1969లో వెల్లువెత్తిన ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతూ మహత్తర నక్సల్బరీ, శ్రీకాకుళ వుద్యమాల ప్రేరణతో విప్లవోద్యమంలో చేరాడు. 1974 నుండి పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పని చేయడం ప్రారంభించాడు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో కొంతకాలం జైలు నిర్బంధానికి గురైన కామ్రేడ్ కోటేశ్వర్‌రావు ఆ తర్వాత పార్టీ ఆర్గనైజర్‌గా తన స్వంత జిల్లాయైన కరీంనగర్‌లో ప్రజల్లో కృషిని ప్రారంభించాడు. పార్టీ ఇచ్చిన 'గ్రామాలకు తరలండి' పిలుపును అందుకొని ఆయన గ్రామాలకు వెళ్లి రైతాంగంతో పరిచయాలు ఏర్పర్చుకున్నాడు. 1978లో 'జగిత్యాల జైత్రయాత్ర'గా ప్రసిద్ధి గాంచిన రైతాంగ వుద్యమ వెల్లువలో ప్రముఖ పాత్ర పోషించిన వాళ్లలో ఆయన ఒకరు. ఆ క్రమంలో అప్పటి సీపీఐ (ఎం-ఎల్) ఆదిలాబాద్-కరీంనగర్ సంయుక్త జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1979లో ఆ కమిటీ రెండు జిల్లా కమిటీలుగా విడిపోయినపుడు ఆయన కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శి అయ్యాడు. 1980లో జరిగిన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 12వ మహాసభలో పాల్గొని రాష్ట్రకమిటీలోకి ఎన్నికయ్యి కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు.

1985 వరకు ఏపి రాష్ట్రకమిటీ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వుద్యమాన్ని విస్తరింపజెయ్యడంలో, గెరిల్లాజోన్ లక్ష్యంతో కొనసాగుతున్న ఉత్తర తెలంగాణా వుద్యమాన్ని అభివృద్ధి చెయ్యడంలో కీలక పాత్ర పోషించాడు. 1980లో దండకారణ్యానికి విప్లవోద్యమాన్ని విస్తరింపజెయ్యడంలో, అభివృద్ధి చెయ్యడంలో ఆయనది ప్రముఖ పాత్ర. 1986లో ఆయన దండకారణ్య వుద్యమానికి బదిలీ అయ్యి ఫారెస్ట్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. దండకారణ్యంలో ఆయన గెరిల్లా దళాలకు, ప్రజలకు నాయకత్వం, మార్గదర్శకత్వం వహించాడు. 1993లో ఆయన అప్పటి కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ (సీవోసీ)లోకి సభ్యుడిగా కో-ఆప్ట్ చేసుకోబడ్డాడు.

1994 నుండి ఆయన ప్రధానంగా బెంగాల్ సహా తూర్పు, ఉత్తర భారతంలో విప్లవోద్యమ విస్తరణలో, అభివృద్ధిలో ఎనలేని కృషి చేశాడు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నక్సల్బరీ వుద్యమ వెనుకంజ తర్వాత ముక్కలు చెక్కలైన విప్లవ శక్తుల్ని కూడగట్టి విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో గొప్పది. ఆయన బెంగాల్ పీడిత ప్రజలతో, విప్లవ శిబిరంలోని వివిధ సెక్షన్లతో గాఢంగా మమేకమై, బంగ్లా భాషను పట్టుదలగా నేర్చుకొని అక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశాడు. పలు విప్లవ గ్రూపులతో ఐక్యతను సాధించడంలో, పార్టీని బలోపేతం చేయడంలో ఆయన విరామమెరుగక కృషి చేశాడు. 1995లో జరిగిన మునుపటి సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో కామ్రేడ్ కోటేశ్వరరావు కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1998లో పీపుల్స్‌వార్, పార్టీయూనిటీ పార్టీల ఐక్యత కోసం ఆయన పట్టుదలగా కృషి చేశాడు. 2001లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ కాంగ్రెస్‌లో తిరిగి కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉత్తర రీజినల్ బ్యూరో కార్యదర్శి బాధ్యత చేపట్టి బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడు. అదే సమయంలో మునుపటి పీపుల్స్‌వార్, ఎంసీసీఐల మధ్య జరిగిన ఐక్యతా చర్చలలో ఆయన కీలక పాత్ర పోషించాడు. 2004లో రెండు పార్టీల విలీనం తర్వాత ఏర్పడిన ఐక్య కేంద్రకమిటీలో, పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా వుంటూ తూర్పు రీజినల్ బ్యూరోలో భాగంగా పని చేశాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర వుద్యమంపై ప్రధానంగా కేంద్రీకరిస్తూ ఆయన ఈఆర్‌బీ అధికార ప్రతినిధిగా కొనసాగాడు.

ఆయన పార్టీలో పత్రికల పనిలో, రాజకీయ విద్యా రంగంలో ప్రముఖ పాత్ర పోషించాడు. 'క్రాంతి', 'ఎర్రజెండా', 'జంగ్', 'ప్రభాత్', 'వ్యాన్‌గార్డ్' తదితర పత్రికల నిర్వహణలో పాలు పంచుకున్నాడు. పశ్చిమ బెంగాల్ నుండి వెలువడిన పలు విప్లవ పత్రికల నిర్వహణలో ఆయన ప్రత్యేక కృషి వుంది. ఈ పత్రికల్లో ఆయన ఎన్నో సిద్ధాంత, రాజకీయ వ్యాసాలు రాసాడు. రాజకీయ విద్యపై ఏర్పడిన కేంద్ర సబ్-కమిటీలో సభ్యుడిగా వుంటూ పార్టీ శ్రేణులకు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని బోధించే కృషిలో ప్రముఖ పాత్ర పోషించాడు. మొత్తం పార్టీ చరిత్రలో విప్లవోద్యమ

విస్తరణలో, పార్టీ డాక్యుమెంట్లను సంపద్వంతం చేసే కృషిలో, వుద్యమాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన మరపురాని పాత్ర పోషించాడు. 2007 జనవరిలో జరిగిన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్‌లో తిరిగి కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికై పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, తూర్పు రీజనల్ బ్యూరో సభ్యుడిగా కొనసాగాడు.


పశ్చిమ బెంగాల్‌లో సోషల్ ఫాసిస్టు సీపీఎం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా 2007 నుండి పెల్లుబికిన సింగూర్, నందిగ్రాం ప్రజా వుద్యమాలకు, ప్రత్యేకించి పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని లాల్‌గఢ్ ప్రాంతంలో వెల్లువెత్తిన గొప్ప ప్రజా తిరుగుబాటుకు ఆయన అందించిన రాజకీయ మార్గదర్శకత్వం ప్రముఖమైంది. బెంగాల్ రాష్ట్రకమిటీని, పార్టీ శ్రేణుల్ని ఈ వుద్యమాలకు నాయకత్వం వహించేలా నడిపిస్తూ మరోవైపు మీడియా ద్వారా కూడా ఆయన పార్టీ ప్రచారాన్ని చొరవగా నిర్వహించాడు. 2009లో చిదంబరం ముఠా చర్చల పేరుతో, కాల్పుల విరమణ పేరుతో ప్రజల్ని, ముఖ్యంగా మధ్యతరగతిని పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తుంటే ఆయన దాన్ని ఎండగట్టడానికి విశేషంగా కృషి చేశాడు. ప్రజాయుద్ధం ప్రాముఖ్యతను అడుగడుగునా ఎత్తిపడుతూ విప్లవ రాజకీయాల్ని విశాల ప్రజల్లోకి వ్యాపింపజేయడానికి ఎనలేని కృషి చేశాడు. ఇలా దాదాపు నాలుగు దశాబ్దాలుగా అప్రతిహతంగా సాగిన ఆయన విప్లవ ప్రస్థానం నవంబర్ 24, 2011న అర్థాంతరంగా ముగిసింది.

**ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా!**

ఈ దారుణ హత్యను ప్రతి ఒక్కరూ ఖండించాలి. విప్లవోద్యమ నాయకత్వాన్ని నిర్మూలించి దేశ పీడిత ప్రజలకు సరైన మార్గదర్శకత్వం, కార్మికవర్గ నాయకత్వం లేకుండా చేయాలనేదే పాలకుల కుట్ర. దేశాన్ని నిట్టనిలువుగా దోచుకోవడానికి, ఇక్కడి నీటినీ, భూముల్నీ, అడవుల్నీ బడా, విదేశీ పెట్టుబడిదార్లకు ధారాదత్తం చేసి తమ వంతు ముడుపుల్ని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడానికి ఈ బడాచోర్లకు, దళారీలకు మావోయిస్టు వుద్యమమే అతి పెద్ద అడ్డంకిగా వుందనేది తెలిసిందే. అందుకే ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో గత రెండేళ్లుగా సాగిస్తున్న బహుముఖ, దేశవ్యాప్త క్రూర దాడి. అందులో భాగమే ఈ దారుణ హత్య. విప్లవోద్యమాన్ని, విప్లవోద్యమ నాయకత్వాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడం నేడు దేశభక్తులైన, స్వాతంత్రప్రియులైన ప్రజలందరి కర్తవ్యం. ఇలా కాపాడుకోవడమంటే మన దేశ భవిష్యత్తును, మన భావి తరాల భవిష్యత్తును కాపాడుకోవడమే.

57 సంవత్సరాల వయస్సులోనూ కష్టభరితమైన గెరిల్లా జీవితంలో యువతీయువకులతో పోటీ పడుతూ, తను ఎక్కడున్నా చుట్టూ కేడర్లలో, ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించే కామ్రేడ్ కోటేశ్వరరావు జీవితం ప్రత్యేకించి నేటి యువతరానికి గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. ఆయన విసుగూ, విరామం లేకుండా గంటల తరబడి అధ్యయనంలో, పార్టీ పనిలో పాలు పంచుకునే వాడు. దూరభారాల్ని లెక్క చేయకుండా, చాలా తక్కువగా నిద్రపోతూ, సాదాసీదాగా జీవిస్తూ, ఎక్కువగా కష్టించే వాడు. అన్ని వయస్సుల వాళ్లతో, అన్ని రకాల సామాజిక నేపథ్యాలు గల వాళ్లతో సులువుగా కలిసిపోతూ, అందరిలోనూ విప్లవోత్సాహాన్ని ఇనుమడింపజేసేవాడు. కామ్రేడ్ కోటేశ్వరరావు మృతితో భారత విప్లవోద్యమానికి తీవ్ర నష్టం జరిగిందనడంలో సందేహం లేదు. అయితే ప్రజలు చాలా గొప్పవాళ్లు. చరిత్ర నిర్మాతలు. ప్రజలూ, ప్రజా వుద్యమాలే కోటేశ్వరరావు వంటి సాహసికులైన, అంకితభావం గల విప్లవకారుల్ని సృష్టించాయి. కోటేశ్వరరావు అందించి వెళ్లిన ఆశయస్ఫూర్తితో, జగిత్యాల నుండి జంగల్‌మహల్ అడవుల దాకా వెదజల్లి పోయిన విప్లవ పరిమళాలతో సాయుధమైన కార్మికకర్షకులు, విప్లవకారులు భారత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని తప్పక విజయపథంలో పురోగమింపజేస్తారు. సామ్రాజ్యవాదుల్ని, వారి తాబేదార్లయిన భారత భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాల్ని, వాళ్ల ప్రతినిధులైన సోనియా, మన్మోహన్‌సింగ్, చిదంబరం, మమతా బెనర్జీ తదితర దళారీ పాలకుల్ని నామరూపాలు లేకుండా చేస్తారు.

కామ్రేడ్ కోటేశ్వరరావు దారుణ హత్యకు నిరసనగా నవంబర్ 29 నుండి డిసెంబర్ 5 వరకు నిరసన వారం, డిసెంబర్ 4–5 తేదీలలో 48 గంటల 'భారత్ బంద్'ను విజయవంతం చేయాలని మా కేంద్రకమిటీ దేశ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నది. నిరసన వారం సందర్భంగా సభలు, ఊరేగింపులు, ధర్నాలు, నల్లబ్యాడ్జీలు ధరించడం, చక్కాజాంలు వంటి వివిధ కార్యక్రమాల్ని చేపట్టాలని కోరుతున్నాం. డిసెంబర్ 4–5 తేదీలలో జరిగే భారత్ బంద్‌లో భాగంగా రైళ్లు, రోడ్లు, విద్యా, వ్యాపార సంస్థల్ని మూసివెయ్యాలని, అన్ని రకాల పారిశ్రామిక కార్యకలాపాల్ని నిలిపివెయ్యాలని కోరుతున్నాం. వైద్య సేవల్ని బంద్ నుండి మినహాయిస్తున్నాం.



**(అభయ్)**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**సీపీఐ (మావోయిస్టు)**

**గమనిక:** ఈ సంచిక ఆలస్యంగా విడుదలవుతున్నందున ఈ సి.సి ప్రకటన యధాతథంగా ఇదే సంచికలో ప్రచురిస్తున్నాం.

# 'సకల జనుల సమ్మె'ను సకల జనుల ఉద్యమంగా మలచి ప్రత్యేక తెలంగాణ సాధించేవరకు పోరాడండి!

మిలియన్ మార్చ్ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కొన్ని రోజుల పాటు స్తబ్దత ఆవరించింది. అడపాదడపా ర్యాలీలు, బంద్‌లు, ఆమరణ నిరాహారదీక్షలు చేసినప్పటికీ పురోగతిలేదు. రాజకీయ నాయకులు మళ్ళీ బెదిరింపులు, సవాళ్ళు, నీరుగార్చే మాటలు, రాజీ వైఖరులతో కాలం వెళ్ళబుచ్చుతూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు.

తెచ్చేది మేమే, ఇచ్చేది మేమే అంటూ కాంగ్రెస్, రెండు కళ్ళ సిద్ధాంతంతో తెలుగుదేశం, కండువాల మార్పిడి లాబీయింగ్‌లతో టి.ఆర్.ఎస్, ఇస్తే అభ్యంతరం లేదని వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆకాంక్షలను అపహాస్యం చేస్తున్నాయి. కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి తెలంగాణ వాడై వుండి జాతీయవాదం అని, కాంగ్రెస్ పార్టీ ఒక్కటే జాతీయపార్టీ అని ఉద్యమాన్ని నీరుగార్చే వ్యాఖ్యలు చేశాడు. తెలంగాణ ప్రాంతపు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా జైపాల్‌రెడ్డిని తమ నాయకునిగా ముందుపెట్టి అధిష్టానం దగ్గర ప్రత్యేక తెలంగాణ కోసం వాదించాలని భావించారు. కాని ఇతడు ప్రజల ఆకాంక్షలను, విశ్వాసాన్ని వమ్ము చేసి పచ్చి అవకాశవాదినని నిరూపించుకున్నాడు. ఒక రకంగా తన వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ అధిష్టానం ఉద్దేశాన్ని బయటపెట్టాడు.

ఇటువంటి అనైక్యత స్థితిని పెంచి పోషించి, శ్రీకృష్ణకమిటీ 8వ అధ్యాయంలో చెప్పినట్లు కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ప్రజాప్రతినిధులను తమ చెప్పు చేతల్లో వుంచుకునేందుకు మేనేజ్ చేస్తున్నది. ప్రజలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నమ్మే పరిస్థితి లేకుండా అయింది. వారు అధిష్టానానికి తమ గోడు వినిపించుకోవడానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వీరిని కలిసిన చిదంబరం అన్ని ప్రాంతాల ఏకాభిప్రాయంతోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు సాధ్యమని పాతపాటనే మొదలుపెట్టాడు.

డిసెంబర్ 9 ప్రకటన ప్రభుత్వ ప్రకటనేగాని, తన వ్యక్తిగత ప్రకటన కాదన్నాడు. అయినప్పుడు మళ్ళీ ఏకాభిప్రాయం రాగం అందుకున్నాడంటే, తెలంగాణ సమస్య పరిష్కారానికి యు.పి.ఏ ప్రభుత్వం సిద్ధంగా లేదనీ, సమస్యను ఇంకా నాన్చి, ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తున్నదనేది స్పష్టమవుతున్నది.

చిదంబరం సమాధానంతో, రిక్తహస్తాలతో వెనుదిరిగిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో ప్రజల ముందు తలెత్తుకు తిరగలేని స్థితిలో మూకుమ్మడి రాజీనామాల నాటకం ఆడారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ వారితో మొదలుపెట్టి జూలై 4నుంచి ఒకరి తర్వాత ఒకరు అన్ని పార్టీల తెలంగాణ ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేశారు. అందరూ రాజీనామాలు చేసినప్పటికీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, హైదరాబాద్ ఎంఎల్యేలు దానం నాగేందర్, ముఖేష్ గౌడ్, కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, ఎం.పి సర్వే సత్యనారాయణలు రాజీనామాలు చేయలేదు. దీంతో వీరు తెలంగాణ ద్రోహులుగా ప్రజల ముందు బహిర్గతమయ్యారు. రాజీనామాలు చేసిన వారికి ప్రజల్లో ఒకింత అనుకూలత ఏర్పడింది. దీనికి తోడు పోయిన తమ ప్రతిష్ట నిలబెట్టుకోవడానికి రెండు రోజుల నిరసన దీక్ష, మండల స్థాయిలో సత్యాగ్రహదీక్షలు చేపట్టారు. ఇక జెండా పండుగ వంటివి చేపట్టి ఆగస్టు తర్వాత ఉధృతమయ్యే తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక వహిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలోపేతం కావడం ఖాయమని పార్టీ నాయకులు భావించారు. ఈలోగానే శాసనసభ స్పీకర్ రాజీనామాలను తిరస్కరించటంతో ఏమీ చేయాలో తెలియని స్థితి ఏర్పడింది.

రాజీనామాలు తిరస్కరించినా ఈ దశలో వెనక్కు మళ్ళడం మంచిది కాదని తెలుగుదేశం తెలంగాణ ఫోరమ్ భావించింది. అదే సమయంలో మరో మారు రాజీనామాలు చేసి అవి ఆమోదం పొంది ఎన్నికలు ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తే ఏ రాజకీయ పార్టీ వారినీ బరిలో నిలపబోరని రాజకీయ జె.ఏ.సి నుంచి స్పష్టమైన హామీ తీసుకున్నాక నిర్ణయించుకుందామని తెలుగుదేశం తెలంగాణ ఫోరంలో కొందరు నేతలు ప్రతిపాదించారు. అంటే తెలంగాణ కన్నా తమ సీటుకు గ్యారెంటీ ఉండాలనేది వీరికి ముఖ్యం.

ఈ రాజీనామాల ఘట్టాన్ని పరిశీలించినప్పుడు ఈ పార్లమెంటరీ రాజకీయ సంస్కృతి క్రిందినుంచి పై స్థాయిదాకా ఎంత కలుషితంగా, అనైతికంగా, అప్రజాస్వామికంగా సాగుతున్నదో అర్థమవుతుంది. చిదంబరం డిసెంబర్ 9 ప్రకటన వుత్తదేనని తేలిపోయినప్పటినుండే తెలంగాణ శాసన సభ్యుల మీద రాజీనామాల కోసం వత్తిడి పెరిగింది. అప్పటినుండి తెలంగాణ సాధనకోసం పదవులు వదిలి ప్రజలతో కలిసి పోరాడాల్సిన ప్రతి సందర్భంలోనూ పదవులు పట్టుకుని వేలాడి, తీరా ప్రజలు వెలివేసే పరిస్థితి వచ్చినప్పుడు టి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రాజీనామాల బాటపట్టారు. అదికూడా ఎన్నో గడవుల తర్వాత, చర్చోప చర్చల తర్వాత జూలై మొదటి వారంలో

రాజీనామాలు మొదలయ్యాయి. తెలంగాణ సమాజం మొత్తంగా రాజీనామాల మీద పట్టుపడుతుండగా, ఇంకా రాజీనామాలు చేయకుండా పదవులు పట్టుకొని వేలాడే ప్రజాప్రతినిధులు వున్నారంటే ప్రాతినిధ్యం ఎంత అభాసుపాలవుతున్నదో అర్థమవుతుంది. వీరు తమ వాదనతో రాజీనామాలు చేయకపోవడాన్ని సమర్థించుకుంటుంటే, తెలంగాణ ఆకాంక్షలను వ్యతిరేకించే వారు వీళ్ళను కారణంగా చూపించి దుర్మార్గమైన వాదనలు చేస్తున్నారు.

రాజీనామాలు చేయని వారు అలావుంటే, చేసిన వారు పచ్చి అవకాశవాదులుగా వ్యవహరించారు. పేరుకు రాజీనామా పత్రాలను స్పీకర్ కార్యాలయానికి సమర్పించిన శాసనసభ్యులు తమకు అందే అధికారాలను, సౌకర్యాలను ఒక్క దాన్ని కూడా వదులుకోలేదు. ఇది రూపంలోనే రాజీనామాతప్ప, సారాంశంలో కాదు. ఇక తెలంగాణకు చెందిన మంత్రులయితే ఒక వైపు రాజీనామా పత్రాలు ఇచ్చి కూడా తమ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. అంటే ప్రభుత్వం ఏ తెలంగాణ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని ఆరోపిస్తున్నారో, ఆ విధానాలను అమలు చేసే స్థానంలోనే వున్నారు. ఇంతకంటే అనైతికత మరొకటి వుండదు.

ఇక మూడు వారాలు తాత్సారం చేసిన స్పీకర్ విదేశాలకు వెళుతూ ఒక్క కలం పోటుతో రాజీనామాలను తిరస్కరించాడు. ఈ రాజీనామాలు "భావోద్వేగంతో" చేసినవని తన పరిశీలనలో తేలిందని, కనుక రాజ్యాంగ అధికరణం 190 (3) (బి) ప్రకారం తనకున్న అధికారంతో తిరస్కరించానని ప్రకటించాడు. ఎటువంటి విచారణలు జరపకుండా, వివరణలు తెలుసుకోకుండా స్పీకర్ రాజీనామాలను తిరస్కరించటం రాజ్యాంగ వ్యతిరేకం. ఇదంతా చూస్తుంటే శ్రీకృష్ణకమిటీ రహస్య అధ్యాయంలో చెప్పిన రాజకీయ మేనేజ్‌మెంట్‌లో భాగంగానేఇది జరిగినట్లు కన్పిస్తున్నది. లేకుంటే రాజీనామాలు ఆమోదింప జేసుకోవడానికి చట్ట ప్రకారం ప్రయత్నాలు చేయటంగాని, పదవులు పూర్తిగా వదిలేసి, ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గాని వీరు చేసిందేమీ లేదు. అధిష్టానం చుట్టూ ప్రదక్షిణలు చేయటం, వీరిని మేనేజ్ చేయడానికి కేంద్రం పంపిన గులాంనబీ ఆజాద్‌తో మంతనాలు జరపటం తప్ప. ఆజాద్‌తో మీటింగ్ తర్వాత చర్చలు, సంప్రదింపుల ద్వారానే తెలంగాణ సమస్య పరిష్కారమనే పాట మళ్ళీ మొదలు పెట్టారు.

పాలకవర్గాలు ఒకరినిమించి ఒకరు పోటీలు పడి రాజీనామాలతో ఆడిన దొంగ నాటకాల వల్ల రాజ్యాంగ సంక్షోభం సృష్టించటం కల్ల అని తేలిపోయింది. ఇక అధికారపార్టీ వారైతే మంత్రి పదవులకు పూర్తిగా రాజీనామాలు చేయకుండా, ప్రభుత్వం ప్రతిష్టంభనంలో పడకుండా, రాజకీయ సంక్షోభం తలెత్తకుండా జాగ్రత్తపడ్డారు. అధిష్టానాన్ని ఇరకాటంలో పెట్టటం, రాజ్యాంగ సంక్షోభం సృష్టించటం తమ అభిమతం కాదని టి.కాంగ్రెస్ మంత్రుల బృందానికి నాయకత్వం వహించిన జానారెడ్డి మాట్లాడాడు.

ఒకవైపు ఉస్మానియా విద్యార్థుల సామూహిక నిరాహారదీక్షలతో పోరాటం, మరోవైపు మంత్రుల రాజీనామాలు తీవ్రరూపం దాల్చటం ప్రారంభమైంది. విద్యార్థుల పోరాటం తీవ్రమైన ప్రతిసారి బెంబేలెత్తిపోయే ప్రభుత్వం ఈ సారికూడ పోరాటాన్ని అడ్డుకోవడానికి వేల సంఖ్యలో పోలీసు, పారా మిలిటరీ, సరిహద్దు భద్రతా దళాలను దింపి క్యాంపస్‌ను యుద్ధ భూమిగా మార్చింది.

విద్యార్థులు పోలీసులు విసిరే భాష్పవాయు గోళాలు, అరెస్టులు, లాఠీచార్జీల నెదుర్కొని వారం రోజుల పాటు వీరోచితంగా పోరాటం సాగించారు. క్యాంపస్ చుట్టుపక్కల వడ్డెర బస్తీలో అద్దెకుంటున్న పేద విద్యార్థులను అరెస్టు చేయడానికి దండెత్తిన పోలీసులను బస్తీ వాసులు అడ్డుకున్నారు. మా బిడ్డలను మీకు అప్పగించబోమంటూ తమ గుండెల్లో దాసుకున్నారు. హాస్టళ్ళలో మెస్ బంద్ చేసి తిండికి బయటికి వెళ్ళే విద్యార్థులను, వివిధ పరీక్షలకు హాజరు కావాల్సిన విద్యార్థులను బయటికి వెళ్ళగానే ప్రభుత్వం అరెస్టులు చేయించింది. సామూహిక నిరాహారదీక్షలు చేస్తున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు తామే సమకూరుస్తామంటూ 'అమ్మల సంఘం' అండగా నిలిచింది. విద్యార్థులకు మద్దతుగా ఎవరినీ క్యాంపస్‌లోకి అడుగు పెట్టకుండా పోలీసులు అడ్డుకున్నారు. మొత్తం క్యాంపస్ అంతటా వారం రోజుల పాటు యుద్ధ వాతావరణం అలుముకుంది. ఈ నిరాహార దీక్షలకు మద్దతుగా తెలంగాణ అంతటా విద్యార్థుల, ప్రజల ఆందోళనలు తీవ్రమయ్యాయి.

దీన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా రోజూ వందల సంఖ్యలో అరెస్టులు సాగించింది. అయినా పోరాటం రోజు రోజుకూ మరింత తీవ్రరూపం దాల్చుతూ రాస్తారోకోలు, రైలు రోకోలు, బంద్‌లు, ధర్నాలు, నిరాహార దీక్షలు నిత్యకృత్యమయ్యాయి. తీవ్రమవుతున్న పోరాటాన్ని చూసి బెంబేలెత్తిన సీమాంధ్ర నాయకులు పోటీగా ఆందోళనలు మొదలు పెట్టించారు. ఢిల్లీకి వెళ్ళి అధిష్టానంతో తెలంగాణను అడ్డుకునే రాజకీయాలు మళ్ళీ ప్రారంభించారు.

ఈ దగుల్బాజీ రాజకీయాలతో తెలంగాణ రాకుండా ఆగిపోతుందని కలత చెందిన రంగారెడ్డి జిల్లా యువకుడు మందాటి యాదిరెడ్డి ఢిల్లీకి వెళ్ళి పార్లమెంట్ భవనానికి సమీపంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదిరెడ్డి మృతదేహాన్ని ఎ.పి భవన్‌కు తీసుకెళ్ళి

అక్కడ నుండి హైదరాబాద్‌కు తరలించాలని టి.ఆర్.ఎస్ నాయకులు ప్రయత్నించారు. యాదిరెడ్డి అంతిమయాత్రే మరో పెద్ద పోరాట రూపంగా మారుతుందని భయపడిన సీమాంధ్ర నాయకులు ఢిల్లీలో నీచరాజకీయాలకు పాల్పడ్డారు. యాదిరెడ్డి మృతదేహాన్ని ఎ.పి భవన్‌కు రానీయకుండా స్మశానానికి తరలించి దహనం చేయించమని అధికారులను పురమాయించారు. అది వీలుపడక పోవడంతో మృతదేహాన్ని తెలంగాణ వాదుల చేతికి దక్కనీయకుండా రాత్రికి రాత్రే ఆగమేఘాల మీద విమానంలో హైదరాబాద్‌కు పంపించారు. హైదరాబాద్‌లో కూడా తెలంగాణ మృతవీరుల స్థూపం వద్ద ముళ్ళ కంచెలు పేర్చి, 144 సెక్షన్ విధించి, కవరేజికి వెళ్ళిన మీడియాపై పోలీసులతో దాడి చేయించి, ఎవరినీ రానీయకుండా సీమాంధ్ర పెట్టుబడిదారుల కొమ్ముగాసే ప్రభుత్వం అడ్డుకున్నది. యాదిరెడ్డి మృతదేహాన్ని ఎవరి కంటపడనీయకుండా రాత్రికి రాత్రే ఆయన స్వగ్రామమైన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్ద మంగళారానికి తరలించింది.

యాదిరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొనేందుకు తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు విశేషంగా తరలిరాగా పెద్ద మంగళారం జన సంద్రంగా మారింది. ప్రభుత్వం వందలాది పోలీసులను దింపి, అడుగడుగునా దేగకళ్ళతో నిఘా వేసినా తెలంగాణ సాధించేవరకు పోరాడుతామని, యాదిరెడ్డి ఆశయాన్ని సాధిస్తామని తరలి వచ్చిన తెలంగాణ ప్రజానీకం ప్రతిజ్ఞ చేసింది. తెలంగాణ పోరుబిడ్డకు వేలవేల వందనాలతో ఘనంగా నివాళి అర్పించింది.

ఉస్మానియా విద్యార్థుల నిరహార దీక్షలు, క్యాంపస్ పోరాటాలు, యాదిరెడ్డి మృతి తర్వాత తెలంగాణ ఉద్యమం మళ్ళీ తీవ్రరూపం దాల్చటం మొదలైంది. తెలంగాణ ఉద్యోగుల సంఘం సార్వత్రిక సమ్మె చేస్తామని ప్రభుత్వానికి నోటీసు యిచ్చింది. దీనికి తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం మద్దతు ప్రకటించింది. ఇందులో భాగంగా ఉద్యోగుల సంఘం నిరహారదీక్షలు మొదలైన పోరాటాలతో ఉద్యమాన్ని ఉధృతం చేయటంలో ముందు నిలిచింది. ఇదే సమయంలో ఎస్.ఐ ఉద్యోగాల నియామకాల్లో హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా పరిగణిస్తూ తెలంగాణ అభ్యర్థులకు నష్టదాయకమైన 14 ఎఫ్ నిబంధనను ప్రభుత్వం అమలు చేయ ప్రయత్నించింది. దీనిపై తెలంగాణ వ్యాప్తంగా మరొక్కసారి ఆందోళనలు పెల్లుబికాయి. ఎక్కడికక్కడ ఉధృతమవుతున్న పోరాటాలతో ప్రభుత్వం వెనుకంజ వేసి 14 ఎఫ్ నిబంధనను రద్దు చేసింది.

మరో వైపు వరంగల్ విద్యార్థులు, రాజీనామాలు చేసి ఇంకా పదవులు పట్టుకొని వేలాడుతున్న మంత్రులు, ప్రజాప్రతినిధులను ఉద్యమంలోకి తీసుకొచ్చేందుకు వారి ఇండ్లను ముట్టడించే కార్యక్రమం తీసుకున్నారు. మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఇంటిని చుట్టిముట్టిన విద్యార్థులపై పోలీసులు దాడి చేసి, పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. దీనికి నిరసనగా తెలంగాణ వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల ముట్టడి, ధర్నాలు జరిగాయి. ఇక సెప్టెంబర్ 5నుండి ఉద్యోగులు నిరవధిక సమ్మె ప్రారంభించారు.

జూలై ప్రారంభం నుండి రెండు నెలలకు పైగా రోజుకో పోరాట రూపంతో తీవ్రమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సెప్టెంబర్ 13న 'సకల జనుల సమ్మె' రూపం తీసుకుంది. డిసెంబర్ 9 ప్రకటన వెలువడినప్పటి నుండి గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా పోరాడుతున్న యావత్తు తెలంగాణ ప్రజానీకం, ఇక తెలంగాణ సాధనే ఏకైన లక్ష్యమంటూ సకల జనుల సమ్మెకు సిద్ధమైంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముందుకు వచ్చిన అనేక పోరాట రూపాలలో సకల జనుల సాధారణ సమ్మె ఒక కలికితురాయి. 1969లో తెలంగాణ ప్రజలు సహాయ నిరాకరణ ఉద్యమాలను చేపట్టారు. అదే ఒరవడిలో 2011 జనవరి, ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సహాయ నిరాకరణోద్యమాన్ని కొనసాగించారు. ఈ సారి అది మరింత విస్తృతమై అన్ని సెక్షన్ల ప్రజలు సమ్మెకు నడుం కట్టారు. ఇప్పుడు పట్టు విడిస్తే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించటం ఎప్పటికీ సాధ్యం కాదని దృఢనిశ్చయంతో ముందుకు సాగుతున్న ప్రజలు మరింత పట్టుదలతో సకల జనుల సమ్మెకు సిద్ధమయ్యారు.

సెప్టెంబర్ 12న కరీంనగర్‌లో 'జనగర్జన' సభతో ప్రారంభమైన సకల జనుల సమ్మె నానాటికి విస్తృతమైంది. ఈ పోరాటంలో ప్రత్యేక తెలంగాణ ప్రజాస్వామిక ఆకాంక్ష మునుపెన్నడు లేని విధంగా ఉవ్వెత్తున పైకెగిసింది. తెలంగాణ ప్రజల ఐక్యత వెల్లి విరిసింది. ఉద్యోగులు, సింగరేణి, ఆర్.టి.సి, విద్యుత్ కార్మికులు, విద్యార్థులు, లాయర్లు, ఉపాధ్యాయులు ముందు పీఠిన నిలబడి ప్రారంభించిన 'సకల జనుల సమ్మె'లో చేతివృత్తుల, అసంఘటిత, మున్సిపల్ కార్మికులు, వ్యాపారస్తులు, పూజారులు, రైతాంగంతో పాటు అన్ని సెక్షన్ల ప్రజలు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనడంతో నిజమైన సకల జనుల సాధారణ సమ్మెగా మారి రోజు రోజుకు ఉధృతమైంది. వృద్ధులు, మహిళలు, పిల్లలు కూడా సమ్మెలో భాగం కావటం ఈ పోరాటం యొక్క విస్తృతికి నిదర్శనం.

సమ్మె ప్రారంభమైన నాటి నుండి ఎక్కడికక్కడ ప్రజలు ధర్నాలు, ర్యాలీలు, ప్రదర్శనలు రాస్తారోకోలు, రైలురోకోలు ఇంకా అనేక నిరసన కార్యక్రమాలతో తెలంగాణలో ప్రభుత్వాన్ని స్థంభింపజేశారు. ఆర్.టి.సి కార్మికుల సమ్మెతో తెలంగాణ ప్రాంతంనుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రైలు రొకోల

వల్ల దజన్ల కొద్దీ రైళ్ళను రద్దు లేదా దారి మళ్ళింపు చేశారు. రెవెన్యూ, విద్య, వైద్యరంగాలకు మినహాయింపు యిచ్చి అన్ని శాఖల ఉద్యోగులు సమ్మెలో పాల్గొనటంతో ప్రభుత్వ పాలన పూర్తిగా స్థంభించిపోయింది. సింగరేణి కార్మికుల సమ్మెవల్ల బొగ్గు సరఫరా పూర్తిగా నిలిచిపోయి, విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. తెలంగాణలోని ప్రభుత్వ వైద్యులు, ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. వారు వీరు అని లేకుండా చివరకు వార్తా పత్రికల పంపిణీ దారులతో సహా మొత్తం తెలంగాణలోని అన్ని సెక్షన్ల ప్రజలు సమ్మెలో పాల్గొన్నారు.

ప్రతిరోజు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, ఊరేగింపులు, మానవహారాలతో పాటు అక్టోబర్ 9న హైదరాబాద్ నుండి సింగరేణికి బస్సుయాత్ర, 11న హైదరాబాద్‌లో మహాధర్నా, 15, 16 తేదీలలో సంపూర్ణ రైల్‌రోకో, 17న అరెస్టులకు నిరసనగా బంద్ మొదలైన పోరాట రూపాలతో సహా 42 రోజుల పాటు సకల జనుల సమ్మె కొనసాగింది. అక్టోబర్ 11న మొదటగా ఆర్.టి.సి కార్మికులు సమ్మె నుండి విరమించుకోగా, ఆ తదుపరి సింగరేణి కార్మికులు, తర్వాత ఉపాధ్యాయులు ఒకరి తర్వాత ఒకరుగా సమ్మెనుండి విరమించుకున్నారు. మొట్టమొదటగా సకల జనుల సమ్మెకు సైరనూదిన ఉద్యోగుల జెఏసి సమ్మె విరమణ ప్రకటనతో 42 రోజులుగా సాగిన సకల జనుల సమ్మె ముగిసినట్లయింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మె ఒక మలుపు వంటిదనటంలో సందేహంలేదు. ఈ సమ్మె అనేక అనుభవాలతో పాటు, కొన్ని పాఠాలను కూడా అందించింది. పోరాటంలో ప్రజల ఐక్యత మున్నెన్నటికంటే పెరిగింది. జూలై నుండి అక్టోబర్ వరకు నాలుగు నెలల పాటు నిరంతర పోరాటాల్లో అనేక కొత్త కొత్త పోరాట రూపాలు ముందుకొచ్చాయి. ముఖ్యంగా సకల జనుల సమ్మె తెలంగాణ యావత్తు ప్రజానీకాన్ని కదిలించింది. సీమాంధ్ర పెట్టుబడిదారులు, దోపిడి పాలకవర్గాలు అంత తేలికగా తమ ప్రయోజనాలను వదులుకోరనీ, ఇంకా బలమైన సుదీర్ఘమైన, మిలిటెంట్ పోరాటాలకు మరింత ఐక్యతతో సిద్ధం కావలసిన అవసరాన్ని కూడ తెలియజెప్పింది. సమ్మె విరమణ జరిగినప్పటికీ అది సాధించిన విజయాలు, వేసిన ప్రభావాలు తక్కువ కాదు. వీటిని నిష్పక్షపాతంగా సమీక్షించుకొని, ఉద్యమ శ్రేణులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.

## సమ్మె ప్రభావాలు

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో దానిపై ఆధారపడిన థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఈ థర్మల్ విద్యుత్ కేంద్రాల విద్యుత్‌పై ఆధారపడిన అనేక రాష్ట్రాల్లో తీవ్రమయిన విద్యుత్ సంక్షోభం ఏర్పడింది. ఈ విద్యుత్ సంక్షోభం ఢిల్లీని కూడ తాకింది. దీన్ని ఎలా ఎదుర్కొవాలో తెలియక అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాయి. సింగరేణి బొగ్గు దేశ ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ఎంత కీలకమయిందో, సమ్మె సందర్భంగా తెలంగాణ ప్రజలకు, దేశ ప్రజలకు మరోమారు తెలిసింది. రవాణా రంగంలోని కార్మికుల సమ్మె, జాతీయ రహదారులపై ప్రజల బైటాయింపులు, పెట్రోల్ పంపుల బంద్, ఆటోల బంద్, రైళ్ల బందలతో సెప్టెంబర్ 19, 24, 25, అక్టోబర్ 15, 16 తేదీలలో రవాణా రంగం పూర్తిగా స్థంభించి పోయింది. హైదరాబాద్‌లో అప్రకటిత బంద్ జరిగినట్లు అయింది.

42 రోజుల సమ్మె దేశం మీద ముఖ్యంగా కేంద్ర పాలకవర్గాల మీద వేసిన ప్రభావాలు, అనంతర పర్యావసనాలు సమ్మె సాధించిన విజయాలుగానే చూడాల్సి వుంటుంది. సమ్మె పర్యావసనాలుగా చెప్పుకొనేవాటిలో తెలంగాణ ఉద్యమ శ్రేణుల్లో, ప్రజల్లో వెల్లివిరిసిన ఐక్యత ప్రముఖంగా చెప్పుకోదగినది. ఒక రాజకీయ డిమాండ్‌పై అన్ని పార్టీల అనుబంధ యూనియన్లు, స్వతంత్ర యూనియన్లు కూడ ఒక్కటై తమ మధ్య వున్న రాజకీయ, సైద్ధాంతిక, వ్యక్తిగత వైరుధ్యాలను, విభేదాలను పక్కన బెట్టి సమ్మె చేయడం అపూర్వం. ప్రజలు మతాలకు, కులాలకు అతీతంగా కదిలి రావడం ఉద్యమం సాధించిన అద్భుత విజయం. ఈ వెల్లువెత్తిన ఐక్య ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమంలో ప్రజలు లేరని, ఇది రాజకీయ నిరుద్యోగులు రెచ్చగొట్టిన ఉద్యమం అంటూ చేస్తున్న దుష్ప్రచారం ఒక కుట్ర అని, అబద్ధం అని సమ్మె దేశానికి నిర్ద్వంద్వంగా తెలియజెప్పింది. దేశ, విదేశాల ప్రజల దృష్టిని తన వైపుకు మళ్ళించుకున్నది. దేశంలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలను, ఇతర ఉద్యమాలను నడపడానికి ఈ పోరాటం తప్పనిసరిగా స్ఫూర్తి దాయకం అవుతుంది.

సమ్మె ప్రభావాలు ఢిల్లీని అతలాకుతలం చేశాయి. కండ్లు మూసుకొని నిద్ర నటిస్తున్న కేంద్ర పాలకులపై సమ్మె కొరడా ఝుళిపించింది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కాకపోతే తెలంగాణలో కాంగ్రెస్‌కు నూకలు చెల్లినట్లేనన్న స్పృహను, అభద్రతను కేంద్ర పాలకులకు కలిగించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒక న్యాయమైన, ప్రజాస్వామ్యయుతమైన రాజ్యాంగబద్ధ డిమాండ్‌గా దేశం గుర్తించేటట్లు చేయగలిగింది. దేశంలోని పౌర సమాజం, మేధావి వర్గం, జాతీయ పత్రికలు, మీడియా తెలంగాణను

పట్టించుకోకుండా వుండలేని పరిస్థితి. అంతర్జాతీయ పత్రికల్లో, వెబ్ మ్యాగజైన్లలో కూడ తెలంగాణపై విస్తృత చర్చ జరుగుతున్నది. ఇవి సకలజనుల సమ్మె సాధించిన అద్భుతమైన, గుణాత్మకమైన విజయాలు. మొత్తంగా సకలజనుల సమ్మె తెలంగాణ ప్రజల ఐక్యతను, ఆకాంక్షను, నిరసనను ప్రదర్శించటంలో అసాధారణమైన విజయం సాధించింది. అపూర్వమైన సాంప్రదాయాలను నెలకొల్పింది.

అదే సమయంలో తప్పనిసరిగా నేర్చుకోవలసిన పాఠాలను కూడ అందించింది. వాటిని సరిగా గ్రహించి అన్వయించుకోవడం వల్లనే భవిష్యత్ తెలంగాణ ఉద్యమం విజయం సాధించ గలుగుతుంది. సకలజనుల సమ్మె ప్రజలందరి భాగస్వామ్యంతో సాగింది. కాని ప్రధానంగా పాల్గొనవలసిన, ముందుండవలసిన, ప్రజలకు ప్రతినిధులమని చెప్పుకునే రాజకీయ వర్గాల దోషపూరిత వైఖరి, దివాళాకోరుతనం, ద్వంద్వవైఖరి వల్ల సమ్మెకు తొలి నుంచీ లోలోపలనే చీడ పాకింది. అంతర్గత లోపాలతో పాటు బయటి నుంచి తెలంగాణ ప్రత్యర్థి వర్గాలు, పాలకవర్గాలు, ప్రచార సాధనాలు సకలజనుల సమ్మె మీద పెద్ద యెత్తున దాడి చేశాయి. సమ్మెకు వ్యతిరేకంగా విద్యార్థులను, ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టారు. సమ్మె నాయకత్వాలను, శ్రేణులను కొనివేయడం, బెదిరించడం చేశారు. ఆ ప్రయత్నాలు కుదరనప్పుడు దమననీతికి పాల్పడ్డాయి. ఇంటా బయటా సాగిన ఈ దాడులతో సకలజనుల సమ్మె పెట్టుకున్న లక్ష్యాలను సాధించకుండానే విరమించవలసిన స్థితి ఏర్పడింది. గత పోరాటాల అనుభవాల నుండి పాఠాలు తీసుకొని సకలజనుల సమ్మెను పటిష్టంగా రూపొందించడంలో నాయకత్వం యొక్క కృషిలో లోపం స్పష్టంగా కనిపిస్తుంది. కలిసివచ్చే మిత్రులందరిని కలుపుకొని ఉమ్మడి పోరాట రూపాలు రూపొందించడంలో, రాజకీయ జె.ఏ.సీ అన్ని జె.ఏ.సీ.లను ముఖ్యంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ వంటి వాటిని కలుపుకొని రాలేక పోవడంతో ఉద్యమానికి ఎనలేని నష్టం జరిగింది. ఇది ముఖ్యమైన లోపం. రాజకీయ జె.ఏ.సీ నాయత్వం కనీస ఐక్యత, చిత్తశుద్ధిని ప్రదర్శించలేక పోయింది. అయినప్పటికీ ఒక రాజకీయ డిమాండ్‌పై అన్ని జె.ఏ.సీలు, ఉద్యమ సంస్థలు ఒక్కటై తమ మధ్య వున్న రాజకీయ, సైద్ధాంతిక, వ్యక్తిగత వైరుధ్యాలను, విభేదాలను పక్కన బెట్టి సమ్మె చేయడం ఎంతో మంచి పరిణామం. ఇది భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తి దాయకమవుతుంది. ఐక్యతకు కృషి చేయని రాజకీయ జె.ఏ.సి పెద్దన్న పాత్ర వహించినప్పటికీ, కలిసి వచ్చిన అన్ని సంస్థలు ఐక్యతతో పనిచేయడం ఐక్యసంఘటనకు ఎంతో ప్రయోజనకరమైనది. దీనివల్ల ప్రజలలో అద్భుతమైన ఐక్యత, చిత్తశుద్ధి, ఆశయ స్పష్టత ప్రదర్శితమైంది.

సకలజనుల సమ్మె పిలుపు ఇవ్వడంలోనే రాజకీయ జె.ఏ.సీ, టి.ఆర్.ఎస్‌ల నాయకత్వం వెనకా ముందు అయింది. ఆగస్టు మొదటి వారం అని, ఆగస్టు 17 అని వాయిదాలు వేసుకుంటూ పోయి, చివరికి ప్రజల నుంచి పెరిగిన ఒత్తిడితో సెప్టెంబర్ 13న ప్రారంభించారు. సమ్మె ప్రారంభించిన తర్వాత అందులో ఉద్యోగులు, కార్మికుల వరకే కాకుండా కోట్లాది సాధారణ ప్రజలు పాల్గొనే విధంగా మార్గ నిర్దేశనం చేయలేదు. ఇచ్చిన పోరాట రూపాలు ప్రభుత్వ, ప్రత్యర్థుల మెడలు వంచే శక్తివంతమైన మిలిటెంట్ పోరాట, ప్రతిఘటనా రూపాలు కాక, ప్రదర్శనలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలు, ధూంధాంలు, వంటావార్పు, ఆటపాటలు, దిష్టిబొమ్మల దహనాలు, శవదహనాలు, పిండప్రదానాలు, యాగాలు, ఎక్కువకెక్కువ నిరహారదీక్షలకే పరిమతమయ్యాయి. ఇవి బ్రాహ్మణీయ, హిందూమత భావజాలన్ని, మూఢనమ్మకాలను పెంచి పోషించేవేగాని, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షతో ఎటువంటి సంబంధమున్నవి కావు. 42 రోజుల ఉద్యమంలో 9వ నంబర్ జాతీయ రహదారిపై ప్రజలు రెండు రోజుల పాటు జరిపిన రాస్తారోకో ఒక్కటే ప్రతిఘటనా స్థాయిలో కన్పించింది. అయితే మిగతా పోరాట రూపాలు తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమ స్ఫూర్తిని నిలిపి వుంచడానికి తోడ్పడ్డాయి. సింగరేణి, ఆర్.టి.సి ప్రభుత్వోద్యుగులు సమ్మెకు దిగడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో ఆర్థిక సంక్షోభం తలెత్తి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడింది. సమ్మెను ఏదో విధంగా ముగింప జేయాలనే ఆతురతతో డిమాండ్లపై చర్చలకు సిద్ధమైంది తప్ప, లేకుంటే అసలే లెక్క చేయదు.

తెలంగాణ ఆకాంక్ష విషయంలో కలిసివచ్చే 95 శాతం మిత్రులను కలుపుకొని, వ్యతిరేకించే ప్రత్యర్థులను అడ్డుకోవడానికి ఉద్యమ నాయకత్వం ప్రయత్నించలేదు. మిలిటెంట్ పోరాటాలను చేపడుతూ, విస్తృత ప్రజానీకాన్ని సమ్మెకు మద్దతుగా కదిలించి ప్రభుత్వాన్ని స్తంభింపజేసే వైపు ఎత్తుగడలు చేపట్టకుండా ప్రజలను సాధారణ రూపాల్లో లేదా సమ్మెకు దూరంగా వుంచడానికి రాజకీయ జె.ఏ.సీ/ టి.ఆర్.ఎస్ పూనుకున్నాయి. సమ్మెలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను ధైర్యంగా ముందుకు తీసుకొని రాలేకపోగా చివరికి సమ్మెను పాక్షిక డిమాండ్‌లపై విరమింపజేసింది. తెలంగాణకు ప్రధాన ప్రత్యర్థి శక్తులైన రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని, కోస్తాంధ్ర–రాయలసీమ పెట్టుబడిదారీ, సంపన్న వర్గాలను, తెలంగాణ దళారీలను దెబ్బతీసి, లొంగదీసే పోరాటాలు చేయకుండా తెలంగాణ రాష్ట్రం సిద్ధించదు.

యాభై అయిదేళ్ళుగా తెలంగాణ ఇవ్వకుండా మోసగిస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను అడుగడుగునా ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపరిచే పోరాటాలను ఉద్యమ నాయకత్వం ప్రజలకు ఇవ్వలేదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేస్తూ, తెలంగాణ రాకుండా అడ్డుపడుతున్న కోస్తాంధ్ర – రాయలసీమల సంపన్న పాలకవర్గాల రాజకీయార్థిక ప్రయోజనాలను దెబ్బతీసే పోరాట రూపాలను చేపట్టలేదు. తెలంగాణ వనరులపై ఆధిపత్యం చెలాయిస్తూ, వ్యాపారాలు, కాంట్రాక్టులు, సినిమా, మీడియా రంగాల ద్వారా తెలంగాణను దోచుకుంటున్న వీరి ఆర్థిక మూలాలను పెద్దయెత్తున దెబ్బతీసే పోరాటాలు చేపట్టలేదు. వీరికి దళారీలుగా తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రాంతీయ ద్రోహుల రాజకీయార్థిక ప్రయోజనాలను దెబ్బతీసే పోరాట రూపాలు చేపట్టలేదు. విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలుగుతున్నదని ప్రభుత్వ ప్రేరిపిత మధ్యతరగతి కుటుంబాల ప్రజలు గోల ప్రారంభించారు. వీరికి ధ్వంసం అయిపోతున్న తెలంగాణ ప్రజల బతుకుల గురించి బలంగా అర్థం చేయించి సమ్మెకు ఒప్పించడంలో నాయకత్వం తగినంత కృషి చేయలేదు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనపట్ల ఉద్యమ నాయకత్వానికి చిత్తశుద్ధి లేకపోవడమే అటువంటి పోరాటాలు చేపట్టకపోవడానికి కారణమనేది స్పష్టంగానే అర్థం అవుతున్నది. ఉద్యమాన్ని ముందుకు తీసుకపోకుండా నాయకత్వం "జరిగేది జరగనీ" అనే గాలి వాటు ధోరణి, అలసత్వంతో వ్యవహరించింది. ఫలితం లేని పోరాట రూపాలైనా ఫరవాలేదుగానీ, ఉద్యమం తమ చేతులు దాటి పోయే మిలిటెంట్ పోరాట రూపాలు మాత్రం చేపట్టవద్దని అతి జాగ్రత్తతో సమ్మెను నడిపించారు. సకలజనుల సమ్మె మధ్యలోనే ప్రత్యేక తెలంగాణపై తమ వాదన కేంద్ర ప్రభుత్వానికి వినిపించడానికని ఢిల్లీకి వెళ్ళివచ్చిన తర్వాత అదను చూసి సమ్మె విరమించారు. ఇదంతా టి.ఆర్.ఎస్ అధ్యక్షుడు కె.సి.ఆర్, రాజకీయ జె.ఏ.సీ. అధ్యక్షుడు కోదండరాం, ఉద్యోగ సంఘాల జె.ఏ.సీ అధ్యక్షుడు స్వామిగౌడ్‌లు కాంగ్రెస్ అధిష్టానంతో చేసుకున్న రహస్య ఒప్పందం ప్రకారం జరిగిన కుట్ర అనేది స్పష్టమే. అందులో భాగంగానే "తెలంగాణ సాధించలేకపోతే విషం తాగి చచ్చుడే అని, ఇక భవిష్యత్‌లో సమ్మెలు, బంద్‌లు వుండవని" కె.సి.ఆర్ ప్రజలకు పిరికి మందు పోసే వ్యాఖ్యలు మొదలు పెట్టాడు. తమ ప్రభావంలోని ప్రజలు విస్తృతంగా సమ్మెలో పాల్గొనకుండా సాధ్యమయినంతగా ఆపే ప్రయత్నాలు చేశారు. బాన్సువాడ ఉపఎన్నిక కోసం సంపూర్ణ రైల్‌రోకోను వాయిదా వేసి, చివరికి మూడు రోజులది రెండు రోజులతో ముగించారు. తెలంగాణ రోడ్ మ్యాప్ ప్రకటించమని కొట్లాడిన ఉద్యమ కారులను వక్రమార్గం పట్టిస్తూ, ఉద్యమాన్ని ఎలా నిర్వీర్యం చేయాలో, ఏయే దశల్లో ఎవరిని విరమింప జేయాలనే 'విరమణల రోడ్‌మ్యాప్' తీసుకొని కేంద్రంతో కుమ్మక్కయ్యారు. సహాయ నిరాకరణ అర్థాంతరంగా విరమించినందుకు వచ్చిన అపవాదు మళ్ళీ రాకుండా పథకం ప్రకారమే ఉద్యోగుల జె.ఏ.సీ అందరికంటే చివరిగా సమ్మె నుండి విరమించుకునేటట్లు స్వామిగౌడ్‌తో నాటకం నడిపించారు. సీమాంధ్ర పాలకవర్గాలు, కాంగ్రెస్ అధిష్టానం పెట్టిన ప్రలోభాలకు వీరు ముగ్గురు అమ్ముడుబోయారు. తమ వ్యాపార లావాదేవీల కోసం తమ కుటుంబ రాజకీయాల కోసం ఉద్యమానికి తీరని ద్రోహం తలపెట్టారు. రాజకీయ లబ్ధి కోసం కె.సి.ఆర్ పదేళ్ళుగా ఉద్యమాన్ని ఎన్నికల చుట్టూ తిప్పుతున్నాడు. ఇప్పుడు 2014 ఎన్నికలపైన కన్ను వేశాడు. కాలాయాపన చేస్తూ, కాకమ్మ కబుర్లు చెబుతున్నాడు. నిజాయితీతో సకలజనుల సమ్మెలోకి వచ్చిన అనేక డిపార్టుమెంట్లు, లక్షలాది ఉద్యోగులు, కార్మికులకు ఉమ్మడి కార్యక్రమం లేకుండా ఉద్యమాన్ని ఉధృతం చేయకుండా కె.సి.ఆర్, కోదండరాం, స్వామిగౌడ్‌లు నిర్వీర్యం చేశారు.

60 యేళ్ళ చరిత్రలో రాజకీయ పార్టీలది మోసపూరితమైన పాత్రనే, చెన్నారెడ్డిని మించిన ద్రోహం ప్రస్తుతం మన కండ్లముందు జరుగుతున్నది. అన్ని రాజకీయపార్టీలు ఉద్యమాన్ని ప్రజల చేతుల్లోకి పోకుండా తమ తమ ప్రయోజనాలకు అనుకూలంగా వాడుకోవాలని చూశాయి. సకల జనుల సమ్మె ప్రభావంతో ప్రజల నుంచి వేరు పడతామనే భయాందోళనలతో తెలంగాణాలోని పాలక పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం, బి.జె.పిలు మళ్ళీ రాజీనామాల నాటకం మొదలు పెట్టాయి. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తమ అధిష్టానం మీద ఒత్తిడి చేస్తూ తెలంగాణ సాధన కోసం ప్రయత్నిస్తున్నట్లుగా ప్రజల ముందు ప్రదర్శన చేశారు. సమ్మె ఉధృతం కావటంతో హుటాహుటిన ఢిల్లీకి వెళ్ళి తెలంగాణ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నానని చెప్పుకుంటున్న గులాం నబీ ఆజాద్‌తో మంతనాలు జరిపారు. సకల జనుల సమ్మెను నీరుగార్చడానికి వీరితో కలిసి గులాంనబీ ఆజాద్ చేయవలసిన కుట్రలన్నీ చేశాడు. మరోవైపు హైదరాబాద్ లేని తెలంగాణ, రాయల తెలంగాణ ఏర్పాటు వంటి ప్రచారాలు కూడా చేశారు. హైదరాబాద్ లేని తెలంగాణ ఏర్పాటు ప్రతిపాదనలు వేటినీ తెలంగాణ ప్రజలు ఎన్నటికీ ఆమోదించరు. ఇక ఆజాద్‌తో మంతనాలు జరిపిన టి.కాంగ్రెస్ నాయకుల తరపున సకలజనుల సమ్మెను విరమించవలసిందిగా జానారెడ్డి విజ్ఞప్తులు మొదలు పెట్టాడు. కాంగ్రెస్ తెలంగాణకు పచ్చి వ్యతిరేకి అనేది,

టి.కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక తెలంగాణ సాధన కంటే అధిష్టానం అడుగులకు మడుగులొత్తుతూ తమ పదవులను కాపాడుకోవటం, అధికారం దక్కించుకోవటమే ముఖ్యమనేది మున్నెన్నటికంటే మరింత స్పష్టంగా బహిర్గతమైంది.

వీరెవ్వరికీ ప్రత్యేక తెలంగాణ సాధించాలని లేదు. ఈ విషయం పదే పదే రుజువవుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఎవరికి వారు రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారు. ఈ నేపధ్యంలో ఉద్యమాన్ని తమకు అనుకూలమైన వైపుకు మళ్ళించేందుకు ప్రతి పార్టీ ప్రయత్నిస్తున్నది. ఓట్ల రాజకీయాలను పక్కకు నెట్టి ఉద్యమాన్ని మిలిటెంట్‌గా ముందుకు తీసుకపోవల్సిన సమయంలో, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటంగా సాగుతున్న సకల జనుల సమ్మెను ఈ దగుల్బాజీ పార్టీలన్నీ ఎన్నికల వైపు తిప్పి పక్క దారి పట్టించడానికే ప్రయత్నించాయి. బాన్సువాడ ఉపఎన్నికలో ఇది మరింత నగ్నంగా బహిర్గతమైంది. తెలంగాణ సమస్యను ఏదో విధంగా 2014 ఎన్నికల వరకు సాగదీయాలని చూస్తున్నారు. అందుకు తాత్సారం చేసే ఎత్తుగడలు అవలంభిస్తున్నారు. ఈ సాగదీత ఎత్తుగడలను ప్రజలు తిప్పికొట్టాలి.

సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పాలక వర్గాలు త్రిముఖ వ్యూహం రచించాయి. అవి 1. నాయకత్వాన్ని లొంగదీసుకొని ప్రలోభపెట్టి సమ్మెను విరమింపజేయడం. 2. సమ్మె చేస్తున్న ఉద్యోగులు, ప్రజాశ్రేణులపై నిర్బంధాన్ని, అణచివేత చర్యలను అమలుచేసి ఉద్యమ నాయకత్వాన్ని ఉద్యమం నుండి దూరం చేయడం. 3. ఉద్యమంలో లేని బయటి వ్యక్తులచే ఉద్యమ నాయకత్వంపై దాడి చేయించడం. సమ్మెను అణచడానికి ప్రభుత్వం తీవ్ర నిర్బంధకాండ కొనసాగించింది. కార్మికుల, ఉద్యోగుల హక్కుల్ని కాలరాచి వేసే ఎస్మా ప్రయోగానికి సిద్ధమైంది. ఫ్యాక్టరీలను, గనులను, ఆఫీసులను పోలీసు క్యాంపులుగా మార్చివేసింది. ప్రదర్శనలపై రబ్బరు తూటాల ప్రయోగం, అక్రమ అరెస్టులు, బెదిరింపులు చేసింది. సమ్మెలో విచ్ఛిన్నకారుల్ని చొప్పించి కార్మికులపై దాడులు చేయించింది. ఈ అణచివేత, విచ్ఛిన్నం చేసే కుట్రలో సీమాంధ్ర నాయకులు, ముఖ్యంగా లగడపాటి రాజగోపాల్ ముందు నిలిచాడు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, డి.జి.పి దినేష్ రెడ్డి కలిసి సకల జనుల సమ్మె అణచివేతకు నాయకత్వం వహించారు. హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ మంత్రులు దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్, మజ్లిస్ నాయకులైన ఒవైసీ బ్రదర్స్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా ద్రోహులుగా పనిచేశారు. అత్యంత ఉన్నత స్థాయిలో జరుగుతున్న సకల జనుల సమ్మె ఆంధ్ర ప్రదేశ్‌లోనూ, దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ప్రచారం జరగకుండా చూడాలనే శ్రీకృష్ణకమిటి రహస్య అధ్యాయం సూచనల ప్రకారం ప్రభుత్వం, పాలకవర్గాలు మీడియాను కంట్రోల్ చేశాయి. మొత్తం మీద ప్రభుత్వం రచించిన ఈ త్రిముఖ వ్యూహం పాక్షికంగానే ఫలించింది. విద్రోహం, ప్రలోభాలు, కొన్ని శ్రేణుల నిరాశా, నిస్పృహ మొదలైన అనేక కారణాలతో సమ్మె విరమణ జరిగింది. సమ్మె విరమణ వెనక దాగిన విద్రోహాన్ని అర్థం చేసుకోవాలి. సకలజనుల సమ్మెలో సర్వం కోల్పోవడానికి సిద్ధపడ్డది ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు. కానీ సర్వనాశనం చేసింది రాజకీయ పార్టీల నేతలే. ఇది విరమణ కాదు, పార్టీల విద్రోహమే. ఈ విద్రోహులకు ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారు. వీరిని గ్రామాలకు రానివ్వకుండా తరమకుంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యంకాదు.

ఇంతటి మహత్తర ఉద్యమం మరోసారి సాధ్యమా అని అనుకుంటున్న వారందరికి ఇదొక నిరాశనే మిగిల్చింది. సమస్తమూ ఆగిపోయినట్లేనేమో అనే సందేహాలు తలెత్తాయి. కానీ ఒక వెనుకంజతోనే ఉద్యమం ఆగిపోయినట్లు కాదు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలోనే చూస్తే కనీసం మూడుసార్లు 1953, 1969–71, 99–2001 ఉద్యమం దమన నీతికి గురై అపజయాన్ని ఎదుర్కొంది. కానీ విప్లవాల పురిటిగడ్డన మహోన్నత త్యాగాల వారసత్వంతో తెలంగాణ ఉద్యమం కొత్త ఊపిర్లు అందుకొని ఎప్పటికప్పుడు నూతన దశకు ఎదిగింది. ఇప్పుడు కూడ సకలజనుల సమ్మె విరామం అంతిమ విరమణ కాదు, కాకూడదు. తెలంగాణ రాష్ట్ర సాధన కష్ట తరమైన పోరాటాలకు సిద్ధపడటం ద్వారానే సాధ్యమవుతుంది. ప్రజల కనీస హక్కులను కూడా కాలరాచి వేసే ఈ పాలక వర్గాలు అంత సులభంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభిస్తారని ఆశించడం ఇసుక నుంచి తైలం తీయడం లాంటిదే. తెలంగాణ ప్రజలు తమ కనీస హక్కుల సాధనకు ఎంత రక్తం ధారపోయవలసి వచ్చిందో తెలిసిందే. దీర్ఘకాలిక, సమైక్య, మిలిటెంట్ ఆందోళనలకు సిద్ధంకావడం, పోరాటమే ఏకైక మార్గంగా ముందుకు సాగడం ద్వారానే కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ సాధించడం జరుగుతుంది. ఇది సకల జనుల సమ్మె ద్వారా మరింత స్పష్టమైన సత్యం. అది నేర్పిన పాఠాలను సరిగా గ్రహించి భవిష్యత్ పోరాటాలకు అన్వయించుకోవాలి. విద్రోహులను తన్ని తరమాలి. నిజమయిన పోరాట శక్తులన్ని ఏకమై మరింత బలమైన ఐక్యతతో సకలజనుల సమ్మెను మరింత ఉన్నత పోరాటరూపంగా మలచి ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ సాధించే వరకు అవిశ్రాంతంగా పోరాడాలి.

# అవినీతి వ్యతిరేక పోరాటంలోని కుట్రను బహిర్గతం చేద్దాం! నిజమైన ప్రజాస్వామిక ఉద్యమంగా మలుద్దాం!!

ఈ సంవత్సర ప్రారంభం నుండి అవినీతికి వ్యతిరేకంగా సమాజంలో కదలిక కనబడుతోంది. అవినీతిని నిర్మూలించడానికి లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఏప్రిల్‌లో అన్నా హజారే చేపట్టిన నిరసన దీక్షతో ఇదొక ఆందోళనా రూపం తీసుకుంది. నాటి నుండీ ఈ ఆందోళన కొనసాగుతూనే వుంది.

## అవినీతి వ్యతిరేక పోరాట నేపథ్యం

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా ఈ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని కూడగట్టుకున్న పోరాటం మరొకటి లేదు. ఈ మధ్య కాలంలో పలు కుంభకోణాలు వెలుగుచూశాయి. ఐ.పి.ఎల్., కామన్‌వెల్త్, ఆదర్శ్, దేశంలోనే అతి భారీదైన 2జి స్పెక్ట్రం, ఎస్ – బ్యాండ్ స్పెక్ట్రం... ఇవన్నీ ఇటీవలి కాలంలో వెలుగు చూసినవే. గనులనూ, భూములను ఇష్టం వచ్చినట్టు కబ్జా చేసుకుంటున్న గాలి జనార్దన్ రెడ్డి, వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తదితరుల అవినీతి బాగోతాలు తెరమీదకొచ్చిందీ ఈ కాలంలోనే. మొత్తంగా యు.పి.ఎ. పాలనా కాలంలో మునుపెన్నడూ లేని స్థాయిలో అవినీతి కార్యకలాపాలు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజల్లో అవినీతి మీద చర్చ, వ్యతిరేకత తీవ్రం కాసాగాయి. ప్రజల్లో రగులుతోన్న అసంతృప్తి, అసహనాలే యీ ఆందోళనకు నేపథ్యం.

నిజానికి అవినీతి మనకు కొత్త కాదు. 1947కు ముందూ తర్వాతా కూడా అవినీతి వుంది. నవ భారత నిర్మాతగా చెప్పుకునే నెహ్రూ పాలనలోనే కుంభకోణాలకు తెరలేచింది. నాటి నుండీ నేటి వరకూ ఎన్నెన్నో. దేశ ప్రధానులకు ప్రత్యక్షంగా సంబంధం వున్న బోఫోర్స్, తెహల్కా తదితర కుంభకోణాలు చాలా ప్రాచుర్యాన్ని పొందాయి. దేశంలో ఇప్పటి వరకూ 73 లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయి. ప్రపంచంలో వున్న 178 దేశాల్లో అవినీతిలో మన దేశం 87వ స్థానాన్ని సంపాదించుకుంది.

అక్రమంగా ఎన్నికల్లో గెలవడం, అధికారంలోకి రావడం, సామ్రాజ్యవాదులకూ, బహుళజాతి కంపెనీలకూ, నిరంకుశ దళారీ బూర్జువాలకు అనుకూలంగా విధానాలను రూపొందించడం, సెజ్‌ల కోసం, పరిశ్రమల కోసం వందల ఎకరాల భూమినీ, గనులనూ కట్టబెట్టడం, తమ అనుకూలురకు కాంట్రాక్టులు కట్టబెట్టడం, ఆదాయానికి మించి ఆస్తులుండడం, పన్నులు ఎగవేయడం, ఆదాయానికి లెక్క చూపకపోవడం... ఇదంతా అవినీతే. ఈ లెక్కన చూస్తే ఏ బూర్జువా రాజకీయ పార్టీ నాయకులైనా, పార్టీలైనా, పారిశ్రామిక వేత్తలైనా, వ్యాపారులైన అవినీతికి అతీతంగా వుంటారనుకోవడం అమాయకత్వమే.

అవినీతి పొడచూపని రంగం లేదు. పథకం లేదు. పేదలకు లబ్ధి చేకూర్చే పేరుతో ప్రవేశపెడుతున్న పథకాలన్నీ రాజకీయ నాయకుల, ప్రభుత్వాధికారుల అక్రమార్జనకే ఉపయోగపడుతున్నాయి. లంచమిస్తేనే వ్యాపార అవకాశాలుంటాయని రతన్‌టాటా లాంటి అవినీతిపరులే వాపోతున్నారు. అభివృద్ధి పేరిట కేటాయిస్తున్న దాంట్లో కేవలం 15 శాతం మాత్రమే సద్వినియోగం అవుతున్నదని అప్పట్లోనే రాజీవ్ గాంధీ అన్నాడంటే ఇప్పుడు పరిస్థితి ఇంకెలా వుందో అర్థం చేసుకోవచ్చు. అవినీతి వల్ల దేశం ప్రతీ ఏటా 72 వేల కోట్లు నష్టపోతున్నదని సర్వేలు చెబుతున్నాయి. 2009లో దేశంలోని పౌరులు ఒక్కొక్కరిపై అవినీతి వలన రెండు వేల రూపాయల భారం పడిందని పదేళ్ల క్రితం కన్నా ఇది 260 శాతం అధికమనీ సర్వేలు పేర్కొంటున్నాయి.

పెరుగుతున్న అవినీతి నల్లధనాన్ని విపరీతంగా పెంచేస్తుంది. స్విస్ తరహా విదేశీ బ్యాంకుల్లో 73 లక్షల కోట్ల నల్లధనం వుందని సాక్షాత్తూ మన్మోహనే ప్రకటించాడు. ఇంకా దేశంలో మరెన్ని కోట్లు వుందో. 'ప్రతియేటా లక్షా 30 వేల కోట్ల రూపాయల నల్లధనం దేశ సరిహద్దులు దాటిపోతున్నా తాము చెయ్యగలిగింది ఏమీ లేదని' కేంద్ర నిఘా సంస్థ సారథిగా పదవీ విరమణ చేసిన ప్రత్యూష్ సిన్హా అన్నాడు. 2001–06 మధ్య కాలంలోనే 51 లక్షల కోట్ల నల్లధనం తరలిపోయినట్టు ఒక అంచనా. స్విస్ తరహా బ్యాంకుల్లో మూలుగుతున్న ధనంలో భారత దేశందే అత్యధికమని వికీలిక్స్ అధినేత జులియన్ అసాంజ్ పేర్కొన్నాడు. ఒకవైపు దేశంలో రోజుకు 20 రూపాయల ఆదాయం కూడా లేక మూల్గుతున్న కుటుంబాలు 70 శాతం వుంటే మరోవైపు ఆ పేదల రక్తమాంసాలను జుర్రుకొని పోగేసుకున్న సంపద విదేశాల్లో మూలుగుతోంది. ఒక వైపు పేదరికం ఈ స్థాయిలో వుంటే దీని నిర్మూలనకు ఎటువంటి సమర్థవంతమైన చర్యలు చేపట్టని ప్రభుత్వాలు గత మూడేళ్లలో కార్పోరేట్ సంస్థలకు 13 లక్షల కోట్ల విలువైన రాయితీలను ఇచ్చింది. దీన్ని అవినీతి కాదని ఎవరైనా అనగలరా?

'స్వాతంత్ర్యం అనంతరం దేశం ఎదుర్కుంటున్న అతి పెద్ద సమస్య నల్లధనం. దీన్నేదో పన్నుల ఎగవేత చర్యగా చూడకుండా జాతిద్రోహంగా పరిగణించాల'ని ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. విదేశాల్లో డబ్బు దాచుకునేది కేవలం పన్నులు ఎగ్గొట్టడానికి మాత్రమే కాదు. లెక్కల్లో చూపలేని అక్రమార్జనను ఇలా తరలిస్తున్నారు. మళ్లీ విదేశాల నుంచి బినామీ కంపెనీల ద్వారా ఆ డబ్బును పెట్టుబడులుగా మన దేశానికి తరలిస్తున్నారు. ఇండోనేషియా వంటి చిన్న చిన్న దేశాల నుండి కూడా ఎక్కువగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడానికి కారణం ఇదే. నల్లడబ్బును వెనక్కి తెచ్చేందుకు వంద రోజుల్లో చర్యలు తీసుకుంటామని 2009 ఎన్నికల సందర్భంగా మన్మోహన్ సింగ్ హామీ ఇచ్చారు. కానీ ఆ దిశలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. విదేశాల్లో నల్ల ధనాన్ని దాచుకున్న వారి జాబితాను కూడా గోప్యంగా వుంచుతున్నారు. ఆ జాబితాలో కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల, సోనియా సన్నిహితుల పేర్లు వున్నాయనీ అవి బయటకు వస్తే ప్రభుత్వమే కూలిపోతుందని భావిస్తున్నారు.

ఈ నల్లధనాన్ని దేశానికి రప్పించి సద్వినియోగం చేస్తే దేశంలో పేదరికం అనేది లేకుండా పోతుంది. పేదల పరిస్థితే కాదు రోజు రోజుకూ పెరుగుతున్న ధరల వల్ల మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు కూడా పడిపోతున్నాయి. ఇలా ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే కనీసావసరాలకు అల్లాడుతుంటే మరోవైపు రోజుకో కుంభకోణం బయటపడుతూ ప్రజల్లోని అశాంతి, ఆగ్రహం పెరుగుతున్నాయి. ఇది ఆందోళనకు దారితీసింది. జనవరి 30న అన్నా, కిరణ్ బేడీ, అగ్నివేశ్ తదితరులు ఢిల్లీలో చేసిన ర్యాలీ ఈ ఉద్యమానికి నాంది. ఈ అవినీతిని అంతం చేయడానికి పటిష్టమైన లోక్‌పాల్ బిల్లును తీసుకు రావాలనే డిమాండ్‌తో నేటికీ ఈ వుద్యమం కొనసాగుతోంది.

## లోక్‌పాల్ డిమాండ్ ఈనాటిది కాదు

మన దేశంలో గత నాలుగు దశాబ్దాలుగా లోక్‌పాల్ బిల్లు డిమాండ్ కొనసాగుతోంది. లోక్‌పాల్ అనేది ఒక స్వతంత్ర వ్యవస్థ. అవినీతిని నియంత్రించడం దాని లక్ష్యం. ఇటువంటి ఒక స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేసిన మొదటి దేశం స్వీడన్. 'అంబుడ్స్‌మన్' పేరిట 1909 స్వీడన్ ప్రజా ప్రతినిధుల, ప్రభుత్వాధికారుల అవినీతిని అడ్డుకట్ట వేయడానికి ఇటువంటి వ్యవస్థను ఏర్పరిచింది. తదనంతరం ఫిన్‌లాండ్, డెన్మార్క్, న్యూజిలాండ్, ఇంగ్లండ్, పశ్చిమ జర్మనీ, పోలండ్, జపాన్, కెనడా, ఆస్ట్రేలియా, ఫిజీ, జమైకా, మారిషస్, ఫిలిప్పైన్స్ తదితర దేశాల్లో ఇటువంటి వ్యవస్థలు ఏర్పాటయ్యాయి.

మన దేశంలో పాలనా సంస్కరణ కమీషన్ నివేదిక మొదటగా లోక్‌పాల్‌ను ప్రస్తావించింది. మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల స్థాయి అధికారులపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తు జరపడానికి లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని ఇతర అధికారులపై ఫిర్యాదుల విచారణకు లోకాయుక్తను ఏర్పాటు చేయాలని ఈ నివేదిక పేర్కొంది. దీని ప్రకారం 1968లో లోక్‌పాల్ బిల్లు లోక్‌సభ ముందుకొచ్చింది. లోక్‌సభలో పాసైనా రాజ్యసభలో ఆమోదం పొందక ముందే లోక్‌సభను రద్దు చేయడంతో బిల్లు మురిగిపోయింది. ఆ తర్వాత పలువురు ప్రధాన మంత్రులు, పార్టీల ఆధ్వర్యంలో, మార్పులూ చేర్పులతో మొత్తం తొమ్మిదిసార్లు లోక్‌పాల్ బిల్లు సభ ముందుకు వచ్చింది. కానీ ఆమోదం పొందలేకపోయింది. ప్రస్తుతం మరోసారి అన్నా తదితరుల నుండి డిమాండ్ ముందుకు వచ్చింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం లోక్‌పాల్ బిల్లు ముసాయిదాను తయారు చేసింది. అయితే ఇది ఉత్తి డొల్లలాగా వుండింది. ఈ ముసాయిదా ప్రకారం లోక్‌పాల్ కేవలం సలహాలు ఇచ్చే సంస్థగా మాత్రమే వుంటుంది. అది తన నివేదికను సంబంధిత సంస్థకు ఇవ్వవలసి వుంటుంది. పోలీసు అధికారులపై గానీ, అవినీతి మంత్రులూ, ఎం.పీలపై గానీ ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసే అధికారం దీనికి వుండదు. సి.బి.ఐ. దీని అధికార పరిధిలోకి రాదు. తనంతట తానుగా సుమోటోగా కేసులపై చర్యలను తీసుకోవడానికి, అవినీతిపరులపై పౌరుల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించడానికి ఈ లోక్‌పాల్‌కు అధికారాలు వుండవు.

ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ బిల్లు నిష్ప్రయోజనమైనదని మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషన్, కర్ణాటక లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే, మెగసెసె అవార్డు గ్రహీత అరవింద్ కేజ్రీవాల్‌లు జన లోక్‌పాల్ పేరిట ఒక ప్రత్యామ్నాయ బిల్లును రూపొందించారు. దాని ప్రకారం లోక్‌పాల్ ఎన్నికల కమీషన్ వలె 'స్వతంత్ర' వ్యవస్థగా వుంటుంది. మంత్రులూ, ఎం.పి.లు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులపై వచ్చే ఫిర్యాదులపై సొంతంగా దర్యాప్తు చేస్తుంది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, చర్యలు చేపడుతుంది.

విదేశీ వ్యవహారాలు, భద్రత తదితర అంశాలకు సంబంధించి ప్రధాన మంత్రి తీసుకునే నిర్ణయాలపై దర్యాప్తు జరిపే అధికారం ప్రభుత్వం రూపొందించిన లోక్‌పాల్‌కు వుండదు. జన లోక్‌పాల్‌లో అలాంటి మినహాయింపులేమీ లేవు. లోక్‌పాల్ ప్రకారం నేరస్తులకు ఆరునెలల నుండి ఏడేళ్ల దాకా జైలు శిక్ష విధించాలి. జన లోక్‌పాల్ ప్రకారం జైలు శిక్ష కనిష్టంగా అయిదేళ్లు వుంటే గరిష్టంగా జీవిత

ఖైదు. లోక్‌పాల్‌లో మరొక క్రూరమైన నిబంధన కూడా వుంది. తప్పుడు ఫిర్యాదులు చేసేవారికి జరిమానాలు విధించాలని జైలుకు పంపాలని దీనిలో ప్రతిపాదించారు. నేరం నిరూపణ కాకపోతే తప్పుడు ఆరోపణగానే తేలుతుంది కనుక ఫిర్యాదు చేయడానికి ఎవరైనా వెనుకా ముందాడే పరిస్థితి వుంటుంది. జన లోక్‌పాల్ దీన్ని వ్యతిరేకించింది. అవినీతిపరులను శిక్షించడమే కాకుండా అవినీతికి పాల్పడిన సొమ్మును తిరిగి రాబట్టే విధంగా న్యాయ వ్యవస్థను లోక్‌పాల్ బిల్లు పరిధిలోకి తేవాలని కూడా జన లోక్‌పాల్ పేర్కొంది.

ఈ నేపథ్యంలో అన్నా హజారే, ప్రభుత్వ ప్రతిపాదిత లోక్‌పాల్‌ను వ్యతిరేకిస్తూ, పటిష్టమైన లోక్‌పాల్‌ను రూపొందించి కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తలను నియమించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ నెలలో నిరాహార దీక్ష చేశాడు. దీనితో పటిష్టమైన లోక్‌పాల్ బిల్లును రూపొందిస్తాననీ, బిల్లు రూపకల్పనలో పౌర సమాజానికి కూడా భాగస్వామ్యం కల్పిస్తాననీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇలా మన దేశ చరిత్రలో చట్టాల రూపకల్పనలో పార్లమెంటేతరులకు భాగం కలిపించడానికి ప్రభుత్వం మొదటిసారిగా సిద్ధపడింది. ఆ హామీ ప్రకారం కేంద్ర మంత్రులు, పౌర సమాజ ప్రతినిధులతో ఒక కమిటీ ఏర్పడింది. దీనితో హజారే దీక్ష విరమించాడు. అయితే పటిష్టమైన బిల్లును రూపొందించని పక్షంలో ఆగస్టు 16 నుండి తిరిగి దీక్షను చేపడతానని హెచ్చరించాడు.

ఈ కమిటీ పలుసార్లు సమావేశమైంది. కానీ, ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ముఖ్యంగా రాష్ట్రాల్లో లోకాయుక్తలను ఒకే చట్టం పరిధిలోకి తేవడం, ప్రధానిని, ఉన్నత న్యాయవ్యవస్థను, పార్లమెంట్‌లో సభ్యుల ప్రవర్తనను, దేశంలోని ప్రభుత్వాధికారులను లోక్‌పాల్ పరిధిలోకి తేవడం, లోక్‌పాల్ నిర్వచనం, లోక్‌పాల్ నియామక ప్రక్రియ తదితర ఏడు కీలక అంశాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఇంకా దాదాపు ముప్పయి చిన్నా చితకా అంశాల్లో ఏకాభిప్రాయం కుదరలేదని పౌర సమాజం ప్రతినిధులు వెల్లడించారు. మొత్తంగా చర్చలు విఫలమై ఉమ్మడి ముసాయిదాను తయారు చేయలేక పోయారు. ప్రభుత్వ ప్రతినిధి వర్గం ఒక ముసాయిదాను రూపొందించి మంత్రివర్గం ముందుంచింది. మంత్రివర్గం దాన్ని ఆమోదించి పార్లమెంట్ ముందుంచింది.

ఈ ముసాయిదాలో పౌర సమాజం ప్రతిపాదిస్తున్న విషయాలను పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. ప్రధానిని, న్యాయ వ్యవస్థను, పార్లమెంటులో సభ్యుల ప్రవర్తనను, సీబీఐ, సీవీసీలను లోక్‌పాల్ బిల్లు నుండి మినహాయించింది. ప్రధాని పదవి నుండి వైదొలిగిన తర్వాత ఆయనపై వచ్చిన ఆరోపణలను దర్యాప్తు చేయవచ్చు. అదే సమయంలో నేరం జరిగి ఏడేళ్లు దాటిపోతే ఇక అది లోక్‌పాల్ పరిధిలోకి రాదన్న నిబంధన కూడా దీంట్లో వుంది. దీని ప్రకారం ప్రధాని అవినీతికి పాల్పడిన తర్వాత ఏడేళ్లకు పైగా అధికారంలో వుంటే ఇక అది లోక్‌పాల్ పరిధిలోకి రాదు. అవినీతి అనేది క్రిమినల్ చర్య. ఏ క్రిమినల్ చర్యలోనైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ముందుగా ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేస్తారు. ప్రభుత్వ లోక్‌పాల్ ముసాయిదా ప్రకారం ఎఫ్.ఐ.ఆర్.కు ముందే నిందితుల వాదన వినాల్సి వుంటుంది. ఆ తర్వాత విచారణ జరిపి ఛార్జిషీట్ దాఖలు చేసే సమయంలోనూ నిందితుల వాదన వినాల్సి వుంటుంది. దీనికి విచారణ జరిపే అధికారం కూడా వుండదు. విచారణ జరపాల్సిందిగా సుప్రీం కోర్టుకు సిఫార్సు మాత్రమే చేస్తుంది. ఇలా అన్నా బృందం వ్యతిరేకిస్తున్న అంశాలు ఇందులో అనేకం వున్నాయి. దీనితో ఈ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలనే జన లోక్‌పాల్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ముందే హెచ్చరించినట్టుగా అన్నా ఆగస్ట్ 16 నుండి నిరాహారదీక్షను తలపెట్టాడు. దేశవ్యాప్తంగా యీ ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు వచ్చింది. మరో స్వాతంత్ర్య సమరంగా అభివర్ణిస్తున్న యీ ఉద్యమానికి సంఘీభావంగా దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ, అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్ తదితర దేశాలలోనూ ర్యాలీలు జరిగాయి. ఆంగ్‌సాన్ సూకీ కూడా మద్దతు ప్రకటించింది. దానితో దిగి వచ్చిన ప్రభుత్వం జన లోక్‌పాల్‌ను పార్లమెంటులో చర్చించడానికి ఒప్పుకుంది.

## ఈ ఉద్యమ నేపథ్యంలో ముందుకొస్తున్న కొన్ని వాదనలు

చట్టాలను రూపొందించే అధికారం పార్లమెంటరీ వ్యవస్థకే వుంటుందనీ, అన్నా తదితరులు తాము తయారు చేసిన బిల్లును పార్లమెంటుపై రుద్దుతూ పార్లమెంటు ప్రతిపత్తికీ, ప్రజాస్వామ్యానికీ చేటు చేస్తున్నారనే వాదనలు ప్రభుత్వంలోని పెద్దల నుండీ, మరి కొందరి నుండీ వస్తున్నాయి. జన లోక్‌పాల్ పేరిట ఎవరికీ జవాబుదారీ కానీ ఒక స్వతంత్ర వ్యవస్థను ప్రతిపాదిస్తున్నారనీ, సమాంతర ప్రభుత్వాన్ని కోరుతున్నారని ప్రధానిని బిల్లు పరిధిలోకి తెస్తే పాలనలో అస్థిరత చోటు చేసుకుంటుందనీ, న్యాయ వ్యవస్థను దీని పరిధిలోకి తెస్తే దాని ప్రతిపత్తి దెబ్బ తింటుందనీ వాదనలు మొదలుపెట్టారు. ఈ వాదనల ద్వారా బూర్జువా ప్రజాస్వామ్యం మీద నమ్మకం వున్న ప్రజలను యీ ఉద్యమానికి దూరం చేయాలని ప్రయత్నిస్తున్నారు.

కానీ ప్రభుత్వం చేస్తున్న ఈ వాదనలు అసంబద్ధమైనవి. పార్లమెంటే చట్టాలు చేస్తుందన్నది నిజమే. కానీ పార్లమెంట్ తనకు తోచింది చేస్తుందా? ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి

తీసుకుంటుందా? జన లోక్‌పాల్‌ను 85 శాతం ప్రజలు ఆమోదిస్తున్నారనీ, ప్రధానిని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలని 85 శాతం ప్రజలు కోరుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. మరి ప్రజాభిప్రాయానికి భిన్నంగా చట్టాలు రూపొందించడం ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందా? అవినీతి నిర్మూలన చట్టం పరిధిలోకీ, సి.బి.ఐ. పరిధిలోకీ ప్రధాన మంత్రి వస్తుండగా, లోక్‌పాల్ పరిధిలోకి ప్రధానిని తేవద్దనడం కూడా అసంబద్ధమైనదే. ప్రధానిని తేవద్దంటే ప్రధాని ఆధ్వర్యంలో వుండే పలు శాఖల్లోని అవినీతిని చూస్తూ ఊరుకోవడమే. న్యాయవ్యవస్థను దీని పరిధిలోకి తెస్తే న్యాయ వ్యవస్థ ప్రతిపత్తి దెబ్బ తింటుందనడం కూడా హాస్యాస్పదం. అసలు న్యాయ వ్యవస్థకు ప్రతిపత్తి ఎక్కడుంది? లేని ప్రతిపత్తిని కోల్పోయే అవకాశం ఎక్కడ? న్యాయమూర్తుల అవినీతి భాగోతాలు కూడా తెరకెక్కుతున్న నేపథ్యంలో న్యాయ వ్యవస్థను దీని పరిధిలోకి తేవద్దనడం అసమంజసం.

నిజానికి పార్లమెంటే సమర్థవంతమైన బిల్లును రూపొందిస్తుందనే నమ్మకం ప్రజలకు వుండుంటే జన లోక్‌పాల్‌ను ప్రజలు ఇంతగా సమర్థించేవారు కాదు. చట్టం రూపకల్పనలో జోక్యం చేసుకుంటున్న పౌర సమాజ బృందాన్ని కూడా తప్పుపట్టేవాళ్లు. ప్రస్తుతం 150 మందికి పైనే పార్లమెంటు సభ్యులకు నేర చరిత్ర వుంది. 72 మందిపై హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన అభియోగాలున్నాయి. అసలు ఎన్నికల ప్రక్రియే అవినీతి మయం అయిపోయింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల కమీషన్ అనుమతించిన దానికంటే కనీసం ఇరవై రెట్ల డబ్బును అధికంగా వెదజల్లుతున్నారు. ఇలా డబ్బులు వెదజల్లి, అవినీతి మార్గంలో పార్లమెంటులోకి దూరుతున్న వీరు సమర్థవంతమైన లోక్‌పాల్ బిల్లును రూపొందిస్తారని ఎవరైనా నమ్మగలరా? పార్లమెంటు వ్యవహారాల్లో పౌర సమాజం జోక్యం చేసుకుంటున్నదని ప్రభుత్వం ఆరోపిస్తున్నది గానీ పార్లమెంట్ తన బాధ్యతను నిర్వర్తించలేకపోవడం వల్లనే పౌర సమాజపు జోక్యం అనివార్యమైందని గుర్తించడం లేదు. పౌర సమాజం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నట్టు మాట్లాడుతోంది గానీ అసలు రాజ్యాంగాన్ని ఏ ప్రభుత్వమైనా ఎన్నడైనా ఉల్లంఘించకుండా వున్నదా?

## అవినీతి పోరాటం వెనుక వున్న శక్తులెవరు?

అన్నా, రాందేవ్‌ల నిరాహారదీక్షల శిబిరాల నిర్వహణకు లక్షల రూపాయల ఖర్చయింది. ఏప్రిల్లో అన్నా దీక్షా కార్యక్రమానికి 82 లక్షల ఖర్చయిందని వారే ప్రకటించారు. దీనికి నిధులు సమకూర్చిన వారు టాటా, ఎస్సార్, ఇన్ఫోసిస్ వంటి దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు. జిందాల్ అత్యధికంగా 25 లక్షలు ఇచ్చాడు. ఈ పోరాటాలకు నిధులు సమకూర్చే టాటా, ఎస్సార్‌లు ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుంను నడపడానికి కూడా నిధులు సమకూర్చారని మనం గుర్తు తెచ్చుకోవాలి. మావోయిస్టు పోరాటం అవినీతికే కాదు అవినీతికి ఆధారంగా వున్న మొత్తం వ్యవస్థకే ఎక్కుపెట్టబడింది. మరి ఇటువంటి పోరాటాలను అణచివేయాలని చూస్తున్న ఈ దళారీలు అన్నా తదితరుల పోరాటానికి మాత్రం ఎందుకు నిధులు సమకూర్చుతున్నారు? అంటే ఇటువంటి పోరాటాల వల్ల వాళ్ల ప్రయోజనాలకు వచ్చే ప్రమాదం ఏమీ లేదనేదే కదా వాళ్ల ధీమా. లేదా ఇటువంటి పోరాటాలు వాళ్లకు అవసరమైనా అయి వుండాలి. మరి ఇటువంటి అవినీతిపరులను తమ పోరాటానికి దూరంగా హజారే బృందం ఎందుకు వుంచలేకపోయింది. హజారే రాజకీయ నాయకుల అవినీతిపైనే మాట్లాడుతున్నారు. కానీ కార్పోరేట్ అవినీతిపై ఎందుకు మాట్లాడడం లేదు. పైగా అన్నా నరేంద్ర మోడీని పొగడడం, రాందేవ్ శిబిరంలో సాధ్వి రితంబర తదితరులు పాల్గొనడం వీళ్లలో వున్న మతతత్వాన్ని బయటపెడుతున్నది.

ఈ పోరాటానికి మద్దతు పలుకుతున్న రాజకీయ పార్టీలను చూస్తే – బి.జె.పి. ఈ పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించడం హాస్యాస్పదం. తాజాగా గాలి జనార్దన్ రెడ్డి గనుల కుంభకోణంలో బి.జె.పి. ప్రభుత్వం, సుష్మా స్వరాజ్ వంటి అగ్రనేతలు బద్‌నాం అయినప్పటికీ అది అన్నా హజారేకు మద్దతునిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఈ పోరాటానికి మద్దతుగా ఆందోళనలు చేపట్టడం కూడా అంతే హాస్యాస్పదం. ప్రపంచబ్యాంకుకు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి తన ఆస్తులను వేల కోట్లకు పెంచుకున్న చంద్రబాబు, స్విస్ బ్యాంక్‌లో వందల కోట్ల నల్లధనాన్ని పోగేసుకున్న చంద్రబాబు అవినీతిపై పోరాడడానికి మించిన వింత మరొకటి లేదు.

వీరే కాదు ఇంకా ఈ వుద్యమానికి మద్దతునిచ్చేవారినీ, దీనికి మద్దతుగా పోరాటాలు చేపడుతున్న మరికొందరినీ చూస్తుంటే అయోమయం కలుగుతుంది. యెడ్యూరప్ప, గాలి జనార్ధన్‌రెడ్డి, నరేంద్రమోడి, శరద్ పవార్, రామోజీరావు, బజాజ్, గోద్రెజ్, మహేంద్ర వంటి రాజకీయ నాయకులూ, కార్పేరేట్ దిగ్గజాలు ఈ పోరాటానికి మద్దతు నిస్తున్నారు. కోట్ల రూపాలయల పన్నులు ఎగ్గొట్టే అమితాబ్, అనుపమ్ ఖేర్ వంటి సినీనటులు కూడా మద్దతునిస్తున్నారు. ఇంత మంది అవినీతిని వ్యతిరేకించే వాళ్లే అయితే మరి అవినీతికి పాల్పడేవారెవరో అర్థం కాని పరిస్థితి.

ఇదంతా పరిశీలిస్తే ఎవరికైనా అర్థం అయ్యేదేంటి? ప్రజల్లో అవినీతిపై పెరుగుతున్న వ్యతిరేకత ఎక్కడ విస్ఫోటనం చెందుతుందోననే ఆందోళనతో సేఫ్టీవాల్వ్ వంటి పోరాటాలను పాలకవర్గాలు పథకం ప్రకారం నడిపిస్తున్నాయనేది స్పష్టంగా

అర్థమవుతున్నది. సామ్రాజ్యవాదం అమ్మతిని తయారు చేయడమూ, స్పాన్సర్ చేయడమూ మనం ఎరిగినదే. ఈ పోరాటానికి నాయకులుగా అన్నా హజారే వంటి గాంధీయవాదినీ, రాందేవ్ వంటి హిందూ మతోన్మాద బాబాలను ముందుకు తీసుకు వస్తున్నది కూడా ఈ పోరాటాలను మిలిటెన్సీ బాట పట్టించకుండా పగ్గాలు వేయడానికే.

పాలకవర్గాల ఈ కుట్రను బహిర్గతం చేయాలి. అదే సమయంలో ఈ పోరాటాల వెనుక ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు వున్నాయని అర్థం చేసుకోవాలి. ఆ ఆకాంక్షల నేపథ్యంలోనే వాటిని పక్కదారి పట్టించడానికీ, చల్లార్చడానికీ ముందుకు వస్తోన్న ఇటువంటి పోరాటాలనూ, నాయకులనూ, ఈ పోరాటం వెనుక వున్న శక్తులను వ్యతిరేకిస్తూ, నిజమైన ప్రజాస్వామిక ఉద్యమంగా దీన్ని మలచాలి. అందుకు ప్రజాస్వామిక వాదులు నడుం కట్టాలి.

అన్నా హజారే బృందంలోని వ్యక్తులందరినీ ఒకే గాటన కట్టలేము. దీంట్లో ప్రశాంతి భూషణ్, శాంతి భూషణ్ వంటి ప్రజాస్వామికవాదులు కూడా వున్నారు. ఇంటి వంటి వారు పాలకవర్గాల కుట్రలో పావులు కాకుండా ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా తమ కార్యాచరణను రూపొందించుకోవాలి.

## జనలోక్‌పాల్ అవినీతిని నియంత్రిస్తుందా?

అవినీతి ఎవరో కొందరు వ్యక్తుల్లోనో, సంస్థల్లోనో వుంటే దాన్ని ఒక చట్టం చేయడం ద్వారా నియంత్రించవచ్చేమో కానీ అది వ్యవస్థ పునాదుల్లోనే విస్తరించి వుంది. దోపిడీ సమాజాలేవైనా అవినీతిపై ఆధారపడే ఉనికిలో వుంటాయి. పెట్టుబడిదారీ సమాజం ఈ విషయంలో మరింతగా బరితెగిస్తుంది. లాభార్జనే తప్ప ఏ నీతీ నియమాలు దానికి వుండవు. ప్రపంచీకరణ నేపథ్యంలో అవినీతి మరింతగా విశ్వరూపం దాల్చింది. అవినీతి కోసమే పథకాలు, విధానాలు రూపొందడం ప్రారంభమైంది. అవినీతికి ఆలవాలంగా వున్న వ్యవస్థను మార్చకుండా చట్టాలూ, శిక్షల ద్వారా అవినీతిని అంతం చేయడం అసాధ్యం. లోక్‌పాల్ అమల్లో వున్న అన్ని దేశాల్లోనూ అవినీతి కొనసాగుతూనే వుంది. మనకు కూడా కేంద్ర నిఘా సంఘం, అవినీతి నిర్మూలనా చట్టం వున్నాయి. కానీ అవన్నీ కాగితాలకే పరిమితమై వున్నాయి. ఎందుకంటే ఆ చట్టాల అమలు అనేది అవినీతిలో మునిగిపోయిన పాలకుల చేతుల్లోనే వుంది కనుక. తాము కూర్చున్న కొమ్మను నరుక్కునేంత తెలివి తక్కువ వాళ్లు కాదు మన పాలకులు. సిబిఐ కూడా ప్రభుత్వం చెప్పు చేతుల్లోనే వుంది.

'అవినీతిని నియంత్రించడానికి నా దగ్గర మంత్రదండం ఏదీ లేద'ని మన్మోహన్ అనడం బాధ్యతా రహితమని చాలా మంది దుయ్యబట్టారు. అది బాధ్యతారహితమైన వ్యాఖ్య అనడంలో ఎటువంటి సందేహం లేదు గానీ నిజంగానే అటువంటి మంత్రదండం ఏదీ ఈ వ్యవస్థకు లేదు. ఒక బిల్లును రూపొందించడం దానికి మందు కానేకాదు. ఒక బిల్లును రూపొందించడం ద్వారా అవినీతిని పారదోలగలమని చెబుతున్నది కూడా ప్రజలు చట్టాల మీద భ్రమలను కోల్పోకుండా చేయడానికే, ప్రజలను చట్టబద్ధ పోరాటాలకు పరిమితం చేయడానికే!

అయితే ఒక చట్టం కోసం చేసే పోరాటాన్ని మొత్తంగా తృణీకరించలేము. దాన్ని ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షగా మనం గుర్తించాలి. పాలకులు కూడా గుర్తించాలని డిమాండ్ చేయాలి.

అవినీతిని పూర్తిగా నిర్మూలించడం మాత్రం దోపిడీ వ్యవస్థను నిర్మూలించడంతోనే సాధ్యమవుతుంది. అవినీతి వ్యతిరేక పోరాటం దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినప్పుడే అవినీతికి నిజమైన పరిష్కారం దొరుకుతుంది.

**"రాజ్యం అనేది అనాది కాలం నుండి వున్నది కాదు. రాజ్యం లేకుండా, రాజ్యం గురించి ఏమీ తెలియకుండా వుండిన సమాజాలు వుండినాయి. ఆర్థిక అభివృద్ధిలోని ఒకానొక దశలో, సమాజం వర్గాలుగా చీలి పోవడంతో అవశ్యంగా ముడిపడినట్టి ఆదశలో, యీ చీలిక మూలంగా రాజ్యం అవసరమైంది. ఇప్పుడు మనం ఉత్పత్తి అభివృద్ధిలోని ఏ దశను వేగంగా సమీపిస్తున్నామంటే ఆ దశలో ఈ వర్గాల అవసరం తీరిపోవడమే కాక, ఇవి ఉత్పత్తికి తప్పక ఆటంకంగా కూడా తయారవుతాయి. ఇంతకు ముందు దశలో ఇవి ఎంత అనివార్యంగా ఉత్పన్నమైనాయో అంత అనివార్యంగా అదృశ్యమవుతాయి. వాటితోపాటు రాజ్యం అనివార్యంగా అదృశ్యమవుతుంది. స్వేచ్ఛా, సమానతలు గల ఉత్పత్తిదార్ల సంఘపు ప్రాతిపతికమీద ఉత్పత్తిని పునర్నిర్మించబోయే సమాజం మొత్తం రాజ్య యంత్రాన్ని అప్పడది ఎక్కడ వుండవలెనో అక్కడ వుంచుతుంది- పురావస్తువుల మ్యూజియంలో, రాట్నమూ, కంచు గొడ్డలీ వుండే చోట." -ఎంగెల్స్**

# సమస్యలతో అలసిపోయిన రైతులు ప్రకటించిన 'పంట విరామం'

కార్మికులు సమ్మె చేయడం మనకు తెలుసు. ఉద్యోగులు సమ్మె చేయడం కూడా తెలుసు. ఇంకా రకరకాల శ్రామికులు సమ్మె చేయడం తెలుసు. కానీ రైతులు సమ్మె చేయడం మనం కనీ వినీ ఎరగనిది.

కార్మికులూ, ఉద్యోగులూ, ఇంకా ఎన్నో రకాల శ్రామికులకు సెలవులుండడం మనం చూస్తున్నదే. ఇళ్లల్లో పనిచేసే పని మనుషులు కూడా సెలవు కావాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ రైతులు సెలవు కోరుకోవడం మనమెన్నడూ ఎరగం.

అవిరామం అనే పదానికి రైతును పర్యాయ పదంగా చెప్పుకోవచ్చు. అటువంటి రైతులు విరామం కోరుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో మూడు లక్షల ఎకరాలకు పైగా ఖరీఫ్ పంటకు సెలవు ప్రకటించారు. ఈ సెలవు వాళ్లు పోరాడి సాధించుకున్నది కాదు పోరాట రూపంగా ఎంచుకున్నది. ఆరుగాలం కష్టపడి విశ్రాంతి కోసం కోరుకున్న విరామం కాదిది, సమస్యలతో పోరాడీ పోరాడి అలసిపోయి కోరుకున్న విరామం.

వర్షాలు పడకనో, నీళ్లు లేకనో పంటలు వేయడం మానుకోలేదు. పుష్కలంగా నీళ్లున్న తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు వంటి జిల్లాల్లోనే ప్రధానంగా ఈ పంట విరామం అమలవుతోంది. దీనికి కారణమేంటీ?

మనది వ్యవసాయ ప్రధాన దేశం. 60 శాతం ప్రజలు, జీవనోపాధి కోసం వ్యవసాయం మీదనే ఆధారపడుతున్న దేశం. కానీ మన ప్రభుత్వాలు ఈ స్పృహను ఏ మాత్రం కలిగి వుండడం లేదు. ఒకవైపు రైతే దేశానికి వెన్నెముక అంటూనే, మరో వైపు రైతుల నడ్డి విరుస్తున్నారు.

రైతులు ఎన్నో అననుకూలతల మధ్య వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. ఆరుగాలం శ్రమించడం రైతులకు తప్పదు. కానీ ఆరుగాలం సమస్యలతో పోరాడడం కూడా వాళ్లకు తప్పడం లేదు.

నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో సబ్సిడీలను ఎత్తివేయడం లేదా కుదించడం, ఎరువులు తదితరాల ధరలు పెరగడం కారణంగా రోజు రోజుకూ వ్యవసాయ పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరుగుతున్నది. కానీ ఆ స్థాయిలో వ్యవసాయోత్పత్తుల ధరలు పెరగడం లేదు. 1997 – 2007 మధ్య కాలంలో డీజిల్ ధరలు 300 శాతం, క్రిమి సంహారక మందుల ధరలు 150 శాతం, ఎరువుల ధరలు 45 శాతం పెరిగాయి. కానీ వరి, గోధుమల ధరలు మాత్రం 35 – 40శాతం మాత్రమే పెరిగాయి.

కాబట్టి ప్రతీ సంవత్సరం పెట్టిన పెట్టుబడులు తిరిగి రావడమే గగనంగా వుంది. ఇటువంటి పరిస్థితిలో తిరిగి పెట్టుబడులు పెట్టాలంటే అప్పుల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి. బ్యాంకుల్లో అప్పు దొరకని వారు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల కోరల్లో చిక్కుకుని అంతూ పొంతూ లేని అప్పుల ఊబిలో దిగబడిపోతున్నారు.

ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వాన్నం. సాధారణ రైతుకు ఎకరా వరి సాగుకు పెట్టుబడి ఖర్చు 20 వేలు, కౌలు రైతుకు దాదాపు 30 వేలు అవుతుందని ఒక అంచనా. కౌలు రైతులకు బ్యాంకు రుణ సదుపాయం లేదు కనుక వీరు పూర్తిగా ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల మీదనే ఆధారపడాలి. సాధారణ రైతులకు నామమాత్రంగానైనా వర్తించే బీమా పథకం కౌలు రైతులకు వర్తించదు. రాష్ట్రంలో 26 లక్షల కౌలు రైతులున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతుండగా, రైతు సంఘాలు మాత్రం 50 లక్షల మంది కౌలు రైతులున్నారని చెబుతున్నాయి. సాగవుతున్న దాంట్లో 70 శాతం భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారని ఒక అంచనా. కౌలు రైతుల మీద మెజారిటీ వ్యవసాయం ఆధారపడి వున్న పరిస్థితిలో మరి వాళ్లు సమస్యల్లో కూరుకొని వుంటే వ్యవసాయం భవిష్యత్ ఏంటి?

ఈ సంవత్సరం నుండి కౌలు రైతులను సాగు రైతులుగా సంభోదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. సాగు రైతులకు గుర్తింపు కార్డులిస్తానని కూడా ప్రచారం చేస్తోంది. ఈ గుర్తింపు కార్డుల ఆధారంగా వీరికి కూడా బ్యాంకు రుణ సదుపాయం దొరుకుతుందని చెప్తోంది. దాని లెక్కల ప్రకారమే 26 లక్షల మంది కౌలు రైతులు వుంటే ఆరు లక్షల కార్డులను మాత్రమే ఇస్తానని ప్రకటించింది. మిగతా వాళ్ల సంగతేంటి అనేది పక్కన పెడితే, ఇచ్చిన గుర్తింపు కార్డులను కూడా బ్యాంకర్లు ఏ మాత్రం లక్ష్య పెట్టడం లేదు, అప్పులూ ఇవ్వడం లేదు. దీన్ని బట్టి కౌలు రైతుల పేరు మార్చినంత మాత్రాన వాళ్ల బతుకుల్లో వచ్చిన మార్పు ఏమీ లేదని అర్థమవుతోంది.

కంటితుడుపు చర్యలుగా ప్రభుత్వాలు ప్రకటించే సబ్సిడీలు కూడా రైతులందరికీ అందడం లేదు. ఉదాహరణకు ఈ ఖరీఫ్‌లో 28.75 లక్షల హెక్టార్లలో వరి సాగు చేయాలనేది ప్రభుత్వ ప్రతిపాదన. దీనికి 14.38 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయి. కానీ కేవలం 4.05 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలనే సబ్సిడీగా

అందిస్తున్నారు. ఇక మిగతా విత్తనాలను రైతులు అధిక ధరలకు కొనుక్కోవాల్సిందే. కాగా సబ్సిడీ కోటాలోని ఎరువులూ, విత్తనాలను సబ్సిడీలో ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. మొత్తంగా రాజకీయ ప్రాబల్యం వున్న వాళ్లే ఈ సబ్సిడీ ప్రయోజనాలను ఎక్కువగా పొందుతున్నారు. బావుల మీద ఆధారపడుతున్న రైతులకు పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు కూడా మోయలేని భారమవుతున్నాయి. కరెంటు కోతల వలన నీళ్లు చాలక పంటలెండిపోవడం, తరచూ వచ్చి పోయే కరెంటు వలన మోటార్లు కాలిపోవడం వలన రైతుల కష్టాలు మరింతగా పెరుగుతున్నాయి. నకిలీ విత్తనాలూ, పురుగు మందుల వలన కూడా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలతో పోరాడడం ఎటూ తప్పదు.

ఇన్ని సమస్యలతో పండించిన పంటలను అమ్ముకోబోతే గిట్టుబాటు ధరలు వుండడం లేదు. ఆరుగాలం చెమటోడ్చి పండించే రైతుకు తన ఉత్పత్తికి ధరను నిర్ణయించే అధికారం లేదు. వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. ప్రైవేట్ వ్యాపారులకు అగ్గువకు అమ్ముకునే దుస్థితి నుండి రైతులను తప్పించే ఉద్దేశంతో పౌర సరఫరాల సంస్థ, భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా–ఎఫ్.సి.ఐ.)లు రైతుల దగ్గర నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తాయి. కానీ ఇవి రెండూ కలిసి ఏటా నాలుగు నుంచి తొమ్మిది లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి. ఇందులో భారత ఆహార సంస్థ కేవలం రెండు లక్షల టన్నులను మాత్రమే కొనుగోలు చేస్తున్నది. ఇక మిగతా ధాన్యాన్ని రైతులు మిల్లర్లకు అమ్ముకోవాల్సిందే. అంతే కాదు ప్రభుత్వ సంస్థకు అమ్ముకోవాలంటే మార్కెట్ల ముందు రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. ఈ కారణంగా కూడా మిల్లర్లకు అమ్ముకోవడానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించినా మిల్లర్లు దాన్ని పట్టించుకోరు. మిల్లర్లను శాసించే స్థితిలో ప్రభుత్వం లేదు. మిల్లర్ల లాబీలే ప్రభుత్వాన్ని శాసించేంత, ముడుపులు ఇచ్చి రాజకీయ పార్టీల నోళ్లు మూయించేంత బలంగా వున్నాయి. మరో విషయం ఏంటంటే ధాన్యం ధరలు తగ్గినప్పటికీ మార్కెట్లో బియ్యం ధరలు మాత్రం తగ్గడం లేదు. కాబట్టి మిల్లర్లు రైతుల దగ్గర తక్కువ ధరకు ధాన్యం కొని బియ్యం చేసి దేశీయ మార్కెట్లకో, అనుమతులను పొంది విదేశీ మార్కెట్లకో అమ్మి విపరీతమైన లాభాలు చేసుకుంటున్నారు.

మిగతా అన్ని రాష్ట్రాలలో ఎఫ్.సి.ఐ. ధాన్యమూ, బియ్యమూ కొంటుంది. కానీ రాష్ట్ర విధానాల ప్రకారం రైతుల దగ్గర పరిమితమైన ధాన్యాన్ని మాత్రమే కొంటున్న ఎఫ్.సి.ఐ., మిల్లర్ల దగ్గర మాత్రం పెద్ద ఎత్తున బియ్యం కొంటున్నది. గత ఏడాది మిల్లర్ల దగ్గర 84 లక్షల టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసింది. ఇది పండిన పంటలో 80 శాతం. మిల్లర్లు రైతుల దగ్గర తక్కువ ధరకు కొని ఎఫ్.సి.ఐ.కి ఎక్కువ లాభాలతో అమ్ముకుంటున్నారు. అంటే రైతుల ప్రయోజనాల కోసమంటూ ఏర్పడిన ఎఫ్.సి.ఐ. ఆచరణలో మిల్లర్లకే ప్రయోజనం చేకూర్చుతున్నది.

సాధారణంగా పంట దిగుబడి రాగానే ధరలు తగ్గుతాయి. కానీ మళ్లీ ధరలు పెరిగేదాకా ఎదురుచూసే పరిస్థితి రైతులకు వుండదు. తిరిగి పెట్టుబడులూ, అప్పులూ, ఇతర అవసరాలూ రైతులను వెంటనే ధాన్యం అమ్ముకునేలా చేస్తాయి. అయితే ఒకవేళ ధరలు పెరిగేదాకా కొంత ధాన్యాన్నయినా దాచుకుందామంటే రైతులకు ధాన్యం భద్రపరచడం కూడా ఒక సమస్యగానే వుంటుంది. రైతులకు కోల్ట్ స్టోరేజీలు, గోదాములు, ప్రాసెసింగ్ కేంద్రాలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమయింది. ఇలా పలు సమస్యలతో వ్యవసాయం జూదంగా మారింది.

రైతాంగం ఎదుర్కుంటున్న ఈ దారుణ పరిస్థితులు ఏ వొక్క రాష్ట్రానికో పరిమితమయి లేవు. దేశవ్యాప్తంగా వ్యాపించి వున్నవే. ఈ సమస్యలు ప్రభుత్వ అలసత్వం వల్లనో మరొకందువల్లనో దాపురించినవి కాదు. ప్రభుత్వాలు సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలుపరచడంలో భాగంగా వ్యవసాయాన్ని రోజు రోజుకూ కుంటుపరుస్తున్నాయి. మరి వ్యవసాయానికి ప్రాధాన్యతను ఇస్తే పెద్ద పెద్ద కంపెనీలకూ, ప్రాజెక్టులకూ, సెజ్‌లకూ, ఎక్స్‌ప్రెస్ వేలకూ భూములు ఎక్కడి నుండి వస్తాయి?

రైతాంగం సుదీర్ఘ కాలంగా ఎదుర్కుంటున్న ఇటువంటి మరెన్నో సమస్యల ఫలితమే నేటి రైతాంగ ఆత్మహత్యలు. 1995 – 2010 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా లక్షా 25 వేల మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారంటే రైతాంగానికి వ్యవసాయం ఎంత 'శాపంలా' పరిణమించిందో అర్థం చేసుకోవచ్చు.

ఇలా సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులకు ఈ సంవత్సరం కొత్త సమస్య ఎదురైంది. ఈసారి రబీ కాలంలో రికార్డు స్థాయిలో 70 లక్షల టన్నుల వరి ధాన్యం పండింది. సాధారణంగానైతే ఇది రైతులకు సంతోషకర విషయం, కానీ వారికిది విచారకర విషయమైపోయింది. ఎందుకంటే ఈ ధాన్యాన్ని అమ్ముకోవడానికి వాళ్లు పడ్డ తిప్పలు అన్నీ యిన్నీ కావు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో రోజుకు 5–7 వేల టన్నులను కొనే సామర్థ్యం మాత్రమే వున్నందున అమ్ముకోవడానికి రోజుల తరబడి క్యూలో వుండాల్సిన పరిస్థితిని ఎదుర్కున్నారు. పౌర సరఫరాల సంస్థ దగ్గర గోనె సంచులు కూడా అయిపోయాయి. వాటిని మళ్లీ

సమకూర్చుకోవడానికి వారం రోజులు పట్టింది, ఈ వారం రోజులూ కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఈసురోమంటూ మార్కెట్ యార్డ్‌లలోని తమ ధాన్యాన్ని కాపాడుకుంటూ, వర్షం వస్తే తడుస్తుందేమోననే ఆందోళనతో గడిపారు. హమాలీల కొరత, గోడౌన్ల కొరత కూడా బాగా అనుభవంలోకి వచ్చింది. ఈ అరకొర సౌకర్యాలతోనే ఈసారి రికార్డు స్థాయిలో పౌర సరఫరాల సంస్థ 18 లక్షల టన్నులు, ఎఫ్.సి.ఐ. ఆరు లక్షల టన్నులు కొన్నాయి. ఇక దాదాపు మిగతా 45 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు మిల్లర్లకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఇదే అవకాశంగా భావించిన మిల్లర్ల లాబీ రేటును తగ్గించింది. కనీస మద్దతు ధర క్వింటాల్‌కు వెయ్యి రూపాయలు వుండగా, 850 రూపాయలకు తగ్గించింది. కొనుగోళ్లను కూడా తగ్గించింది. దీనితో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎంత అన్యాయపు రేటుకైనా అమ్ముకోకుంటే గడవదు కనుక రైతులు తగ్గించిన ధరలకే అమ్ముకున్నారు. అయినా కొనుగోళ్లను తగ్గించడంతో దాదాపు 30 శాతం ధాన్యం అమ్ముడుపోకుండా వుండిపోయింది.

రైతులు ఇన్నాళ్లూ తాము ఎదుర్కుంటున్న ఎన్నో సమస్యలకు వ్యతిరేకంగా విరామం లేకుండా పోరాడుతూ వస్తున్నారు. తొలకరి చినుకులు పడగానే విత్తనాల కోసం పోరాటం, ఇక వరుసగా ఎరువుల కోసం పోరాటం, బ్లాక్ మార్కెటుకు, నకిలీ విత్తనాలకు, విద్యుత్ ఛార్జీలకూ, కరెంటు కోతలకూ వ్యతిరేకంగా పోరాటం, ఆఖరికి గిట్టుబాటు ధరల కోసం పోరాటం... ఇలా పోరాడి పోరాడీ అలసిపోయిన రైతులు ఈ సంవత్సరం పంట విరామాన్ని ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో, తూర్పు గోదావరి జిల్లాలో లక్షా 20 వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 37 వేల ఎకరాల్లో, ప్రకాశం జిల్లాలో 15 వేల ఎకరాల్లో, పశ్చిమ గోదావరి జిల్లాలో 5 వేల ఎకరాల్లో, ఇంకా వరంగల్, మెదక్, కడప, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో వందలాది ఎకరాల్లో పంట విరామం ప్రకటించారు. చాలా చోట్ల వేసిన నారుమళ్లను కూడా ధ్వంసం చేశారు. ఈసారి పంటను వేయకపోతే కొత్తగా అప్పు చేయాల్సిన అవసరం వుండదని వీళ్లు భావిస్తున్నారంటే వ్యవసాయం రైతులకు ఎంత భారంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

పంట విరామం ప్రకటించిన చాలా మంది రైతులు ఉపాధి హామీ పథకం కింద పేర్లు నమోదు చేసుకుంటున్నారు. వ్యవసాయం చేయడం కంటే కూలీకి వెళ్తేనే ఎంతో కొంత బతుకుదెరువుకు గ్యారంటీ వుంటుందని భావిస్తున్నారు.

కోస్తాంధ్రలో ఈ సంవత్సరం పంట విరామం ప్రకటించారు. కానీ తెలంగాణాలో అప్రకటితంగా సుదీర్ఘకాలంగా పంట విరామం అమలవుతోంది. కోస్తాంధ్ర పాలకుల పక్షపాత, దోపిడీ విధానాల ఫలితంగా తెలంగాణా జలాలను తెలంగాణాకు దక్కకుండా చేయడం వల్ల ఇరవై యేళ్లుగా దాదాపు 37 లక్షల ఎకరాల భూమి ఇక్కడ పడావు పడి వుంది.

ఈ పంట విరామం అనేక రకాలుగా ప్రజలను ప్రభావితం చేయబోతోంది. వ్యవసాయ కూలీలపై ఈ ప్రభావం తీవ్రంగా వుంటుంది. తమ గ్రామాల్లో కూలీ దొరకక్క వలసలు పోవడం ఇప్పటికే ప్రారంభం అయింది. పిల్లల చదువులు ఆగిపోతున్నాయి. ఇప్పటికే వరి ధాన్యం ధరలు పెద్దగా లేకపోయినా బియ్యం ధరలు మాత్రం విపరీతంగా వున్నాయి. ఈ సంవత్సరం దిగుబడి తగ్గిపోతుంది కనుక బియ్యం ధరలు మరింతగా పెరిగిపోతాయి. పంట విరామం కారణంగా ఈ సంవత్సరం మొత్తంగా 15 లక్షల టన్నులకు పైగా ఆహారోత్పత్తి తగ్గిపోయే ప్రమాదం వుంది. ఇప్పటికే దేశంలో మెజారిటీ ప్రజలు ఆకలికి నక నకలాడుతున్నారని పలు కమిటీలు వెల్లడిస్తున్నాయి. ఈ తీవ్రత ఇప్పుడిక మరింత పెరిగే అవకాశం వుంది. వ్యవసాయంపై ప్రత్యక్షంగా ఆధారపడే విత్తనాలూ, ఎరువుల కంపెనీలు ఈ ప్రభావానికి లోనవుతాయి. ఇంకా అనేక రంగాల మీద ఈ ప్రభావం పడి మొత్తంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుంది.

రైతులు పంట విరామం ప్రకటించగానే సమస్యల అధ్యయనం కోసమంటూ ప్రభుత్వం మోహన్ కందా కమిటీని నియమించింది. గతంలోనూ వ్యవసాయ రంగంలో మార్పుల కోసం అంటూ పలు కమిషన్లను నియమించింది. జస్టిస్ పి.ఎ. చౌదరి, జయతీ ఘోష్, స్వామినాథన్, కోనేరు రంగారావు తదితర కమిషన్లు ఈ వుద్దేశంతో నియమించబడినవే. కానీ ఈ కమిషన్‌లు చేసిన ఏ వొక్క సూచననూ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇదే వరసలో ఇప్పుడు మోహన్ కందా కమిటీ చేసే సూచనలు కూడా చెత్తబుట్టలోకి చేరడం ఖాయం.

ఇన్నాళ్లూ రైతాంగం చేస్తున్న పోరాటాల పట్ల ప్రభుత్వాలు సహజంగానే వాటి విధానాల్లో భాగంగా నిర్లక్ష్యాన్నే ప్రదర్శిస్తున్నాయి. అదే సమయంలో సగటు రైతాంగేతర ప్రజలు కూడా రైతాంగ సమస్యల పట్ల ఉదాసీన వైఖరినే ప్రదర్శిస్తున్నారు. రైతాంగ సమస్యలు కేవలం ఆ వొక్క సెక్షన్‌కే సంబంధించిన సమస్యలుగా, వారు మాత్రమే సాధించుకోవాల్సిన సమస్యలుగా భావిస్తున్నారు. కానీ రైతాంగ సమస్య ముఖ్యంగా ప్రజలందరి ఆహార భద్రతకు సంబంధించిన సమస్య, ఇంకా మరెన్నో రంగాలను ప్రభావితం చేసే సమస్య. మొత్తంగా దేశ భవిష్యత్‌కు సంబంధించిన సమస్య.

కాబట్టి అన్ని సెక్షన్ల ప్రజలూ రైతాంగం చేస్తున్న పోరాటాల్లో కదలాల్సిన అవసరం వుంది. అప్పుడు పంటలకు కాదు సమస్యలకు విరామం పడుతుంది.

# భారతదేశ ఆర్థిక అభివృద్ధి - సామాజిక న్యాయం

గడిచిన దశాబ్దం నుండి భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, జీడిపీ వృద్ధిని అభివృద్ధికి కొలమానంగా పేర్కొంటున్నారు. 1951 నుండి పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించి ఇప్పటివరకు పది పంచవర్ష ప్రణాళికలు పూర్తి అయి ప్రస్తుతం 11వ పంచవర్ష ప్రణాళిక నడుస్తున్నది. పంచవర్ష ప్రణాళికల లక్ష్యం ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడం, జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం పెంచడం, ఆదాయం సంపద పంపకాలలో వైషమ్యాలు లేకుండా చేయడం, ఎక్కువ మందికి ఉపాధి కల్పించడం, ప్రాంతీయ వైషమ్యాలను తగ్గించడం పంచవర్ష ప్రణాళిక పథకం మొదటి మూడు దశాబ్దాలలో అభివృద్ధి 1951 నుండి 1978 వరకు 37 శాతం వున్నది. 1978 తర్వాత కూడా జాతీయ ఉత్పాదక వార్షిక వృద్ధి శాతం పెరుగుతున్నది. ప్రత్యేకించి 1991 నుండి ఆర్థిక సంస్కరణల అమలు తర్వాత క్రమంగా వృద్ధిరేటు పెరుగుతున్నది. 2003 – 04 నుండి అభివృద్ధి రేటు 8 శాతం పైనే వున్నది. ప్రపంచబ్యాంక్ 2010లో ప్రకటించిన వార్షిక వృద్ధి రేటు 9.7 శాతం. భారత పాలకులు జాతీయ ఆదాయం క్రమానుగత అభివృద్ధి రేటు చూపించి భారత్ అభివృద్ధి వైపు ప్రయాణిస్తున్నదని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాల వలన అభివృద్ధి రేటు పెరిగిందని, అందువలన ప్రభుత్వం ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని, మార్కెట్ అనుకూల ఆర్థిక విధానాలు అమలు చేయాలని చర్చిస్తున్నారు. వీటివలన పేదలు నిరుపేదలుగా మారుతారు. ఆదాయం, ఉద్యోగ కల్పన, కొనుగోలుశక్తి కోల్పోతారు. వాళ్ళ గురించి ప్రభుత్వం ఉపాధి కల్పన పథకం, పుష్టికర ఆహారం, విద్యా, వైద్యం కొరకు కొంత కేటాయింపులు, శారీరక వికలాంగులకు, వృద్ధులకు, విధవలకు ఫించన్లు ఇవ్వటం వలన వాళ్ళ మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయా?

భారత్‌లో దేశీయ ఉత్పత్తి వృద్ధి (జీడిపి) పెరిగి తలసరి ఆదాయం పెరుగుతున్నది అని పాలకులు ప్రచారం చేస్తున్నారు. ఒక సంవత్సరం జాతీయ ఆదాయంను ఆ సంవత్సరం జన సంఖ్యతో భాగిస్తే తలసరి ఆదాయం వస్తుంది. 1960లో భారత తలసరి ఆదాయం 60 డాలర్లు, 1975లో 136 డాలర్లు , 1999లో 300 డాలర్లు, 2000లో 460 డాలర్లు వృద్ధి అయింది.

## ఆర్థిక ప్రగతిలో పరిగణనలోకి తీసుకోవలసిన కొన్ని విషయాలు - జమ (డిపాజిట్లు)

గత సంవత్సరాలలో భారత్‌లో జమ పెట్టుబడులు వృద్ధి అయినాయి. 1951 – 52లో ఆంతరంగిక జమరేటు మొత్తం జాతీయ ఆదాయంలో 6.87 శాతం వున్నది. 2001 – 02లో జమ (సంచయ) రేటు మొత్తం జాతీయ ఆదాయంలో 24 శాతం అయింది. 2005 – 06లో మొత్తం జాతీయ ఆదాయంలో 35 శాతం అయింది. అదే విధంగా పెట్టుబడులు 1951 – 52లో 7.4 శాతం. 2001 – 02లో మొత్తం జాతీయ ఆదాయంలో 24 శాతం అయింది. 2005 – 06లో పెట్టుబడులు 33.8 శాతం పెరిగాయి. సంచయం, పెట్టుబడులు చెప్పుకోదగినంత పెరిగాయి. జాతీయ ఆదాయం, పెట్టుబడి నిష్పత్తి, క్రమానుగత అభివృద్ధి రాబోయే కాలంలో మరింత ఎక్కువ అభివృద్ధి రేటు చూపించగలదు. పై గణాంకాలు చూపించి భవిష్యత్తులో భారత్ సూపర్ శక్తి దేశం కాగలదని కల్పనలు సృష్టిస్తున్నారు. మరి కొంతమంది చైనా అభివృద్ధి రేటును మించి పోగలదని ఉల్లేఖిస్తున్నారు. 2003 – 04 నుండి చైనా జీడిపి (జాతీయ ఆదాయం) వృద్ధిరేటు 10శాతం పైనే వున్నది.

## జాతీయ ఉత్పాదన, తలసరి ఆదాయం గుణాత్మక అభివృద్ధి

జీడిపి వృద్ధి, తలసరి ఆదాయం వృద్ధి, సంచయం, పెట్టుబడుల వృద్ధి భారత ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలవు. కాని సాధారణ ప్రజల ఆర్థిక సామాజిక స్థితిలో చెప్పుకోదగిన మార్పు జరగలేదు. తలసరి ఆదాయం అభివృద్ధిలో ఆదివాసులు, దళితులు, దినసరి కూలీలు, చిన్న నామమాత్ర రైతులు, మహిళలు, మైనారిటి మతస్తులు సాధారణ ప్రజలను పరిగణనలోకి తీసుకోలేదు. ఆంతరంగిక అభివృద్ధిలో సామాన్య ప్రజలను పట్టించుకోలేదు. భారత్ వంటి అర్ధ భూస్వామ్య, అర్ధవలస దేశంలో సాధారణ ప్రజల వికాసం గురించి ఆలోచించడం స్వర్గంలో మెట్లు లెక్కించడం వంటిది. ఆర్థిక వికాస లక్ష్యాలలో తలసరి ఆదాయం వేగంగా పెరుగుతుంది కానీ మిగతా లక్ష్యాలు పూర్తికావటం లేదు. ఫలవంతమైన జీవన ప్రమాణాల్లో గుణాత్మక అభివృద్ధిలేదు. ఆదాయం, సంపద పంపకాలలో వైషమ్యాలు తొలగించలేదు. ఆదాయం వృద్ధి అయినా నిరుద్యోగ సమస్య తగ్గలేదు. ప్రత్యేకించి మహిళలు, ఆదివాసులు, దళితులు, మైనారిటీలు స్వయం సమృద్ధి కాలేదు. అభివృద్ధి కొలమాణంకు పై విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

సంవత్సరంలో మొత్తం పౌరుల ద్వారా ఉత్పాదిత సామాగ్రినీ, సేవలను ద్రవ్య ఆకారంలో తెలియజేయుటే జాతీయ ఉత్పత్తి (జీడిపి). జాతీయ ఆదాయం పరిగణనలోకి తీసుకొనేటప్పుడు అనేక విషయాల మీద దృష్టి పెట్టాలి. భారత్‌వంటి దేశంలో అనేక ఉత్పత్తులు దేశంలో ఉపయోగించుకోవటం లేదు. ఇది కాకుండా ఆదివాసీ అటవీ ప్రాంతంలో రవాణా వ్యవస్థ సరిగాలేదు. అక్షరాస్యత రేటు తక్కువ. వ్యవసాయ రంగంలో వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకం,

కొనుగోలు లేకుండా ప్రత్యక్ష వినిమం జరుగుతున్నది. ఇప్పటికీ కొన్ని ప్రదేశాలలో ధాన్యం, మినుములు, శనగలు, ఉలవలు, ఇప్పపూలు ఇచ్చి ఉప్పు, నూనె కొంటున్నారు. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థలో కుటుంబ సభ్యుల ద్వారా జరుగుతున్న ఉత్పత్తి, సంపాదనలకు ద్రవ్య రూపంలో కొలమానం లేదు. అందువలన అవి జీడిపి ఆదాయ గణనలోకి రావటంలేదు.

మానవ జీవన ప్రమాణాల్లో గుణాత్మక అభివృద్ధి లేకుండా వికాస కొలమాణం నిర్ధారించలేము. ఆర్థిక విధానాలలో సామాన్య ప్రజల సంక్షేమమే వికాస వృద్ధిరేటు. పాకిస్తాన్ దేశ ప్రముఖ ఆర్థికవేత్త మెహముద్ అల్ మానవ కళ్యాణం గురించి మూడు విషయాలు చర్చించాడు. అవి మనిషి ఆయుషు, అక్షరాస్యత రేటు, జీవించే పద్ధతులు. ఆర్థిక శాస్త్రంలో నోబుల్ పురస్కార గ్రహీతలు, ప్రముఖ ఆర్థికవేత్తలు జోసెఫ్ ష్టిగ్‌లిచ్ అమూల్యసేన్ చెప్పినట్లు జీడీపీలో మనిషి జీవనశైలి, కళ్యాణంను ముఖ్యంగా పరిగణించి, ఆర్థిక స్వయం సమృద్ధి కోసం ఆదాయం, సంపత్తి సరి అయిన పంపకం జరిగినప్పుడే, సోషలిజం ప్రతిష్టించినప్పుడే అభివృద్ధి లక్ష్యం నెరవేరుతుంది. ఒక దేశ జాతీయ ఉత్పత్తి అధికంగా వున్నా, తలసరి ఆదాయం మిగతా దేశాలతో పోల్చితే అధికంగా వున్నా, విద్యా, వైద్యం, సామాజిక రక్షణ విషయాలలో వెనుకబడిన దేశం అభివృద్ధి అయినట్లు చెప్పలేము. దేశంలో ఉత్పత్తి అవుతున్న భౌతిక వుత్పత్తులను మొత్తం ప్రజలు పొందుతున్నారా లేదా అన్న విషయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఐక్యరాజ్యసమితి ప్రస్తావించిన అభివృద్ధి సూచి (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ యుఎన్‌డిపి) 1990 నుండి మానవ అభివృద్ధి సూచి (హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ ఎచ్‌డిఆఇ) కొలమాణంగా ప్రకటించింది. ఆయుషు, విద్యా, దేశీయ వుత్పత్తి మెదలగు సామాజిక విషయాలు తీసుకొని అభివృద్ధి స్థాయి నిర్ధారించింది. 1998లో యుఎన్‌డిపి తరపున 174 దేశాల మానవ అభివృద్ధి స్థాయిని ప్రకటించింది. ఆ దేశాలలో భారత్ 138వ స్థానంలో వుంది. 2006లో యుఎన్‌డిపి ప్రకటించిన రిపోర్టులో భారత్ స్థానం 126. 2009 ప్రకటించిన రిపోర్టులో భారత్ స్థానం 134. గడిచిన రెండు దశాబ్దాలలో భారత్‌లో ఆర్థిక ప్రగతి వలన మానవ అభివృద్ధిలో గుణాత్మకమైన మార్పులేదు. వికాసధార పేదలను విడిచి ప్రయాణిస్తున్నది.

## జీవిత సంతృప్తే ప్రగతికి కొలమానం

ప్రస్తుతం ఏయే దేశాలలో ప్రజలు జీవితకాలంలో ఎంత సంతోషం పొందుతున్నారు అనేదాన్ని ప్రగతికి కొలమానంగా తీసుకుంటున్నారు. లండన్‌లోని లెగాతకు ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ 50 దేశాలలో పరిశోధన చేసింది. వాటిలో భారత్ స్థానం 46. భౌతిక సంపద (మెటిరియల్ వెల్త్) జీవిత సంతృప్తి (లైఫ్ శాటిస్‌ఫాక్షన్) ఈ రెండు విషయాలపై ఆధారపడి పరిశోధన చేసింది. జీవిత సంతృప్తి అంటే వస్తువుల వాడకంలో స్వాతంత్ర్యం, ఆరోగ్యం, సమానత, మతస్వేచ్ఛ, ఆదాయం, తక్కువ నిరుద్యోగ రేటు, తక్కువ విడాకులు మొదలైన వాటిని కొలమాణంగా పరిగణించింది. ప్రగతిని కేవలం భౌతిక సంపద ద్వారా నిర్ణయించలేము. వీటి దృష్ట్యా భారత్‌లో నిరుద్యోగం, తక్కువ ఆదాయం, అనారోగ్య పరిస్థితులు, పెరుగుతున్న విడాకులు, మత అల్లర్లు, పంపిణీలో అసమానతలు మొదలైనవి ప్రజలలో తీవ్ర అసంతృప్తిని తెలియజేస్తున్నాయి. ప్రగతికి అర్థం జీవితాన్ని సంతోషంగా అనుభవించడం. దానిలో మనం చాలా వెనుకబడివున్నాం.

పర్యావరణం, కాలుష్యం మీద వివిధ దేశాలలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. ప్రపంచంలో శీఘ్రంగా పారిశ్రామీకరణ, భారీ ప్రాజెక్టులు, విపరీతంగా ఖనిజాల వెలికితీత, థర్మల్ విద్యుత్ కేంద్రాల వలన పర్యావరణ అసమతుల్యత పెరిగింది. అత్యధికంగా ఖనిజ పదార్థాలు దహనం చేయటం వలన జలవనరులు కుంచించుకుపోవడం, అడవులు తరిగి పోవడంతో నీరు, వాయువు కాలుష్యానికి గురి అవుతున్నాయి. విస్తృతంగా ఆనకట్టల నిర్మాణం వలన అడవులు నశించిపోవడం, లవణాత్మక భూమిగా మారిపోవడం, నిర్వాసితుల సమస్యలు మొదలగునవి ముందుకు వచ్చాయి. విద్యుత్ కేంద్రాల వలన నదీ జలాలు, వాయువులు కలుషితమవడంతో పాటు వాతావరణం వేడెక్కుతుంది. పర్యావరణానికి నష్టం కలిగించే గనుల తవ్వకం, భారీ పారిశ్రామిక సంస్థలు మొదలగు వాటికి ప్రత్యామ్నాయం చూపించడం వాస్తవ అభివృద్ధి.

పై విషయాల నేపథ్యంలో అభివృద్ధికి అర్థం ఏమిటి? ఎవరికోసం అభివృద్ధి? సాధారణ ప్రజలు అభివృద్ధిని ఎంతవరకు పొందుతున్నారు? భారత్‌లో సామాన్య ప్రజలు గుణాత్మకంగా అభివృద్ధి చెందడంలో ఎందుకు విఫలమవుతున్నారు? ఈ మొత్తం ప్రశ్నలకు జవాబు వెతకటానికి ముందు రాజ్య చరిత్ర, సామ్రాజ్యవాద యుగంలో భారత దళారీ పెట్టుబడిదారుల చరిత్ర, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రణాళిక, శ్రామిక వర్గపాత్ర మొదలైన విషయాలు అధ్యయనం చేయాలి.

## ఖనిజాల తవ్వకాలు ఎగుమతుల కోసమే, దాన్ని అభివృద్ధిగా చెప్పజాలము.

ప్రపంచంలో సమృద్ధిగా ఖనిజ పదార్థాలు వున్న దేశాలలో ఏ వొక్క దేశం అభివృద్ధి చెందలేదు. లాటిన్ అమెరికా, ఆఫ్రికాలలో అనేక దేశాలు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఖనిజ పదార్థాలు వున్న దేశాలు, సామ్రాజ్యవాద దోపిడీకి గురై, పీడిత దేశాలుగా, పేద దేశాలుగా మారాయి. భారత్ కూడా సామ్రాజ్యవాద దోపిడీకి

గురై ఖనిజ పదార్థాల ఎగుమతి దేశంగా మారింది. భారత్‌లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద కంపెనీలను ఆకర్షించడం కోసం తీవ్రంగా పోటీ పడుతున్నాయి. వివిధ దేశాల విదేశీ, దేశీ కంపెనీలకు అనేక రకాలుగా రాయితీలు చూపించి ఆకర్షిస్తున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ పోటీలో అతి భయంకర రూపం తీసుకుంటున్నాయి. ఈ రాష్ట్రాలలో ఇనుపరాయి, క్రోమైట్, బొగ్గు బాక్సైట్, సున్నపురాయి, డోలమైట్ మాంగనీసు మొదలైన ఖనిజాలు సమృద్ధిగా వున్నాయి. ఈ ఖనిజాలు తవ్వి విదేశాలకు ఎగుమతి చేయడానికి, రాష్ట్ర ప్రభుత్వాలు, దళారీ పెట్టుబడిదారుల మధ్య పోటి నడుస్తున్నది. భారతదేశంలో దొరికే ఖనిజాలలో 97.37 శాతం క్రోమైట్, 70 శాతం బాక్సైట్, 34 శాతం ఇనుపరాయి, 95 శాతం నికెల్, 67 శాతం గ్రాఫైట్, 25 శాతం బొగ్గు నిల్వలు ఒడిశాలో వున్నాయి. ఖనిజాల ఆధారంగా స్టీల్‌ప్లాంట్‌లు, అల్యూమినియం ప్లాంట్‌లు నెలకొల్పడానికి ఒడిశా ప్రభుత్వం దేశీ, విదేశీ కంపెనీలతో అనేక ఒప్పందాలు చేసుకొన్నది. వీటిలో ప్రముఖ కంపెనీలు కాశీపూర్ వద్ద ఉత్కల్ అలూమినా రిఫైనరీ ప్లాంట్, లాంజిగూడ వద్ద వేదాంత, స్టెర్‌లైట్, దుబరి వద్ద టిస్కోస్పాంజీ, కళింగనగర్ వద్ద, టాటా, నిలోచల్, జిందాల్ స్టీల్, జిజి చందు స్టీల్ వంటి 146 దేశీ విదేశీ కంపెనీలకు ప్లాంట్‌లు నెలకొల్పటానికి మంజూరు చేసింది. మొత్తం ఒప్పందాల పెట్టుబడులు 6 లక్షల 60 వేల కోట్లు. విద్యుత్ రంగంలో ఒడిశా అగ్రగామిగా వున్నది. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసిన మొదటి రాష్ట్రం ఇదే. విద్యుత్ ప్లాంట్‌లు ప్రైవేట్ రంగంలో నెలకొల్పడానికి వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొన్నది. వీటిలో చెప్పుకోదగ్గవి స్టెర్‌లైట్ ఎనర్జి, టాటా పవర్, నిలోచల్ పవర్, ఎస్సార్ పవర్, జిందాల్ థర్మల్ పవర్, భూషణ పవర్, సహారా ఇండియా పవర్, బీసా పవర్ మొదలైనవి. ఈ సంస్థలు ఒక లక్ష కోట్ల రూపాయల ముడుపులు ఇస్తాయి.

1948 – 1956లలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక విధానంలో బొగ్గు, గ్యాస్, పెట్రోలియం, ఇనుపరాయి, సీసం, జింక్ మొదలైనవి ప్రభుత్వ యాజమాన్యంలో వుంటాయి. 1973 జనవరి 30న బొగ్గు ఖనిజాన్ని జాతీయకరణ చేసారు. 1993 ఫిబ్రవరి 12న చారి కమిటీ చేసిన సిఫార్సులను అనుసరించి బొగ్గుగనులను పూర్తిగా ప్రైవేటీకరణ చేసింది. ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ తర్వాత గనుల తవ్వకాలలో బహుళజాతి సంస్థలు ప్రవేశించాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన అబుదుల్ కమిటీ రిపోర్టు అనుసరించి గనుల రంగాన్ని ప్రైవేటికరణ చేయాలి. 50 హెక్టార్ల వైశాల్యం వున్న గనులకు గ్రామసభ అనుమతి అవసరంలేదు. గనుల లీజు పరిధి 10 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్ల నుండి 100 కిలోమీటర్లకు పెంచాలి. గనుల లీజును పునరుద్ధరించాలి. గనుల ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి అనే ఆదేశాన్ని ఎత్తివేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట సమయంలో గనులు లీజుకు ఇవ్వనిచో కేంద్ర ప్రభుత్వం నేరుగా లైసెన్స్ మంజూర్ చేయవచ్చు. అబుదుల్ హుదా కమిటీ రిపోర్టు వలన దేశీయ దళారీ కంపెనీలు, విదేశీ కంపెనీలు (ఎమ్ఎన్‌సి, టిఎన్‌సి) ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో గనులు పెద్ద ఎత్తున తవ్వి ప్రకృతి సంపదను దోపిడీ చేయటానికి అధికారం పొందాయి. 2007 డిసెంబర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రులు గనుల రంగంలో కేంద్రజోక్యాన్ని తీవ్రంగా నిరసిస్తూ డిమాండ్ పత్రాన్ని ఇచ్చారు. ఈ డిమాండ్లలో ప్రైవేటీకరణను వ్యతిరేకించలేదు. వారి లక్ష్యం గనుల రంగం లూటీలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యాన్ని వ్యతిరేకించడమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనులను ప్రైవేటీకరణ చేసి ఎక్కువ మొత్తంలో నల్లడబ్బు పోగేయడాన్ని ఒక పంథాగా మార్చాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి మధుకోడ రెండు సంవత్సరాలలో గనులను ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టుకు ఇచ్చి 4వేల కోట్ల రూపాయల ఆస్తి పోగేసుకున్నాడు. కర్ణాటకలో రెడ్డీ బ్రదర్స్ బళ్ళారీ ఇనుపరాయి ఎగుమతి చేసి 50వేల కోట్ల సంపత్తికి యజమానులు అయ్యారు. ఒడిశా చరిత్ర అంతా గనుల లూటీ చరిత్ర. బిజూపట్నాయక్ పరిపాలనలో నియమించిన సరజు ప్రసాద్ కమిషన్ గనుల అవినీతిలో ప్రభుత్వాన్ని దోషిగా నిలిపింది. రాష్ట్ర అవినీతి విభాగం గనుల వ్యాపారంలో నియమాల ఉల్లంఘన విస్తృతంగా జరిగినట్లు ఆరోపించింది. ప్రస్తుత నవీన్ పట్నాయక్ పరిపాలనలో గనుల అవినీతి అంతిమ దశకు చేరుకొంది. 60 వేల కోట్ల గనుల అవినీతిపై గందరగోళం ఏర్పడి విధానసభ, ఉభయ పార్లమెంట్ సభలు వాయిదా పడ్డాయి.

మొదట గనుల యజమానులు అనుమతి లేకుండా క్రోమైట్, బాక్సైట్, మాంగనీస్, ఇనుపరాయి, సున్నపురాయి గనులు తవ్వి విదేశాలకు అమ్మి కోట్ల కోలది రూపాయలు లూటీ చేసారు. కొందరు గనుల యజమానులు భారతీయ ఖనిజ బ్యూరో అనుమతిని పొంది, అనుమతులకు మించి ఖనిజ వ్యాపారం చేసి కోట్లాది రూపాయల లాభాలు పొందారు. ఒడిశా హైకోర్టు నియమించిన కేంద్రీయ కమిటీ సమాచారం ప్రకారం రాష్ట్రంలో నడుస్తున్న 341 గనులలో 215 గనులకు అంటే 60 శాతం గనులకు కేంద్ర ప్రభుత్వ అనుమతి లేదు. ఈ అవినీతిలో భ్రష్ట రాజకీయ నాయకులు, దళారీలు, బ్యూరోక్రాట్లు, పోలీసు ఉన్నతాధికారులు, పర్యావరణ, గనుల శాఖ మంత్రుల విభాగాలు ముఖ్యపాత్ర వహిస్తున్నాయి. సుమారు 3 లక్షల కోట్ల రూపాయల అవినీతి కేసులు రాష్ట్రంలోని వివిధ కోర్టులలో నడుస్తున్నాయి. ఖనిజ సంపద సమృద్ధిగా వున్న ఒడిశా వెనుకబడిన రాష్ట్రంగా పేరుగాంచినది. దేశీ, విదేశీ పెట్టుబడిదారుల యాజమాన్యంలో గనుల రంగం వున్నంత కాలం ఒడిశా లూటీకి గురి అవుతుంది. ఉరుగ్వే, సూడాన్, సోమాలియా, బ్రెజిల్, చిలీ, నికరాగువా వంటి లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు ఒడిశా లాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి.

## నిర్వాసిత సమస్య కార్మిక వర్గానికి జన్మనిస్తుంది

నేడు మనము అభివృద్ధి అంటే ఖనిజ అధారిత భారీ పరిశ్రమలు, భారీ ఆనకట్టలు, ఓడరేవులు, రైలు మార్గాలు, హైవేలు, ఉద్యానవనాలు అని భావిస్తున్నాము. ఏ దేశంలోనైనా ఆర్థికాభివృద్ధికి ఇవి తోడ్పడతాయి. ఉత్పత్తి, ఆదాయాలు పెరుగుతాయి. ప్రజలకు ఉపాధి దొరుకుతుంది. మరో వైపు పైన పేర్కొన్న ప్రాజెక్టుల వలన ప్రజలు నిర్వాసితులుగా తయారు అవుతారు. గడిచిన 60 సంవత్సరాల ఒడిశా చరిత్ర అంతా దళితులు, ఆదివాసులు నిర్వాసితులుగా మారిన చరిత్ర బ్రిటీష్ ప్రభుత్వ భూ సేకరణ చట్టము 1894, ఒడిశా ప్రభుత్వ పునరావస చట్టం 2006, బ్రిటీష్ ప్రభుత్వ అటవీ విధాన చట్టాలు – 1855, 1878, 1894, 1927: భారత ప్రభుత్వ 1952 అటవీ చట్టం జాతీయ అటవీ హక్కుల చట్టం 2006, ఒడిశా ప్రభుత్వ 1972 అటవీ చట్టము, ఆదివాసీ ప్రాంతాల పంచాయితీ విస్తరణ 1996, సెజ్ చట్టం 2005 తదితర చట్టాలన్నీ చిన్న నామమాత్ర రైతులు, భూమి లేని వ్యవసాయ కార్మికులు, దళితులు, ఆదివాసుల నుండి జల్, జంగల్, జమీన్‌ను తీసుకొని దళారీ పెట్టుబడిదారి చేతుల్లో పెట్టాయి. 1990 తర్వాత వచ్చిన నూతన ఆర్థిక సంస్కరణలు వ్యవస్థను అస్తవ్యస్తం చేసాయి. 1940 దశాబ్దంలో మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రం, 80 దశాబ్దంలో హిరాకుడ్ బహుళార్థ సాధక ప్రాజెక్టు, రూర్కేలా స్టీల్‌ప్లాంట్, సునబెడామిగ్ అనుగ్రల్, దామన్‌జోడి అల్యూమినియం ప్రాజెక్టు, 90ల నుండి 2010 వరకు భూషణ స్టీల్, కాశీపూర్, లాంజిగడ్, ఝూర్సిగూడలలో అల్యూమినియం ప్రాజెక్టులు, చిలికాలో టాటా రొయ్యల ప్రాజెక్టు, గోపాల్‌పూర్‌లో టాటా ఉక్కు ప్లాంట్, కళింగనగర్‌లో టాటాకు చెందిన అనేక స్టీల్ ప్లాంట్‌లు, జగత్‌సింగ్‌పూర్‌లో పోస్కో స్టీల్ ప్లాంట్, ఝూరసుగూడాలో వేదాంత ఆల్యూమినియమ్, స్పాంజ్ ఐరన్ ప్రాజెక్టులు, ఇంకా చిన్న మధ్య తరహా పరిశ్రమల వలన, ఇనుపరాయి, డోలమైట్, బాక్సైట్, గనుల తవ్వకం వలన వేలాది ప్రజల జీవనం విచ్ఛిన్నమైంది. ఒడిశాలో నిర్వాసితులైన మొత్తం ప్రజలలో 70 శాతం ఆనకట్టల నిర్మాణం వల్లనే. హిరాకుడ్ ప్రాజెక్టు వలన 22 వేల 144 కుటుంబాలు, రెంగాలీ ప్రాజెక్టు వలన 11 వేల 289 కుటుంబాలు, అపర ఇంద్రావతి ప్రాజెక్టు వలన 5 వేల 39 కుటుంబాలు నిర్వాసితమయ్యాయి. మిగిలిన 12 శాతం ఫ్యాక్టరీల వలన నిర్వాసితులవుతున్నారు. కేవలం రూర్కేలా స్టీల్‌ప్లాంట్ వలన 4 వేల 257 కుటుంబాలు నిర్వాసితమయ్యాయి. 1951 నుండి 1990 వరకు గనులు, కర్మాగారాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఆనకట్టలు, అభయారణ్యాలు, పట్టణ అభివృద్ధి పథకాల వలన ఒక లక్ష కుటుంబాలకు చెందిన 5 లక్షల ప్రజలు నిర్వాసితులైనారు. ఒడిశా ప్రభుత్వం 146 ఒప్పందాలు చేసుకున్నది. వాటివలన ఎంతమంది ప్రజలు నిర్వాసితులు అవుతారో ప్రభుత్వం దగ్గర లెక్కలు లేవు. సుమారు మరో లక్ష కుటుంబాలకు చెందిన 5 లక్షల ప్రజలు నిర్వాసితులు అవుతారు. మొత్తం 10 లక్షల ప్రజలు నిర్వాసితులు అవుతారు. నిర్వాసితులలో ఎక్కువ భాగం ఆదివాసులు, దళితులు. వీరు జీవనం కోసం భారతదేశం అంతా వలసలుగా తిరుగుతారు. బ్రిటీష్ వలస వాదుల నుండి భారత పాలకవర్గాలకు అధికార మార్పిడి జరిగిన తరువాత 1948 ఏప్రిల్ 12న మహానది మీద ఆనకట్ట నిర్మాణంకు శంకుస్థాపన చేస్తూ అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 'మీరు కష్టాలు అనుభవించాలి, దేశ ప్రయోజనం కోసం కష్టాలు అనుభవించక తప్పదు. అభివృద్ధి కోసం కొందరు త్యాగం చేయాలి' అన్నాడు. హిరాకుడ్ వలన నిర్వాసితులై బ్రజరాజ్‌నగర్‌లో నివసిస్తున్న ప్రజలు, మహానది కోయల్ కంపెనీ వలన రెండవసారి నిర్వాసితులైనారు. వాళ్లు మరల ఝూరసుగూడా టెలాకులీ ప్రాంతంలో నివాసమేర్పరుచుకున్నారు. భూషణ స్టీల్ ప్లాంట్ వలన తిరిగి మూడవసారి నిర్వాసితులు అయినారు. ఇప్పుడు సునబెడా మిగ్ విమాన ఫ్యాక్టరీ వలన మరొకసారి నిర్వాసితులు కావాలి. దేశం కోసం వాళ్లు ఎన్నిసార్లు కష్టాలు ఎదుర్కొవాలి? అభివృద్ధి స్రవంతిలో వాళ్లు పాల్గొనకుండా, దేశీయ ఉత్పత్తి పెరిగినా తలసరి ఆదాయం పెరిగినా నిర్వాసితులకు ఒరిగేదేమిలేదు. ఒడిశా పునరావస చట్టం 2006 నిర్వాసితుల బతికే హక్కును గ్యారెంటీ చేయగలదా!

## నయా సామ్రాజ్యవాద కానుక ప్రజలకు దారిద్ర్యం

పంచవర్ష ప్రణాళిక ప్రారంభించిన దినం నుండి ఆర్థిక వృద్ధిరేటు, తలసరి ఆదాయం వృద్ధిరేటుకు భారత్ ప్రాధాన్యత ఇచ్చింది. అభివృద్ధి రేటు, తలసరి ఆదాయం పెరిగినా సంపద, పంపకాలలో సామాజిక న్యాయం ప్రతిష్టించవచ్చు. అభివృద్ధి చెందిన దేశం పై వాటిని సాధించగలదు. అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం పై లక్ష్యాలను సాధించలేదు. జాతీయ ఆదాయం పెరిగినా పేదరికం పెరుగుతుంది. భారత్ వంటి వర్గ సమాజ దేశంలో అసమాన అభివృద్ధి తప్ప సమగ్ర అభివృద్ధి లేదు. ప్రపంచబ్యాంక్, భారత ప్రభుత్వం, ప్రణాళికా కమీషన్, కొద్ది మంది సంస్కరణ వాదులు, ఆర్థికవేత్తలు, భారత్‌లో పేదరికం రానురాను తగ్గుతున్నదని చర్చిస్తున్నారు. ఆర్థికవేత్తలైన విఎమ్ దాండేకర్, నీలకంఠ రథ్ పేదరికానికి సూచించిన కొలమానం ప్రకారం మనిషికి అవసరమైన 2250 క్యాలరీల ఆహారం కోసం 1968 – 69 నాటి ధరలను అనుసరించి గ్రామీణ ప్రాంతంలో 324 రూపాయల కంటే, పట్టణ ప్రాంతంలో 486 రూపాయల కంటే తక్కువ ఆదాయం గలవారు పేదవారుగా నిర్ధారించారు. 1968 – 69లో వారి గణాంకాలను అనుసరించి గ్రామీణ ప్రాంతంలో 40శాతం, పట్టణ ప్రాంతంలో 50శాతం ప్రజలు దారిద్ర్యరేఖ కింద బతుకుతున్నారు. 1989లో ప్రపంచబ్యాంక్ భారత్‌లో పేదరికం గురించి ప్రకటించిన గణాంకాల ప్రకారం 1970, 1973, 1988లలో 52.4 శాతం, 42.5 శాతం, 40 శాతం ప్రజలు అతి పేదరికంలో బతుకుతున్నారు. దీని ప్రకారం

70, 80 దశాబ్దంలో పేదరికం తగ్గింది.

1989లో ప్రణాళిక కమీషన్ నియమించిన నిపుణుల కమిటీ గణాంకాల ప్రకారం 1973 – 74లో భారత్‌లో 54.9 శాతం ప్రజలు పేదరికం కింద వుంటే, 1987 – 88 నాటికి వారి సంఖ్య 39.3 శాతంకు తగ్గింది. ప్రణాళిక కమీషన్ చెప్పినట్లు గత 14 సంవత్సరాలలో పేదరికం తగ్గింపు పథకాలు సఫలం అయినాయి. 1973 –74లో ఒడిశాలో 66.26 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ కింద బతికితే 1987 – 88 లో 55.6 శాతంకు తగ్గిందని భారత ప్రభుత్వ గణాంకాలు సూచించినా భారత్‌లో 25వ వెనుకబడిన పేద రాష్ట్రంగా ఒడిశాను పేర్కొంటున్నారు. 1992లో భారత్‌లో 40 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన వుంటే చైనాలో 9 శాతం, పాకిస్తాన్‌లో 28 శాతం, ఇండోనేషియాలో 25 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన బతుకుతున్నారు. ప్రణాళిక కమీషన్ వేరే గణాంకాలను అనుసరించి 1993 – 94లో గ్రామీణ ప్రాంతంలో 37.6 శాతం నుంచి పేదరికం తగ్గి 1999 – 2000 నాటికి 29.7 శాతంకు చేరింది. పట్టణ ప్రాంతంలో 32.4 శాతం నుంచి 25.2 శాతంకు తగ్గింది.

జాతీయ సర్వేక్షణ సంస్థ (ఎన్ఎస్ఎస్) సరాసరి దినంకు తలసరి ఖర్చు తీసుకొని అర్జున్ సేన్‌గుప్తా, పికే కావన, జిరబింద్రన్‌లు ప్రకటించినట్లు 1993 – 94, 1999 – 2000, 2004 – 05 సంవత్సరాలలో 81.8, 80.7, 76.7 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన బతుకుతున్నారు. అంతర్జాతీయ దారిద్ర్యరేఖతో పోల్చితే భారతీయుల సరాసరి రోజువారి ఖర్చు 2 డాలర్ల కంటే తక్కువ. వీరిలో 41 శాతం అతిపేదలు. వారి రోజువారి తలసరి ఖర్చు 15రూ॥ లేదా డాలర్ కంటే తక్కువ. 2004 – 05లో 23.3 శాతం, మధ్యతరగతి, ధనిక వర్గాల ఖర్చు 5.1 డాలర్ల కంటే ఎక్కువ. 2006లో ప్రపంచబ్యాంక్ ప్రకటించిన ప్రపంచ అభివృద్ధి రిపోర్టులో 35 శాతం భారతీయులు అతి దయనీయమైన పరిస్థితిలో అంటే ఒక డాలరు కంటే తక్కువ ఖర్చు పెడుతూ బతుకుతున్నారు.

పేదరికం పెరుగుతున్నది, పేదలలో తారతమ్యం పెరుగుతున్నది. సంస్కరణలు ప్రారంభించిన తరువాత పేదరికం భయంకర రూపం దాల్చింది. ప్రపంచ అభివృద్ధి సంస్థ గణాంకాల ప్రకారం 1992లో 10 శాతం ప్రజల దగ్గర ఆదాయంలో 28.4 శాతం వుంటే, 1997 కల్లా అది 33.5కు శాతం పెరిగింది. ఆదాయంలో అతి తక్కువ 20 శాతం ప్రజల ఆదాయం 1992లో 8.5 శాతం వుంటే, 1997 నాటికి 8.2 శాతంకు తగ్గింది. 1999లో యుఎన్‌డిపి ప్రకటించిన లెక్కల ప్రకారం 1960 నాటి జన సంఖ్యలో ధనికుల ఆదాయం పేదల ఆదాయంతో పోల్చితే 30 రెట్లు అధికం. 1991 నాటికి 60 రెట్లు పెరిగితే 1998 కల్లా 78 రెట్లు పెరిగింది.

## వస్తువ్యామోహ సంస్కృతి దాడి - విద్య, ఆరోగ్యానికి ఆర్థికలేమి

మార్కెట్‌లో డిమాండ్ వున్నా లేకున్నా నూతన ఉత్పత్తులు వస్తున్నాయి. ప్రలోభపరిచే ప్రకటనలతో డిమాండ్‌ను సృష్టిస్తున్నారు. నయా సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలు మార్కెట్‌పై ఆధారపడినవి. వలస అర్ధ వలసలపై ఆధారపడి ప్రపంచ మార్కెట్ నడుస్తున్నది. 80 శాతం పేదరికం వున్న భారత్ వంటి దేశాల ప్రజలు ఆర్థికలేమి వలన నూతన ఉత్పత్తుల కొనుగోలు దారులు కాలేకపోతున్నారు. 20 శాతం వున్న వస్తు వ్యామోహ మధ్యతరగతి, ధనిక శ్రేణి మొత్తం నెలసరి ఖర్చులో ఎక్కువ భాగం విలాస వస్తువులకు ఖర్చు పెడతారు. 20 శాతం ధనికులు విలాస సామాగ్రి అయిన కారు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్, టెలివిజన్, మొబైల్ ఫోన్, సినిమా, హోటల్, విమానం, పార్క్ మొదలైన వాటికి ఖర్చు పెడతారు. దీన్ని కొంత మంది వికాసం అని చెప్పుతున్నారు. సమాజంలో కొందరు అన్ని రకాల వస్తు వినిమయదారులుగా వుండటం చెడుగా భావించనక్కరలేదు. సాధారణ ప్రజలు కోరుతున్న నివసించటానికి ఇళ్లు, ఆహారం, బట్టలు, పాఠశాల, కాలేజ్, హాస్పిటల్, రహదారి, తాగునీరు మొదలైనవి కొరత వున్నప్పుడు ధనికవర్గం విలాస వస్తువులకు ఖర్చు పెట్టడం సరిగాలేదు.

విద్య వలన మానవులు తమ ఉపాధి కల్పన, ఆదాయాన్ని గ్యారంటి చేసుకోగలరు. 2004 – 05 నాటి ఎన్.ఎస్.ఎల్ రిపోర్టు ప్రకారం 86.1 శాతం పేదలు నిరక్షరాస్యులు. మధ్యతరగతి, ధనిక శ్రేణిలో నిరక్షరాస్యులు 13.9 శాతం. వారు ఉన్నత విద్యను పొందుతున్నారు. పేదరికం నుండి రక్షింపబడుతున్నారు. అగ్రవర్ణాలు, ధనికశ్రేణులు విద్యవలన ఉన్నత ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రపంచంలో అనేక దేశాలు జాతీయ ఆదాయంలో 6 శాతం విద్యకు ఖర్చు చేస్తున్నాయి. భారత్‌లో మాత్రం 3 శాతమే ఖర్చు చేస్తున్నారు. ప్రైవేటీకరణ వలన ఖర్చు పెరిగి సాధారణ ప్రజలు విద్యకు దూరము అవుతున్నారు.

విద్యవలె మనిషి ఆయుషును కూడా అభివృద్ధిలో ఒక భాగంగా పరిగణించాలి. 1995లో భారత్‌లో సగటు ఆయుషు 60 సంవత్సరాలు, కెనడాలో 79 సంవత్సరాలు, ఫ్రాన్స్‌లో 78 సంవత్సరాలు, అమెరికాలో 76 సంవత్సరాలు, చైనాలో 69 సంవత్సరాలు, శ్రీలంకలో 72 సంవత్సరాలు. ఆరోగ్యం, సేవా, ఉపాధి కల్పన, ఆదాయంపై ఆధారపడి ఆయుషు ఉంటుంది. 2005లో భారత్‌లో శిశు మృత్యురేటు 58 శాతం. అభివృద్ధి చెందిన దేశాలలో శిశు మృత్యురేటు 10 శాతం కంటే తక్కువే. పేదరికం, వైద్యకొరత, స్త్రీల అనారోగ్యం వలన భారత్‌లో శిశు మృత్యురేటు అధికం. ఒడిశాలో అత్యధికరేటు 75 శాతం. భారత

*(మిగతా 38వ పేజీలో......)*

# దోపిడీ పాలకవర్గాల ఆపరేషన్ గ్రీన్‌హంట్ (ప్రజలపై యుద్ధం)కు వ్యతిరేకంగా కొనసాగుతున్న

# అమరుల ఆశయాల వెలుగులో

2011 జూలై 28 నుండి ఆగస్టు 3వరకు అమరవీరుల సంస్మరణ వారం ఉద్యమ ప్రాంతాలన్నింటా ఘనంగా జరపాలని పార్టీ, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజా ప్రభుత్వ శ్రేణులకు, విప్లవ ప్రజా సంఘాలకు, విప్లవ ప్రజానీకానికీ సి.పి.ఐ. (మావోయిస్టు) కేంద్రకమిటీ పిలుపు!

ప్రియమైన కామ్రేడ్స్,

ఈ భూమిపై సోషలిజం – కమ్యూనిజం లక్ష్యసాధనలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై పోరాడుతూ గత సంవత్సర కాలంలో 225 మందికి పైగా మన పార్టీ నాయకులు – సభ్యులు, ప్రజా మిలీషియా కమాండర్లు, పోరాట యోధులు, వివిధ ప్రజా నిర్మాణాల నాయకులు – సభ్యులు, ప్రజా మిలీషియా యోధులు, విప్లవ – సాధారణ ప్రజానీకం తమ అత్యంత విలువైన ప్రాణాలను ప్రజల కోసం ధారపోశారు. భారత విప్లవ మహోపాధ్యాయులు, మన పార్టీ నిర్మాతలు, ప్రియతమ నాయకులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హయ్ ఛటర్జీలు రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో నేలకొరిగిన ఈ కామ్రేడ్స్ అందరికీ మన పార్టీ కేంద్రకమిటీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది. కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం చెందిన రోజైన జులై 28 నుంచి వారం రోజుల పాటు మన ప్రియతమ అమరవీరుల స్మృతిలో సంస్మరణ వారాన్ని ప్రతి యేడాది లాగానే ఘనంగా జరపాలని పార్టీకి, పిఎల్‌జిఏకూ, విప్లవ ప్రజా ప్రభుత్వాలకు, విప్లవ ప్రజా సంఘాలకు, ప్రజలకు పిలుపునిస్తున్నది.

భారతదేశంలో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల నిర్దేశకత్వంతో, వారి పూర్తి మద్దతుతో చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా సాహసిక పిఎల్‌జిఏ బలగాలు నిర్వహించిన చారిత్రాత్మక ముకరం (తాడిమెట్ల –2) ఆపరేషన్ దెబ్బకు భారత పాలకవర్గాలు కంగుతిన్నాయి. అయితే కొద్దికాలంలోనే ఏపి ఏస్ఐబి కుక్కల వేటలో మన ప్రియతమ నాయకుడు, పార్టీ అధికార ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్ (రాజకుమార్), పత్రికా విలేకరి హేంచంద్ర పాండేలు అమరులయ్యారు. తర్వాత పాలకవర్గాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ (ప్రజలపై యుద్ధం) 2వ దశను ఆరంభించి తమ విప్లవ ప్రతీఘాతుక దాడిని మరింత తీవ్రతరం చేశాయి. ఈ దాడిని వీరోచితంగా తిప్పికొట్టే క్రమంలో, ప్రజాయుద్ధాన్ని నూతన ప్రాంతాలకు విస్తరించే క్రమంలో అనేక మంది కామ్రేడ్స్ మన దేశంలోని విశాలమైన అడవుల్లో, మైదానాల్లో, పట్టణాల్లో, తమ నులివెచ్చని నెత్తురు పారించారు. ఇందులో దండకారణ్యంలో 81 మంది, బీహార్ – జార్ఖండ్ – ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో 53 మంది, ఒడిషాలో 25 మంది, ఆంధ్ర – ఒడిషా సరిహద్దుల్లో 9 మంది, మహారాష్ట్రలో ముగ్గురు కామ్రేడ్స్, ఉత్తర తెలంగాణలో ఒక కామ్రేడ్ ఉన్నారు. వీరిలో 25 మందికి పైగా మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. వీరు విప్లవ లక్ష్యంలోనే త్యాగం యిమిడి వుందని, మృత్యువును ధిక్కరించి పోరాడకుండా మన లక్ష్యాన్ని సాధించలేమని గుర్తించి, దోపిడీ పాలకవర్గాలు 'ప్రజలపై సాగిస్తున్న యుద్ధాన్ని' ఓడించడం కోసం, ప్రజలను కాపాడడం కోసం, మొగ్గతొడుగుతున్న నూతన ప్రజా రాజ్యాధికారాన్ని మరింతగా ఎదిగించడం కోసం శత్రు బలగాలతో సాహసికంగా పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే క్రమంలో తమ అసువులు బాసారు. వీరు చిందించిన రక్తం దేశం నలుమూలల్లోని విశాల ప్రజానీకానికీ, మొత్తం ప్రపంచానికి ప్రేరణ అవుతోంది. పోరాట స్ఫూర్తిని అందిస్తోంది.

మన దేశంలోని వివిధ పీడిత వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు, ప్రగతిశీల సామాజిక కార్యకర్తలు, పర్యావరణ ఉద్యమకారులు, లాయర్లు, రచయితలు, కవులు, కళాకారులు, వివిధ ఎన్‌జిఓ సంస్థలు 'ప్రజలపై యుద్ధాన్ని' (గ్రీన్ హంట్) ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా, దీన్ని లక్ష్యపెట్టకుండా ఆపరేషన్ 'గ్రీన్ హంట్' 2వ దశలో తమ కిరాయి పోలీసు మూకలతో, విప్లవ ప్రతీఘాతక ముఠాలతో విచ్చలవిడి హత్యాకాండ కొనసాగించాయి. బూటకపు ఎన్‌కౌంటర్లు (డికెలో భిలాయ్, కొత్రపాల్, వాకుల్‌వాహి, తిమ్మాపూర్, పశ్చిమబెంగాల్ లో బురుడీ, ఝార్ఖండ్‌లో హేసియా తదితర) ; విప్లవోద్యమ ప్రజాపునాదిని దెబ్బతీసేందుకై గ్రామాలను చుట్టుముట్టి ప్రజలను భయభ్రాంతం చేసేలా గ్రామాల్లో, పొలాల్లో, అడవుల్లో కనిపించిన ప్రజలపై ఊచకోతను అమలు జరిపాయి. సాధారణ ప్రజలపై లెక్కలేనన్ని సార్లు కాల్పులు, మోర్టార్ షెల్లింగులు (డికెలో సావర్‌గాం షెల్లింగ్) కొనసాగించాయి. వీటితో పాటు పిఎల్‌జిఏ బలగాలపై విష ప్రయోగాలు (బీహార్‌లో ముంగేర్ జిల్లా గంగానది ఒడ్డున) ; ప్రజలపై, ప్రజా మిలీషియాపై శత్రు బలగాలు జరిపిన ఆంబుష్‌లు (డికెలో

# ప్రజాయుద్ధంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ఎత్తిపట్టండి!

# ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి!

మెట్టగూడపార – సిలింగేర్, గోండుమెట్ట, బుర్గిల్, ఏఓబిలో చెరువూరు) ఎన్‌సర్కిల్‌మెంట్ దాడులు (ఉత్తర బీహార్‌లో తూర్పు చంపారన్ జిల్లాలోనూ, ఒడిషాలో కాశీపూర్‌లోనూ తదితర) మొదలైన ఘటనల్లో అత్యధిక కామ్రేడ్స్ అమరులయ్యారు. ఛత్తీస్‌గఢ్ – ఒడిషా సరిహద్దున మహాసముంద్ జిల్లాలో పడ్కిపాలి దగ్గర విప్లవోద్యమ విస్తరణ కర్తవ్యంతో ప్రజల్లో పని చేస్తున్న పిఎల్‌జిఏ కంపెనీపై శత్రువు చేసిన ఆంబుష్‌లో ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు గ్రామస్తుల్ని కూడా శత్రువు క్రూరంగా హత్య చేశాడు.

శత్రు రహస్య హంతక ముఠాలు డికెలోని మాడ్ డివిజన్‌లో డికె ప్రెస్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ చైతెను సామూహికంగా అత్యాచారం చేసి అత్యంత క్రూరంగా హత్య గావించాయి. ఝార్ఖండ్‌లో సిమ్‌డేగా జిల్లాలో విప్లవ ప్రతీఘాతుక పిఎల్ఎఫ్ఐ (పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా) గూండా గ్యాంగులు కుడ్‌రూమ్, కోలేబిరా చెక్, రామ్‌జోల్ బజార్ టాండ్‌లలో అనేక మంది మన పార్టీ సానుభూతిపరులను, యాక్టివిస్టు గ్రూపు కార్యకర్తలను, ధనుంజయ్ గూండా గ్యాంగులు రాంచి జిల్లాలో మన ప్లాటూన్ కమాండర్‌తో సహా మరికొందరు కామ్రేడ్స్‌ను పాశవికంగా చంపాయి.

శత్రు బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో (ఝార్ఖండ్‌లోని బరంగ్‌బరు, గుమ్లా జిల్లా సామ్‌రీ, బీహార్‌లోని బాంకా జిల్లా మంజరి, తూర్పు చంపారన్ జిల్లా ధర్మాహ్ గ్రామంలో ఎన్‌సర్కిల్‌మెంట్ దాడి, డికెలో కుల్లెనార్ ఘటనలు) కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మన పిఎల్‌జిఏ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో శత్రు బలగాలపై సాగించిన దాడుల్లో వీరోచితంగా పోరాడుతూ కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. శత్రువులు కొంతమంది కామ్రేడ్స్‌ను, ప్రజలను మాయం చేశారు. కొన్ని ఇతర ఘటనలు, దుర్ఘటనలలో కొద్దిమంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

అమరులైన నాయకత్వ కామ్రేడ్స్‌లో పశ్చిమబెంగాల్‌లో లాల్‌గఢ్ ప్రాంతంలో ప్రజా నాయకులు కామ్రేడ్స్ ఉమాకాంత్ మహతో, శశధర్ మహతో, ఆర్‌సి సభ్యుడు కామ్రేడ్ అరుణ్, మరొక కామ్రేడ్ ఖోఖన్ మహతో, బీహార్‌లో బాంకా జిల్లా కటోరియా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంజరి ఎన్‌కౌంటర్‌లో అమరులైన ఆరుగురిలో ఒక నాయకత్వ కామ్రేడ్; ఒడిషాలో ప్రఫుల్ నాయక్, లక్ష్మణ్ ముండా, గాగ్రీ కడేస్కీ; బీహార్ – ఝార్ఖండ్‌లో స్ట్రైకింగ్ కంపెనీ కమాండర్ కామ్రేడ్ నితాంత్ (సెంట్రల్ మిలటరీ ఇన్‌స్ట్రక్టర్), ఒడిషాలో కాశీపూర్ చుట్టివేత దాడిలో బాసధార డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ రవి, డికెలో ఉత్తర బస్తర్ డివిజనల్ కమాండర్ – ఇన్ – చీఫ్ కామ్రేడ్ నాగేష్, మహారాష్ట్రలో గోందియా డివిజనల్ కమాండర్ – ఇన్ – చీఫ్ కామ్రేడ్ నాగేష్, ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లాలో సిసిఎం గార్డు, ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ కోసా (అయితు), డికెలో విద్యా విభాగ కమిటీలో నూతనంగా చేరనున్న విప్లవ ప్రజా టీచర్ కామ్రేడ్ చందన మొదలైనవారు వున్నారు. వీరితో పాటు సబ్‌జోన్ స్థాయిలో బి–జె–ఉ.ఛలో కామ్రేడ్స్ రాజేష్ ముండా, భూత్‌నాథ్, సలీమ్ మహతో, ప.బె.లో అరూప్ మోచి; ఏరియా కార్యదర్శి కామ్రేడ్ కిశోర్ (డికె), ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ విక్రమ్ ముండా, సెక్షన్ కమాండర్ కామ్రేడ్ రతన్ యాదవ్ (బీహార్), ఏసి/పిపిసి స్థాయిలో డికెలో కామ్రేడ్స్ చైతె, విక్రమ్, కేశాల్, మంగ్డూ; మహాసముంద్ జిల్లాలో కామ్రేడ్ నతాషా, సెక్షన్ / దళ డిప్యూటీ కమాండర్లు ఇద్దరు (డికె), ఒడిషాలో మన సప్లై విభాగపు డ్రైవర్ బాదల్ (మధు), డికె స్పెషల్ జోన్ యాక్షన్ టీం సభ్యుడు కామ్రేడ్ ప్రభాకర్, డివిజన్ ఐటీం సభ్యుడు కామ్రేడ్ రమేష్, పిఎల్‌జిఏ (కంపెనీ, ప్లాటూన్, సెక్షన్ / దళ) సభ్యులు 27 మంది (డికెలో కామ్రేడ్స్ ప్రమీల, కోసాలతో పాటు ఆరుగురు, బిజెలో కామ్రేడ్ విజయ్‌దాస్‌తో పాటు 11 మంది, ఏఓబిలో సిఆర్‌సి కంపెనీ – 3 సభ్యుడు కామ్రేడ్ సందీప్, బంగారురాజు, జ్యోతితో పాటు ఐదుగురు కామ్రేడ్స్, మహాసముంద్ జిల్లాలో కామ్రేడ్స్ రాజబత్తి, లచ్చుతో పాటు నలుగురు, మహారాష్ట్రలో కామ్రేడ్స్ మంజు, మంగులతో పాటు ముగ్గురు, పశ్చిమ బెంగాల్‌లో కామ్రేడ్ జీవన్ టుడు); గ్రామ విప్లవ ప్రజా కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ రామాల్ (ఎన్‌టి), కెకెసి కార్యదర్శి కామ్రేడ్ రామాధార్ (బీహార్), సంఘ నాయకులు – బీహార్‌లో కామ్రేడ్ ధరందేవ్, కెఏఎంఎస్ సీనియర్ నాయకురాలు కామ్రేడ్ విమల దేవిదాస్ కన్నాకే (డికె), జన మిలీషియా దళ కమాండర్ కామ్రేడ్ కోర్సా సుక్కాల్ (డికెలో), జన్ మిలీషియా సభ్యులు డికెలో ఎనిమిది మంది, ఝార్ఖండ్‌లో ఇద్దరు, యాక్టివిస్టు గ్రూపు కార్యకర్తలు ముగ్గురు (ఝార్ఖండ్), గ్రామ రక్షణ ప్రజా మిలీషియా సభ్యులు 11 మంది (ఏఓబి – ఆరుగురు, డికె – ఐదుగురు) ఉన్నారు.

మన పిఎల్‌జిఏ బలగాలు శత్రువుపై చేసిన దాడుల్లో బీహార్‌లో కజరా ఆంబుష్‌లో సెక్షన్ కమాండర్ కామ్రేడ్ రతన్ యాదవ్, దండకారణ్యంలో ఊసూర్ ఆంబుష్‌లో ఓయం బుద్రు, వెట్టి హిడ్మాల్, మోర్‌పల్లి ఆంబుష్‌లో సెక్షన్ డిప్యూటీ ముచాకీ గంగా, బెజ్జి ఆంబుష్‌లో మన పిఎల్‌జిఏ బెటాలియన్‌లో పిపిసిఎం, కమ్యూనికేషన్ మ్యాన్ కామ్రేడ్ మంగ్డూ, మహారాష్ట్రలో కాబ్రామెండ (గోందియా) ఆంబుష్‌లో డివిజనల్ కమాండర్ – ఇన్ – చీఫ్ కామ్రేడ్ నాగేష్, పిఎల్‌జిఏ సభ్యులు కామ్రేడ్స్ మంజు, మంగు, మరో కామ్రేడ్, నార్గొండ (గడ్‌చిరోలి)లో ప్రజా శత్రువు, పరమ కర్కోటకుడు అయిన చిన్నా వెంటన్ని ఖతం చేసిన వీరోచిత చర్యలో ఇద్దరు కామ్రేడ్స్, ప్లటూన్ –7 కమాండర్ కామ్రేడ్ మహరు, సభ్యుడు కామ్రేడ్ రాకేష్ నేలకొరిగారు. సులంగా ఆంబుష్‌లో ఒక కామ్రేడ్ అమరుడయ్యాడు.

మరో 50 మందికి పైగా సాధారణ, నిరాయుధ విప్లవ ప్రజలు డికె, బి – జె – ఉ.ఛ., లాల్‌గఢ్, ఒడిషాలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న 'ప్రజలపై యుద్ధం'లో బలయ్యారు. వీరిలో లాల్‌గఢ్ ప్రజా తిరుగుబాటులో భాగస్వాములైన ఆదివాసీ ప్రజలు, ఒడిషాలో విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో ముందు పీఠిన నిలిచిన ఆందోళనకారులు, డికె, బి – జె – ఉ.ఛ. లలోని విప్లవ సానుభూతిపరులు, ప్రజలు ఉన్నారు. వీరందరినీ 'మావోయిస్టులు' అనే పేరుతో పోలీసు, పారామిలటరీ బలగాలు, పశ్చిమబెంగాల్ హర్మద్ వాహిని, గణ ప్రతిరోధ్ కమిటీ గుండాలు, దండకారణ్యంలో కోయ కమాండోలు, ఎస్‌పిఓలు, సల్వాజుడుం గూండాలు హత్య చేశారు. లాల్‌గఢ్ ప్రాంతంలో పాలైబని, సియర్‌బని – కొత్వాలీ, తాగ్‌వేదా – భూలావేదా, బందర్‌బోనీ, ఝూర్‌గ్రామ్, నేతాయి గ్రామాల్లో హర్మద్ వాహిని గూండాలు; మరికొన్ని చోట్ల కేంద్ర – రాష్ట్ర సంయుక్త బలగాల వూచకోతలు; దండకారణ్యంలో కుట్రెం, రంగయ్యగూడ, కొత్తపల్లి, కొలార్, మడప, గురుగుట్ట, సింగన్నగూడ, హిరోలి, మురుంగ, మోర్‌పల్లి, తిమ్మాపూర్, కేశ్‌ముండి, చినారి, మన్కేలి, పుల్లుం, మోచానార్ వూచకోతలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఇవన్నీ 2010 ఆగస్టు నుంచి 2011 జూన్ మధ్య జరిగిన ఘటనలే.

అలాగే అనేక దశాబ్దాలుగా ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన విప్లవ మేధావులు, పౌరహక్కుల ఉద్యమ నాయకులు కామ్రేడ్స్ కన్నబీరన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ఆర్.ఎస్.రావు (సోమేశ్వరరావు) తదితరులు తుదిశ్వాస విడిచారు. వీరి అమరత్వం ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటు.

మరోవైపు దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న బలవంతపు విస్థాపిత సమస్యకు వ్యతిరేకంగా ప్రజలు మిలిటెంట్ పోరాటాలకు దిగుతూ ఫాసిస్టు పోలీసుల కాల్పుల్లో అనేక మంది కళింగనగర్ (ఒడిషా), సోంపేట, కాకరాపల్లి (ఏపి), జైతాపూర్ (మహారాష్ట్ర), భట్టా – పర్సోల్ (యు.పి.) వంటి చోట్ల నేలకొరిగారు. అలాగే యాంటీ మైనింగ్ ఉద్యమ కార్యకర్తలు ఒడిషాలోని కోరాపుట్ ప్రాంతంలో గంగూల్ తరంగీ, ఎం.సుబ్బారావు, బరగడలో మాధవ్ సింగ్ ఠాకూర్, రమేష్ సాహులను, డికెలో రావుఘాట్ మైనింగ్ వ్యతిరేక కార్యకర్త సనావు కుమెటీలను పట్టుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి హతమార్చారు. ఈ విస్థాపన వ్యతిరేక ఉద్యమంలో క్రియశీల భాగస్వామ్యం వహిస్తూ వాటికి నేతృత్వం వహిస్తున్న క్రమంలోనే ఒడిషాలో జాజ్‌పూర్ జిల్లాలోనూ, నియంగిరి ప్రాంతంలో కాశీపూర్‌లోనూ పోలీసు హత్యాకాండలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ రవితో సహా 14 మంది కార్యకర్తలు నేలకొరిగారు. విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో శత్రువు తలపెట్టిన దేశవ్యాప్త దాడిని ఓడించడంలో భాగంగా ప్రజాయుద్ధాన్ని నూతన ప్రాంతాలకు విస్తరింపజేసే వ్యూహాత్మక కర్తవ్యాన్ని చేపట్టి అమరులైన నియమగిరి, మహాసముంద్ ప్రాంతాల కామ్రేడ్స్ త్యాగాలు అమూల్యమైనవి.

ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా ప్రస్తుత రెండవ దశలో శత్రువు కిరాయి పోలీసు, పారామిలటరీ మూకల, విప్లవ ప్రతీఘాతుక ముఠాల పాశవికత మరింత పెరిగిందనేది స్పష్టం. ముందు పేర్కొన్న వివిధ ఘటనలతో పాటు దండకారణ్యంలో చింతల్‌నార్ హత్యలు – అత్యాచారాలు, గృహదహనాలు – లూటీలు, లాల్‌గఢ్ ప్రాంతంలో నతాయి గ్రామంలో సిపిఎం గూండాలు, కేంద్ర – రాష్ట్ర సంయుక్త బలగాల అండతో సాగించిన నరసంహారం ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. చింతల్‌నార్ ప్రాంతంలో మోర్‌పల్లి, తాడిమెట్ల, పులన్‌పాడ్, తిమ్మాపూర్ గ్రామాల్లో కోబ్రాలు, కోయ కమాండోలు, సల్వాజుడుం గూండాలు ఆరు రోజుల పాటు సాగించిన తెల్ల బీభత్సం (ముగ్గురి హత్య, ఆరుగురు మహిళలపై సామూహిక అత్యాచారం, కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులు, ధాన్యంతో కూడిన 300 ఇళ్ల లూటీ, అనంతరం దహనం), ఆ ప్రాంతానికి బయట నుంచి ఎటువంటి మద్దతు అందకుండా వారాల తరబడి పోలీసు, పారామిలటరీ బలగాల, కోయ కమాండోల దిగ్బంధం విప్లవ ప్రతీఘాతుక దాడి తీవ్రతకు అద్దం పడతాయి. దీనిని దేశవ్యాపితంగా ప్రజాస్వామికవాదులు తీవ్రంగా నిరసించారు. ఇలాగే నేతాయిలో సోషల్ ఫాసిస్టు సిపిఎం గూండాల నరసంహారానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో పెద్దయెత్తున ఆందోళన సాగింది. అంతేకాక వందలాది మంది స్థానిక ప్రజా సంఘాల, విప్లవ ప్రజా ప్రభుత్వాల కార్యకర్తలను, ప్రజలను అరెస్టు

చేసి నల్లచట్టాలు మోపి జైలుపాలు చేస్తున్నారు. ప్రత్యేకించి, మన పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీయడంలో భాగంగా శత్రు ఇంటెలిజెన్స్ కుక్కల వేటలో ఈ సంవత్సరం ఏప్రిల్ 29న ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులు, జూన్ నెలలో పీబీఎం కామ్రేడ్ భూపేష్ దా, అనేక మంది ఇతర నాయకత్వ కామ్రేడ్స్, కార్యకర్తలు శత్రు చేత జిక్కారు. వీరిని జీవితాంతం జైలులో బంధించడం కోసం వీరిపై వివిధ రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులు మోపారు. ఒక్కమాటలో చెప్పాలంటే, దేశవ్యాప్తంగా శత్రువు 'ప్రజలపై సాగిస్తున్న యుద్ధం' ఫలితంగా ప్రజల బతుకులు అల్లకల్లోలమవుతున్నాయి.

అడుగడుగునా శత్రు దమనకాండను తిప్పికొడుతూ పోరులో నేలకొరిగిన వందలాది కామ్రేడ్స్ ప్రజాస్వామిక – కమ్యూనిస్టు చైతన్యంతో ప్రదర్శించిన సాహసం, వీరత్వం, పాటించిన విలువలు, నెలకొల్పిన ఆదర్శాలు, త్యాగ సాంప్రదాయాలు, అందించిన విలువైన అనుభవాలు మన విప్లవ మార్గాన్ని కాంతివంతం చేశాయి. అమరుల సంస్మరణ వారాన్ని పురస్కరించుకొని మన ప్రియతమ నాయకులు, త్యాగమూర్తులు కామ్రేడ్స్ సి.ఎం., కె.సిలనూ, నక్సల్బరీ నుండి నేటి వరకూ అమరులైన వేలాది మంది జ్ఞాత, అజ్ఞాత అమరులందరినీ తలచుకుంటూ కేంద్రకమిటీ బరువెక్కిన గుండెలతో వినమ్రంగా తలవంచి నివాళులర్పిస్తున్నది. వారి ఆశయ సాధనకు తుదివరకూ అవిశ్రాంతంగా పోరాడ శపథం చేస్తున్నది. ఈ సందర్భంగా అమరుల బంధు మిత్రులందరికీ, సహచరులందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి సంవేదనలో పాలుపంచుకుంటున్నది. అమరులులేని లోటును పూడ్చాలని వారి ప్రియ సహచరులందరినీ కోరుతున్నది. క్షతగాత్రులైన కామ్రేడ్స్ ప్రదర్శించిన గొప్ప చైతన్యాన్ని చూసి అభినందిస్తూ వారు త్వరగా కోలుకొని వుద్యమంలో క్రియాశీలంగా పాలుపంచుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నది. శత్రువు చేతజిక్కినప్పటికీ క్రూరమైన చిత్రహింసలకు వెరవకుండా అత్యంత ధైర్యాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించిన, అమానుష పరిస్థితుల్లో సైతం జైళ్లను వర్గపోరాట కేంద్రాలుగా మలుస్తున్న సాహసిక కామ్రేడ్సందరికీ మన సి.సి. హార్దికాభివందనాలు తెలియజేస్తున్నది. దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్ హంట్ దమనకాండకు గురైన లక్షలాది ప్రజల బాధలో పాలుపంచుకుంటున్నది. తమ కష్టాలకు, కన్నీళ్లకు, బాధలన్నింటికీ కారణమైన శత్రువుకు వ్యతిరేకంగా ప్రజలు మరింత వర్గకసితో దృఢంగా అంతిమ విజయం సాధించేవరకూ పోరాడాలని కోరుతున్నది.

ప్రపంచవ్యాపితంగా చూస్తే ఈ సంవత్సరం అరబ్బు ప్రపంచం తిరుగుబాట్లతో దద్దరిల్లుతోంది. వీటికి విప్లవ నాయకత్వం లేకపోయినప్పటికీ లక్షలాది మంది అరబ్బు ప్రజలు నిరంకుశత్వానికీ, అవినీతికీ, నిరుద్యోగానికీ వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం అమెరికా సామ్రాజ్యవాదుల తొత్తు పాలకవర్గాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. ఈ ప్రజా తిరుగుబాట్లలో వేలాది మంది ప్రజలు, ప్రజా నాయకులు నేలకొరిగారు. వివిధ దేశాలలో ప్రజాస్వామ్యం కోసం, జాతి విముక్తి కోసం, వర్గ దోపిడీ పీడనల నుండి విముక్తి కోసం సామ్రాజ్యవాదానికి, అన్ని రకాల ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో నేలకొరిగిన వీరయోధులందరినీ అమరవీరుల సంస్మరణవారం సందర్భంగా స్మరించుకొని నివాళులర్పిద్దాం.

కామ్రేడ్స్

మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్ పిలుపు మేరకు మన కేంద్ర కర్తవ్య సాధనలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో గెరిల్లా యుద్ధం తీవ్రతరం అవుతోంది. మన అమరవీరుల మహత్తర త్యాగాల ఫలితంగా మనం ప్రజాయుద్ధంలో ఒక్కొక్క విజయాన్ని సాధిస్తూ పురోగమిస్తున్నాం. అమరుల త్యాగాలు లేకుండా పార్టీ చేపట్టిన రాజకీయ, సైనిక, సాంస్కృతిక, నిర్మాణ, ఉత్పత్తి, ప్రజా సంక్షేమం, నూతన ప్రాంతాల్లోకి విస్తరణ వగైరా క్యాంపెయిన్లను, అవి సాధించిన సత్ఫలితాలను ఊహించలేం. పోలీసు, పారా మిలటరీ, కమాండో బలగాల సంఖ్యను పెంచుతూ ఉద్యమ ప్రాంతాలను కార్పెటు సెక్యూరిటీతో నింపి ఉద్యమాన్ని గొంతు నులిమివేయాలని శత్రువు ఎన్ని కుట్రలూ, కుహకాలూ పన్నుతున్నప్పటికీ ఉద్యమంలో చొరవను మన చేతిలో నిలబెట్టడంలో అమరుల త్యాగాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. విప్లవోద్యమాన్ని పరిమితమైన ప్రాంతాల్లో కుదించివేసి నిర్మూలించాలని శత్రువు ప్రయత్నిస్తూ దేశంలోని విశాల నూతన ప్రాంతాలకు మనల్ని విస్తరించకుండా అడ్డుకోవడం కోసం పర్‌స్పెక్టివ్ ప్రాంతాలలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలంగా ఏర్పర్చుకుంటున్నాడు. అయినప్పటికీ మన విస్తరణ బలగాలు శత్రువుతో బాహాబాహీ పోరాడుతూ, కఠోరమైన గెరిల్లా యుద్ధంలో చేస్తున్న అమూల్యమైన త్యాగాలు, ప్రజాయుద్ధాన్ని సజీవంగా నిలపడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి.

శత్రువు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించేందుకు మన పార్టీ, సైనిక కమీషన్లు, కమాండ్లు చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడులు ఈ కాలంలో చిన్న, మధ్యస్థాయిలో జరిగాయి. ప్రత్యేకించి గత సంవత్సరం బీహార్‌లో జరిగిన కజరా (లఖీసరాయి) ఆంబుష్, సరండాలో శత్రు దాడిని విఫలం చేసిన మన కౌంటర్ ఆపరేషన్, ఈ సంవత్సరం ఝార్ఖండ్‌లో తీవ్ర నిర్బంధం మధ్యనే లోహర్‌దగా జిల్లా ధర్‌ధరియా అడవుల్లో మన పిఎల్‌జిఏ అత్యంత సాహసంగా

నిర్వహించిన ఆంబుష్, దండకారణ్యంలో మోర్‌పల్లి (చింతల్‌నార్) ఆంబుష్, బోర్‌గూడా నైట్ ఆంబుష్ (కేర్లాపాల్), అమమోరా (గరియాబంద్) ఆంబుష్, ఝూరాఘాటీ ఫ్రంటల్ అటాక్, గాటం వద్ద ఎంపివిపై నైట్ ఆంబుష్, బెజ్జి క్యాంపు సమీపంలోనే ఆంబుష్, కిరందుల్ నైట్ ఆంబుష్, సులంగీ (కోయలీబేద) ఆంబుష్ మొదలైన ఘటనలు శత్రు దూకుడుతనానికి కళ్లెం వేశాయి. ప్రత్యేకించి, శత్రువు దండకారణ్యంలోని నారాయణపూర్ జిల్లాలో సైన్యాన్ని మోహరించే ప్రక్రియ వేగిరపరుస్తున్న తరుణంలో ఈ దాడులు జరగడం దోపిడీ పాలకవర్గాలను, శత్రు బలగాలను తీవ్రంగా కలవరపరిచాయి. అలాగే ఝూర్ఖండ్‌లో వేలాది శత్రు బలగాలు సైన్యం తరహాలో మన కేంద్ర క్యాంపులపై జరిపిన దాడుల్ని మన పిఎల్‌జిఏ బలగాలు అత్యంత వీరోచితంగా తిప్పికొట్టాయి.

మరోవైపు లాల్‌గఢ్, నారాయణపట్నా ఉద్యమాలు తీవ్ర నిర్బంధంలో సైతం శత్రువుకు తలవంచకుండా మిలిటెంట్‌గా కొనసాగుతూ మరింతగా అభివృద్ధి అవుతున్నాయి. రాజ్య వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు రాజ్యాధికార స్వాధీనం కోసం సరియైన పంథాను చేపట్టి దీర్ఘకాల ప్రజాయుద్ధంలో భాగమయ్యాయి. ఇదే మార్గంలో ఒడిషాలో కళింగనగర్, నియమగిరి, మాలి – దేవ్‌మాలి, దండకారణ్యంలో లోహండిగూడ, రావుఘాట్, బోధ్‌ఘాట్, పల్లెమాడి, ఏపిలో సోంపేట, కాకరాపల్లి, విశాఖ జిల్లాలో బాక్సైట్ గనుల తవ్వకాలకు, దుమ్రిగూడలో చైనా మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా విస్థాపన వ్యతిరేక పోరాటాలు మరింత ముందుకు పురోగమిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఆందోళన రోజు రోజుకు విశాల ప్రజా రాశుల పునాదిపై బలోపేతం అవుతూ మిలిటెంట్‌గా పురోగమిస్తోంది. అనేక మంది ప్రజలు తమ గుండెనెత్తుర్లు, ధారపోస్తూ పోరాడిన ఫలితంగానే ఇది సాధ్యమైంది. ఇటీవలీ కాలంలో పెద్ద ఎత్తున విప్లవ శక్తుల భాగస్వామ్యంతో సాగిన ఇటువంటి సింగూర్, నందిగ్రామ్, కళింగనగర్ పోరాటాలు, లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా తిరుగుబాట్ల స్ఫూర్తితో విస్థాపన వ్యతిరేక పోరాటాలు దేశంలో అనేక ప్రాంతాల్లో రగుల్గొంటున్నాయి. సామ్రాజ్యవాదుల, వారి తొత్తు దోపిడీ పాలకవర్గాల ధనికవర్గ – కార్పొరేట్ 'అభివృద్ధి నమూనా'ను ప్రజలు ఎక్కడికక్కడ వ్యతిరేకిస్తూ ఆందోళనలకు దిగుతున్నారు. ఇలాంటి పోరాటాలు ఎక్కడ బద్దలైనా వీటికీ మావోయిస్టులకు వున్న లింకును పసిగట్టే పనిలో ఇంటెలిజెన్స్ జాగిలాలు వాటి చుట్టూ తిరుగుతూ, వాటికి మావోయిస్టు రంగును పులిమేందుకు ప్రయత్నిస్తున్నాయంటే దోపిడీ పాలకవర్గాలు ఎంతగా కలవరపడుతున్నాయో అర్థమవుతుంది. మరోవైపు మావోయిస్టు ప్రజాయుద్ధం దేశంలోని ప్రజాస్వామికవాదులను, ప్రగతిశీల శక్తులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. మన అమరవీరుల త్యాగాలే వీరికి ప్రేరణనందిస్తున్నాయి.

కామ్రేడ్స్,

భారత దళారీ పాలకవర్గాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల, విస్తరణవాద, ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక, అభివృద్ధి నిరోధక ఆర్థిక, రాజకీయ, సామాజిక, పర్యావరణ విధానాలకు అడ్డుగా నిలిచిన విప్లవోద్యమాన్ని రూపుమాపడం కోసం ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో 'ప్రజలపై ప్రతీఘాతుక యుద్ధాన్ని' రుద్దడంతో దేశంలో సామాజిక వైరుధ్యాలన్నీ మరింత పదునెక్కుతున్నాయి. దీనివల్ల మావోయిస్టు శక్తులు, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు, దేశభక్త శక్తులు, జాతుల విముక్తి ఉద్యమ శక్తులు, విశాల ఆదివాసీ, దళిత, మత మైనారిటీ తదితర సామాజిక పీడిత జన సముదాయాలు సమైక్యం కావడానికీ, విస్తృత స్థాయిలో ప్రజా ప్రతిఘటనను కొనసాగించడానికి గొప్ప అవకాశాలు ముందుకొస్తున్నాయి. ఇటు దక్షిణాసియా, అటు అరబ్బు ప్రపంచం జ్వలిస్తుండడం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో వనరుల దోపిడీకి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు కొనసాగడం, పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక సంక్షోభం ఫలితంగా అనేక పరిశ్రమల మూసివేత కారణంగా వీధుల పాలైన లక్షలాది కార్మికులు, నిరుద్యోగ యువతరం ఆందోళనలతో ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, దేశ, ప్రపంచ వస్తుగత పరిస్థితి అత్యద్భుతంగా ఉంది. ఇలాంటి స్థితిలో ఉద్యమాల నాయకత్వాన్ని, ప్రత్యేకించి మావోయిస్టు నాయకత్వాన్ని నిర్మూలించేందుకు శత్రువు చేసే అన్ని కుట్రలను, వ్యూహాలను, ఎత్తుగడలను తిప్పికొడుతూ నాయకత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యం మునుపెన్నటికంటే ప్రాధాన్యతను సంతరించుకుంది. శత్రువుకు అభేద్యమైన పద్ధతిలో కార్మికవర్గతత్వంతో మావోయిస్టు ప్రజాయుద్ధ సిద్ధాంతపు గతిశీల తత్వాన్ని (డైనమిజం) లోతుగా అవగాహన చేసుకుంటూ కమిటీ పని పద్ధతులు, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ మనల్ని కాపాడుకుంటూ, శత్రువును నిర్మూలించడంలో మన పార్టీ మొత్తం విప్లవ శ్రేణులకు ఆదర్శంగా నిలబడాలి. రహస్య పనిపద్ధతులు, నియమాలు దృఢంగా అమలు చేయాలి. శత్రు బలాన్నీ, వాడి వ్యూహాత్మక లక్ష్యాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. మారిన పరిస్థితులకు అనుగుణంగా మనం పాత ఎత్తుగడలను, పని విధానాన్ని మార్చుకొని నూతన ఎత్తుగడలను, పని విధానాన్ని రూపొందించుకోవాలి. రూపొందించుకున్న ఎత్తుగడలను, రహస్య పని విధానాన్ని అమలు జరపడంలో ఖచ్చితంగా వ్యవహరించాలి. తద్వారా నాయకత్వ నష్టాలను తగ్గించుకుంటూ అనవసర నష్టాలను నివారించగలుగుతాం.

ఉద్యమ ప్రాంతాలలో కార్పెట్ సెక్యూరిటీ అండతో దూకుడుగా దాడికి వస్తున్న శత్రు బలగాల చొరవను దెబ్బతీసే విధంగా ప్రజాపునాదిపై ఆధారపడి పథకం ప్రకారం నిరంతరం చిన్న, మధ్యస్థాయి, పెద్ద చర్యల్ని కొనసాగిస్తూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం – విస్తృతం చేయాలి. విజయానికి హామీ ఉండే విధంగా చర్యల పథకాలు రూపొందించుకోవాలి. యుద్ధచర్యల్లో సృజనాత్మకంగా కంబాట్ స్కిల్స్‌ను, ఆయుధాలు, గ్రెనేడ్లు, మైన్లు, కాక్‌టైల్స్ వంటివి సమన్వయిస్తూ వినియోగించాలి. గెరిల్లా యుద్ధానికి అండగా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక, రాజ్యహింస వ్యతిరేక ప్రజా పోరాటాలను, ఆందోళనలను తీవ్రతరం చేయాలి. ప్రజా ఆందోళనలను సాయుధ ప్రతిఘటనా పోరాటాలుగా అభివృద్ధి చేయాలి. విప్లవోద్యమానికి ప్రజాపునాది లేకుండా చేసి నిర్మూలించాలనే శత్రు ఎల్ఐసి మోసపు యుద్ధాన్ని ప్రజల్లో బహిర్గతం చేయాలి. ప్రజలను జాగరూకుల్ని చేసి విప్లవోద్యమం చుట్టూ విశాల ప్రజాపునాదిని బలోపేతం చేయాలి. పార్టీ, ప్రజాసైన్యంతో పాటుగా ఐక్యసంఘటనకు తగిన ప్రాముఖ్యత నిచ్చి నాలుగు వర్గాల ప్రజలను వివిధ ఆందోళనలలో సమీకరిస్తూ ఎత్తుగడలపరమైన ఐక్యవేదికలను నిర్మిస్తూ, బలోపేతం చేస్తూ వ్యూహాత్మక ఐక్యసంఘటన నిర్మాణానికి పునాదులు వేయాలి. వ్యూహాత్మక ఐక్యసంఘటనా రూపం అయిన విప్లవ ప్రజా కమిటీ (ఆర్‌పిసి)లను గ్రామస్థాయి నుంచి నిర్మించి బలోపేతం చేయాలి. ఉన్నతస్థాయి ఆర్‌పిసి కమిటీలను నిర్మిస్తూ భారతదేశ వ్యాప్తంగా విప్లవ ప్రజా కమిటీలను పునాదిగా చేసుకొని వ్యూహాత్మక ఐక్యసంఘటనను నిర్మించే దిశగా ముందుకు సాగాలి.

కామ్రేడ్స్,

మన ప్రియతమ అమరవీరులు ఐక్యతా కాంగ్రెస్ నిర్ణయించిన కేంద్ర కర్తవ్యం పరిపూర్తి చేయడానికి తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ఆ బాధ్యతను మనపై ఉంచి వెళ్లారు. గొప్ప త్యాగాలు లేకుండా ప్రపంచంలో ఏ విప్లవమూ విజయం సాధించలేదు. అమరుల త్యాగాలు వృధా కావు. ఇది విప్లవాల యుగం. నేడు విప్లవం పెద్ద విజయాలు సాధించడానికి మనల్ని మరిన్ని త్యాగాలకు సిద్ధం కమ్మంటోంది. అందుకు అమరవీరులు మనల్ని పురికొల్పుతున్నారు. పోరాడ సాహసిస్తే ప్రజలు అజేయులని చరిత్ర చాటి చెబుతుంది. అత్యద్భుతంగా ఉన్న విప్లవ పరిస్థితులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ, అమరుల రక్తంతో ఎరుపెక్కిన అంతర్జాతీయ కార్మికవర్గ జెండాను చేబూని ప్రజాయుద్ధ బాటలో దృఢసంకల్పంతో పురోగమిద్దాం!

కామ్రేడ్స్,

అమరవీరుల సంస్మరణ వారాన్ని విప్లవ స్ఫూర్తి ఉట్టిపడేలా దేశవ్యాప్తంగా ఊరూరా ఘనంగా జరపండి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను భూస్థాపితం చేసే రాజకీయ కర్తవ్యాన్ని చేబూని, మన అమరవీరుల అంకిత భావన, ధైర్యసాహసాలు, సృజనాత్మకత, కమ్యూనిస్టు విలువలు, త్యాగనిరతిని ఎత్తిపడుతూ అడుగడుగునా శత్రువును ఎదుర్కొనండి. ఆదర్శవంతమైన అమరవీరుల జీవిత చరిత్రలను ప్రచురించండి. ఊరూరా అమరుల స్థూపాలను నిర్మించండి. కరపత్రాలు పంచడం, వాల్‌పోస్టర్లు వేయడం, వాల్ రైటింగ్, బ్యానర్లు కట్టడం తదితర రూపాల్లో సృజనాత్మకంగా అమరుల త్యాగాల గురించి విస్తృతంగా ప్రచారం చేయండి. వారి ఆదర్శాలను ఎలుగెత్తి చాటేలా సభలు – సమావేశాలు నిర్వహించండి. పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా నిర్మాణాలు, విప్లవ ప్రజల్లో ఉత్తేజాన్ని నింపేలా అమరవీరుల సంస్మరణ వారాన్ని విజయవంతం చేయండి. ఈ సంవత్సరం అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా, వారి ఆశయ సాధనకు నేటి నిర్తివిఆర్‌పి, విఓడ్యూల అవినీతిని నిలదీసిన ప్రజలు

ఈస్టు డివిజన్ విశాఖ జిల్లా పరిధిలో కోరుకొండ ఏరియా పెద బయలు మండలం, ఇంజెరి పంచాయితీలో 500 మంది ప్రజలు 1-7-2011లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవినీతి కోసం విఆర్‌పిలను నిలదీసారు.

ఈ సంవత్సరం తీవ్రమైన వర్షాల కారణంగా ప్రజలు చేతికి వచ్చిన పంట కోల్పోయి చేసిన అప్పులు తీర్చ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సమయంలో జాతీయ గ్రామీణ ఉపాధీ హామి పథకం ద్వారా పనులు చేసారు. ఈ పనులతో వచ్చిన డబ్బుతో నైనా ఒక కేజి బియ్యం తెచ్చి గంజి కాచుకుందామనే ఆశతో ప్రజలు తిండి లేకపోయినా పస్తులతో కష్టపడీ పనులు చేసారు. పొలంగట్లు వేయటం, చెరువులు తవ్వటం, నీరు ఇంకుడు కాలువలు తియ్యటం వంటి పనులు రెండు, మూడు నెలల వరకు చేసినారు. ఈ పనుల్లో వచ్చిన డబ్బును విఆర్‌పిలు సరిగా ఇవ్వకుండా దాదాపు 5 లక్షలు కాజేసినారు.

ఈ దోపిడీని చూసి ప్రజలు సహించలేక పాకేట్ ఏఆర్‌సిఎస్ కమిటీ దృష్టికి తీసుకొచ్చినారు. ఈ కమిటీ నాయకత్వం కింద ప్రజలు సంఘటితంగా అవినీతిని వ్యతిరేకిస్తూ నిలదీసారు. ప్రజలు శ్రమ చేసిన డబ్బు చెల్లించకపోతే మీ ఆస్థులన్నీ ప్రజల పరం చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆగ్రహానికి భయపడి రెండు విడుతలుగా ఇస్తామని హామి పత్రం రాసి ఇచ్చారు.

ఈ సందర్భంగానే జెమిని సంస్థ పేరు చెప్పి ప్రజల దగ్గర 2,60,000 రూపాయలు మల్లేష్, రంగారావులు వసూలు చేశారనే

సమస్య ముందుకు వచ్చింది. 5–7–2011న 600 మంది ప్రజల ముందు నిలదీసారు.

జెమినికి డబ్బుకడితే వారం రోజుఉ లోపే వడ్డీతో సహా డబ్బులు తిరిగి వస్తాయనే ప్రచారాన్ని నమ్మిన ప్రజలు కోళ్ళు, మేకలు, అమ్మి, అవి లేని వాళ్ళు అప్పు తీసుకొని జెమిని సంస్థకు కట్టినారు. సంవత్సరాలు దాటి పోతున్న ప్రజల డబ్బును తిరిగి ఇవ్వటం లేదు. అడిగితే దాటవేస్తూ తప్పించుకుంటు తిరుగుతున్న మల్లేష్, రంగారావులను ఏఆర్‌సిఎస్ నాయకత్వం కింద ప్రజలు సంఘటితమై నిలదీసారు. ప్రజలు ఆగ్రహానికి తలవంచక తప్పని పరిస్థితుల్లో మూడు విడతలుగా చెల్లిస్తామని రాతపూర్వకంగా హామి పత్రం రాసి ఇచ్చారు. సంఘ నిర్మాణం ద్వారానే తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోగలమనే నమ్మకం ఈ పోరాటాల ద్వారా ప్రజల్లో కలిగింది.నిర్దిష్ట పరిస్థితుల్లో ఈ కింది కర్తవ్యాలను నెరవేర్చడానికి మన సిసి యావత్తు పార్టీకీ, పిఎల్‌జిఏకూ, ప్రజా నిర్మాణాలకూ, ప్రజలకూ పిలుపు నిస్తోంది.

★విప్లవోద్యమానికి ప్రజాపునాది లేకుండా చేసి నిర్మూలించాలనే శత్రు ఎల్ఐసి మోసపు యుద్ధాన్ని ప్రజల్లో బహిర్గతం చేసి విశాల ప్రజల్ని కూడగడ్తూ ప్రజాపునాదిని బలోపేతం చేయండి!

★నేలకొరిగిన వీరుల స్థానాల భర్తీకి, పెద్దయెత్తున నూతన వారసులను తయారు చేయడానికి, పిఎల్‌జిఏను పిఎల్ఏగా అభివృద్ధి చేసే లక్ష్యంతో పార్టీని, పిఎల్‌జిఏను సైద్ధాంతికంగా, రాజకీయంగా, సైనికంగా సంఘటితపరచండి. కార్మికవర్గేతర ధోరణులను వదిలించుకోవడానికి మావోయిస్టు గతిశీల (డైనమిక్) తత్వాన్ని అభివృద్ధి చేయండి. కార్మికవర్గ క్రమశిక్షణతో, రహస్య పని విధానాన్ని అమలు చేస్తూ అనవసర నష్టాలను నివారించండి! త్యాగాలకు వెరవకండి!

★ఆపరేషన్ గ్రీన్ హంట్‌ని ఓడించడానికి ముకరం – తాడిమెట్ల, కొంగెర, మమాయిల్, సిల్గా, బైఫరిగూడా (మంత్రియాంబ), లఖీసరాయ్ – కజరా, సరండా కౌంటర్ ఆపరేషన్, లొహర్‌దగ్గ –ధర్‌ధరియా, అమమోరా, గాటం, బోర్‌గూడా వంటి ఎత్తుగడల ఎదురుదాడులను ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున సాగించండి!

★ప్రజలు ఆకాంక్షల మేరకు అనన్య త్యాగాలు చేస్తూ మావోయిస్టు ప్రజాయుద్ధాన్ని విశాల ప్రాంతాలకు విస్తరింపజెయ్యండి!

★సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల దోపిడీ పీడనలను తుడిచిపెట్టడం కోసం లాల్‌గఢ్, నారాయణపట్నా, కళింగనగర్, నియమగిరి, సోంపేట, పోస్కో వ్యతిరేక గోవిందపూర్ – ధింకియా వంటి ప్రజా ప్రభంజనాలను సృష్టించండి. రాజ్యాధికార లక్ష్యంతో వాటిని పురోగమింపజేయండి!

విప్లవాభినందనలతో,

కేంద్రకమిటీ,

సి.పి.ఐ.(మావోయిస్టు)

---


**గతంలో ఈ కామ్రేడ్స్ ఫోటోలు లభ్యం కానందున అమరుల జీవిత చరిత్రలలో ప్రచురితం కాలేదు.**



కామ్రేడ్ సందీప్

**కామ్రేడ్ పోడియం సుక్డా (సందీప్) సి.ఆర్.సి 3వ కంపెనీ సభ్యుడు. 2010 డిసెంబర్ 24న అమిలియాంబ ఆంబుష్‌లో అమరుడు.**

**కామ్రేడ్ పాంగి బంగారి (శాంతి) సి.ఆర్.సి. 1కంపెనీ సభ్యురాలు. 2010లో చెరువూరు కౌంటర్ ఆంబుష్‌లో అమరురాలు.**



కామ్రేడ్ శాంతి

# అమర వీరుల జీవిత చరిత్రలు

## చివరిశ్వాస వరకు ప్రజలనంటి పెట్టుకున్న కామ్రేడ్ పెందూర్ దేవ్‌రావు (సెక్‌రావు) (75 సం॥)

కామ్రేడ్ దేవ్‌రావు 1936లో అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో పుట్టి, బ్రతుకుదెరువుకు ఇచ్చోడ మండలం, సిరిచెల్మ పంచాయితీ ఫకీర్‌పేట–నారాయణ్‌పూర్‌కు కుటుంబంతో వలస వచ్చి స్థిరపడ్డాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, కుటుంబ బరువు బాధ్యతలు మోశాడు.

38 సం॥ల వయసులో 1974లో కరీంనగర్ – ఆదిలాబాద్ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో ప్రభావితుడై విప్లవోద్యమంతో కదం కలిపాడు. 1980లో పార్టీ ఆర్గనైజర్‌కు గైడ్‌గా వుండి బాటలు చూపి గ్రామాలు పరిచయం చేయించాడు. ఇంద్రవెల్లి మహాసభకు తరలి వచ్చిన ఆదివాసులపై కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన మారణకాండలో శతృవుపై రాళ్ళతో సాహసంగా పోరాడి తప్పించుకున్నాడు. పోలీసు కాల్పుల్లో గాయపడిన వారిని తప్పించాడు. 1981లో జరిగిన ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభకు విస్తృతంగా క్యాంపెయిన్ చేసి వందలాది ప్రజలను కదిలించాడు. 1982 వరకు డి.ఎ.కె.ఎం.ఎస్ ఏరియా అధ్యక్షుడిగా పనిచేశాడు. 1983లో పెరిగిన తీవ్ర నిర్బంధంలో ఆర్గనైజర్‌లను కంటికి రెప్పలా కాపాడాడు. 1984–85 నిర్బంధంలో భార్యా పిల్లలను వదలి కొంతకాలం దళంతో తిరిగాడు. 1986లో డివిజన్ రైతుకూలీ సంఘం సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించాడు. ప్రభుత్వం అమలుచేస్తున్న నిర్బంధంలో కూడా నిబ్బరంగా నిలబడి శతృవు స్థూపాలు కూల్చివేస్తూ, పన్నుతున్న కుట్రలను ప్రచారంతో ఎండగట్టాడు.

1990 వెసులుబాటు కాలంలో ఇంద్రవెల్లి అమరుల స్థూప పునర్నిర్మాణం, రెండవ రైతుకూలీ మహాసభకు వేలాదిమంది ప్రజలను కదిలించి విజయవంతం చేశాడు. సభకు అధ్యక్షత వహించాడు. 1991–92లో వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా, ప్రజలు అడవి నరికి సాగుచేసిన భూములకు పట్టాలు ఇవ్వాలని, అడవిపై హక్కు ఆదివాసులదేనని రైతుకూలీ సంఘం నాయకత్వంలో అనేక పోరాటాలు నిర్వహించి ప్రజల విశ్వాసం చూరగొన్నాడు. 1992 నిర్బంధంలో అనేక సంఘాలు దెబ్బతినగా మిగిలిన వాటిని పటిష్టపరుస్తూ, పార్టీ నిర్మాణాలను కాపాడాడు. ఈ క్రమంలో అరెస్టయి పోలీసు కస్టడీలో తీవ్ర చిత్రహింసలను భరించి కూడా పార్టీ రహస్యాలను కాపాడాడు. బయటికి వచ్చిన తర్వాత మళ్ళీ పార్టీ పని ప్రారంభించాడు. శత్రు నిర్బంధానికి సంఘనాయకులు, దళ కమాండర్ స్థాయి వాళ్ళు దిగజారిపోతున్నా గుండె చెదరక తను దృఢంగా నిలిచి, ప్రజలను నిలబెట్టాడు. 1993–94లో రైతుకూలీ సంఘ నాయకత్వాన వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా, భూస్వాముల భూములు, రిజర్వ్ ఫారెస్ట్ భూముల ఆక్రమణ, ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, ఆదివాసుల హక్కుల పోరాటాల్లో, కరువు దాడుల్లో ప్రజలను విస్తృతంగా కదిలించాడు.

పార్టీ క్యాంపులు, సమావేశాలకు సంఘనాయకత్వాన ప్రజలతో ఎంతో సహాయ సహకారాలు అందించడంలో కృషిచేశాడు. శత్రు సమాచారం సేకరించడం, పార్టీ సమన్వయ కార్యకలాపాల్లో నాయకత్వానికి సహాయపడటంలో బాధ్యతాయుతంగా శక్తిమేరకు పని చేశాడు. ఏరియాలోని కలప స్మగ్లర్ల ఆటకట్టించి, ఇన్‌ఫార్మర్లను శిక్షించడంలో ముందున్నాడు. 1997–98లో ఏర్పడిన గ్రామరాజ్య కమిటీలోకి ఎన్నికై అనేక శాఖలను గైడ్ చేశాడు. తన సహచరిని కూడా గ్రామరాజ్య కమిటీ మెంబర్ స్థాయికి ఎదిగించాడు. జి.ఆర్.సి నిర్ణయంలో భాగంగా అనేక ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తనవంతు కృషి చేశాడు. జి.ఆర్.సి ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి కాల్పుల్లో గాయపడ్డ ఇస్రుబాయితో కొత్త భూములకు పట్టాలు పంపిణీ చేయించాడు. పార్టీకి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించే విధంగా ఫకీర్‌పేట–నారాయణపూర్ గ్రామాన్ని తీర్చిదిద్దాడు. తన సహచరి సహకారంతో పార్టీని నిరంతరం కంటికి రెప్పలా కాపాడాడు. ఎన్.టిలో పార్టీలో వెనుకపట్టు స్థితిలో వున్నప్పటికీ పార్టీ కలయిక కోసం ఎదురుతెన్నులు చూసి, ఎప్పటికీ పార్టీని అంటి పెట్టుకొని వుండే విధంగా తన కుటుంబాన్ని నిలబెట్టాడు. 75 సం॥ల వయోభారంతో, అనారోగ్యానికి గురై 2008లో అసువులు బాశాడు. తన చివరిశ్వాస వరకు పార్టీ కొరకు పరితపించిన ప్రజల మనిషి కామ్రేడ్ దేవ్‌రావు(సెక్‌రావు). ఆయన ఆశయసాధనకు అంకితమవడమే ఆయనకు మనమందించే నిజమైన నివాళి.

**శ్రామికవర్గం బూర్జువావర్గంతో రాజీపడి సోషలిజం సాధించలేదు. నిక్కచ్చిగా పోరాట పంథా అవలంబించాలి. ఈ పోరాటం ఖాయంగా వర్గపోరాటంగానే వుండాలి. మొత్తం బూర్జువావర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం అంతా ఈ పోరాటం జరపాలి. బూర్జువావర్గం, పెట్టుబడిదారీ విధానమా? లేక శ్రామికవర్గ సోషలిజమా? అటో యిటో తేలాలి. శ్రామికవర్గ కార్యకలాపాలకు, వర్గపోరాటానికి పునాది యిదే. -స్టాలిన్.**

# సుడులు తిరుగుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభం

2008లో అమెరికాలో సంభవించిన వసూలు కాని ఇళ్ళ రుణాల సంక్షోభం (సబ్‌ప్రైమ్ సంక్షోభం) ఆర్థిక సంక్షోభంగా మారి యూరప్, జపాన్‌లతో పాటు మొత్తం ప్రపంచానికి విస్తరించి నేటికీ అది సామ్రాజ్యవాద దేశాలను అతలాకుతలం చేస్తున్నది. ఈ నేపథ్యంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ చట్టబద్ధమైన రుణపరిమితిని దాటి, దివాళా అంచులకు చేరడం ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన రేపింది. సంక్షోభం అమెరికాదే అయినప్పటికీ పర్యవసనాలు అనుభవించేది ప్రపంచ దేశాలే అన్న విషయం అందరికీ తెలుసు. అందుకే అమెరికా సంక్షోభంపై ఇంత కలవరం. అయితే అక్కడి ప్రధాన పాలకవర్గ పార్టీలైన డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు రెండూ పోటీపడి తమ దేశ ఆర్థిక సంక్షోభాన్ని రచ్చకీడ్చాయి. కాని, ప్రపంచాన్ని ఊబిలోకి నెట్టి అయినా అమెరికా బయట పడుతుందని తెలిసిన వారికి, ఆఖరు క్షణంలోనైనా సంక్షోభ పరిష్కారానికి ఆ దేశ పాలక వర్గాలు ఏకతాటిపైకి వస్తారని తెలుసు. తాము విధించుకున్న రుణపరిమితి పెంపు విషయంలో ఎట్టకేలకు పాలకవర్గాల మధ్య షరతులతో కూడిన రాజీ జరిగింది. ఈ విధంగా రుణపరిమితి పెంచుకోవటం ఇది 141వ సారి. సంక్షేమ పథకాలపై కోత పెట్టడానికి డెమోక్రాట్లు ఆమోదించగా, భారీ రుణసేకరణకు అంతకు ముందు వ్యతిరేకించిన రిపబ్లికన్లు చివరికి సమ్మతించారు. ఈ ఒప్పందం ద్వారా 14.3 లక్షల కోట్ల డాలర్ల రుణభారంతో ఇప్పటికే ప్రపంచంలో అతి పెద్ద రుణగ్రస్త దేశంగా ఉన్న అమెరికా 2013 వరకు 2.1 లక్షల కోట్ల డాలర్లు అప్పు తెచ్చుకునే వీలు కలిగింది. దీనితో పాటు వచ్చే పదేళ్ళలో ప్రభుత్వ వ్యయాన్ని 2.5 లక్షల కోట్ల డాలర్ల మేర తగ్గించుకోవాలి. దీనితో ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న చెల్లింపుల సమస్య నుండి అమెరికా తాత్కాలికంగా బయటపడింది. అయితే ఈ కథ ఇక్కడితోనే ముగిసినట్టా? అమెరికా సంక్షోభం నుంచి బయటపడినట్టా... సంక్షోభం వైపు అడుగులు వేస్తున్నట్టా...? ఈ ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.

సంక్షోభం నుంచి అమెరికా బయటపడినట్లు కాదు. ఎందుకంటే సామ్రాజ్య విస్తరణ కాంక్షతో జరిపిన దారుణ యుద్ధాల వల్ల చిన్నాభిన్నమైన అమెరికా ఆర్థిక వ్యవస్థ, దానితో ముడిపడివున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే సంక్షోభంలోకి నెట్టి 1930ల నాటి స్థితి వైపుకు ప్రపంచాన్ని నెట్టింది. దీని గురించి పదేళ్ళ క్రితమే ఆర్థిక వేత్తలు ఇలా వర్ణించారు. "రానున్న రోజుల్లో అమెరికాపై ఆధారపడి నడుస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థలు సంక్షోభ కాలంలో ముందు కుప్పకూలుతాయి. ఆ తరువాత సంక్షోభ కేంద్రమైన అమెరికానే కుప్పకూలిపోతుంది" అని. అంటే తాను మునగడంతో పాటు ఇతర దేశాలను కూడా పతనం వైపుకు అమెరికా గుంజేస్తుందన్నమాట! ఆర్థికవేత్తల అంచనా ఎంత దూరదృష్టి కలదో అమెరికా ఖజా నా వ్యవస్థ (ఫెడరల్ రిజర్వు) అధినేతగా వున్న బెన్ ఎస్ బెర్నాంకే హెచ్చరిక వెల్లడిస్తుంది. బెర్నాంకే ఇలా హెచ్చరించాడు. "అమెరికా భారీ ఎత్తున రుణసేకరణ చేయలేకపోతే బయట చేయవలసిన చెల్లింపులు ఆలస్యమవుతాయి. దీనివల్ల మొత్తం ప్రపంచ ద్రవ్య మార్కెట్లో, చెల్లింపుల వ్యవస్థలో తీవ్ర ఒడిదుడుకులు వస్తాయి. అమెరికా పరపతి గంగలో కలుస్తుంది. డాలర్ విలువ పడిపోతుంది. అప్పులు పుట్టవు. తెచ్చిన రుణాలపై వడ్డీలు పెరిగి లోటు సమస్య వ్యవస్థను చుట్టుముడుతుంది". అయితే ఇప్పుడు క్రెడిట్ రేటింగ్ సంస్థలు అమెరికా రేటింగ్‌ను అత్యుత్తమ రేటింగ్ అయిన 'ఏఏఏ' నుంచి ఏఏ+ కు కుదించాయి. అమెరికా చరిత్రలో దాదాపు శతాబ్దకాలంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. రేటింగ్ తగ్గడం అంటే రుణాలు తిరిగి చెల్లించే సామర్థ్యం తగ్గిందన్నమాట. ఇది తప్పుడు లెక్కలమీద ఆధారపడిన రేటింగ్ అంటూ ఒబామా ఆక్రోశం వెళ్ళగక్కాడు. ఒకసారి రేటింగ్ తగ్గిన దేశాలు ఇంకా తక్కువ స్థాయి రేటింగ్‌లకు దిగజారే అవకాశాలే ఎక్కువ. గ్రీస్ రేటింగ్ ఇలాగే తగ్గుతూ ఇప్పుడు దివాళా స్థాయికి దిగజారింది. ఆ విధంగా యూరప్‌లో అనేక దేశాలు దివాళా వైపు పయనిస్తున్నాయి. పెరిగిపోతున్న వ్యయాన్ని తగ్గించుకోకపోతే అమెరికాకూ ఆ పరిస్థితి తప్పదు. ఇకిప్పుడు క్రెడిట్ రేటింగ్ దిగజారుతున్న అమెరికాకు అప్పులు ఎగ్గొట్టదనే ధైర్యంతో అప్పులు ఇచ్చేందుకు ఏ దేశం సిద్ధంగా వుంటుందన్నది జవాబులేని ప్రశ్న. అప్పుల మీద బ్రతుకు వెళ్ళదీస్తున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ అవి పుట్టనినాడు కుప్పకూలిపోక తప్పదు. కనుక పాలకవర్గాల మధ్య సంక్షోభానికి తాత్కాలిక పరిష్కార ఒప్పందం కుదిరినప్పటికీ సంక్షోభ దశను అమెరికా శాశ్వతంగా అధిగమించే అవకాశం లేదని స్పష్టమవుతోంది.

1930లలో సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి కారణం కాగా, తిరిగి 80 ఏళ్ళ తరువాత అదే వ్యవస్థ మరొక ప్రపంచవ్యాప్త సంక్షోభానికి తెరతీసింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1970ల నుండి సామ్రాజ్యవాదం సాధారణ సంక్షోభంలోనే వుంది. మాంద్యం–నిరుద్యోగం–ద్రవ్యోల్బణం కొన్ని సమయాల్లో కొద్ది మేరకు తగ్గినప్పటికీ మొత్తంగా చూస్తే అవి

పెరుగుతూనే వున్నాయి. నేడు ప్రపంచంలో అత్యంత రుణగ్రస్త దేశమేదైనా వుందంటే అది అమెరికాయే! ఈ స్థితికి కారణమైన నేపథ్యాన్ని పరిశీలించుదాం.

రెండువందల ఏళ్ళుగా ప్రపంచంలోని అతి ప్రధాన ఆర్థికశక్తుల్లో ఒకటిగా అమెరికా వుంటూ వస్తున్నది. 80వ దశకం తరువాత అమెరికా ఆర్థిక రంగంలో కూడా మితిమీరిన ఉదారవాద విధానాలు, సరళీకృత విధానాల అమలు మొదలైంది. వీటి ఫలితమే స్కామ్‌లు, సబ్‌ప్రైమ్ సంక్షోభాల రూపంలో బయటకొచ్చింది. మరోవైపు 60-70 దేశాలలో సైనిక, నావిక స్థావరాలు నెలకొల్పుకొని, ప్రపంచ పెట్టుబడి వ్యవస్థకు కాపలాదారుగా అమెరికా వ్యవహరించటం వల్ల ఆ స్థావరాలను, ఆ వ్యవస్థను రక్షించుకోవడానికి ఎక్కడి డబ్బూ చాలడంలేదు. అంతర్జాతీయ వనరులపై పట్టుకోసం అమెరికా దశాబ్దాలుగా సాగిస్తున్న యుద్ధాలకు లక్షల కోట్ల డాలర్లను వెచ్చించారు. దీనివల్ల చరిత్రలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో రుణాల ఊబిలో అమెరికా కూరుకుపోయింది.

ప్రతి అమెరికా అధ్యక్షుని హయాంలోనూ ఈ రుణభారం పెరుగుతూనే వచ్చింది. వచ్చి వచ్చి జార్జి బుష్ పాలనలో మరింతగా తడిసి మోపెడై భారీ పర్వత ప్రమాణంలో పెరిగిపోయింది. విచిత్రమేమంటే, ఒకవైపున రుణభారం పెరిగినప్పుడు సంపన్న వర్గాలపై పన్నులు పెంచటం కాకుండా తగ్గించి, పేద మధ్య తరగతి ప్రజాబాహుళ్యంపైన పెంచేశాడు. పైగా అదే సమయంలో రెండు దారుణ మారణ యుద్ధాల్లోకి అమెరికాను దించేశాడు. రుణభారంతో పాటు వడ్డీలు ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచేశాయి. ఒక్క 2003లోనే అమెరికా నిర్వహించిన యుద్ధాలకు గాను ప్రజలు చెల్లించిన వడ్డీ ఖర్చులే 150 బిలియన్ డాలర్లు. అమెరికా రుణ భారం అనేది ఆర్థిక సంక్షోభంలోని ఒక పార్శ్వమే. అసలైన సంక్షోభ ప్రభావం ప్రజా జీవితాలపై ఘోరమైన ఫలితాలను చూపిస్తున్నది.

రుణభారంతో నేడు అమెరికాలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం కూడా ఎన్నడూ లేనంత స్థాయిలో రెండంకెల మీద (10-11శాతం) స్వారీ చేస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం అమెరికాలో 92 లక్షల మంది పౌరులు నిరుద్యోగులుగా వున్నారు. గతంలో వీరికి నిరుద్యోగ భృతి అందేది. ఇప్పుడు అదికూడా లేదు. అర్హతలున్న అభ్యర్థులకే ఉద్యోగం సంపాదించడానికి 9 నెలలు వేచి వుండాల్సివస్తున్నది. ఇక సంక్షేమ పథకాల్లో కోతల వల్ల ఇప్పటికే 5కోట్ల మేర వున్న పేదల సంఖ్య మరింత పెరుగుతుంది. ఇక దివాళా తీశామంటూ లక్షలాది మంది గృహరుణాలు ఎగ్గొడుతున్నారు. గృహరుణాలు తీసుకునేవారు కరువయ్యారు. 2008తో పోలిస్తే దివాళా తీసిన వారి సంఖ్య 2009లో 32 శాతం. 2010 నాటికి 35 శాతానికి చేరుకుంది. ఇది ఇంకా పెరిగే అవకాశముందని నిపుణులు అంటున్నారు. 2007 నుంచి ఎన్ని రకాలుగా 'ఉద్దీపన' పథకాల ద్వారా దివాళా స్థితి నుంచి కార్పోరేట్ సంస్థలను బయటపడవేద్దామని ప్రయత్నించినా పాలకులు విఫలమయ్యారు. ఒకవైపు అమెరికా కంపెనీలు మూతపడుతుంటే , దీనినుంచి చైనా వ్యాపారులు లాభపడుతున్నారు. గతంతో పోలిస్తే వారి వ్యాపారం పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. ఇక అమెరికా ఇప్పటిదాకా ప్రపంచంలో ప్రథమ ఆర్థికశక్తిగా తనకున్న స్థానాన్ని కోల్పోయే స్థితికి చేరి, 2015 నాటికి చైనా ప్రపంచ ప్రథమ ఆర్థికశక్తిగా ముందుకు రానుండడం, అమెరికా క్రెడిట్ రేటింగ్ పడిపోనుండడంతో బరాక్ ఒబామా తన ఆక్రోశం వెళ్ళగక్కుతున్నాడు. అయితే చైనా బాధ మరో రకంగా వుంది. అమెరికా క్రెడిట్ రేటింగ్ తగ్గింపు వల్ల చైనాకే ఎక్కువ ఇబ్బంది అని, అమెరికాకు అధికంగా అప్పులు ఇచ్చింది, ఎక్కువగా ఎగుమతులు చేస్తున్నది చైనా, జపాన్‌లేనని నిపుణులు అంటున్నారు. కనుక అమెరికా సంక్షోభం ఊబిలో కూరుకుపోతే ఆ ప్రభావం వీటికీ తప్పదు.

ప్రపంచంలో ఒకటవ స్థానంలో వున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్ళడంతో దానిపై ఆధారపడిన యూరప్ దేశాలు, వాటి ఆర్థిక వ్యవస్థలు ఒక్కొక్కటిగా సంక్షోభ జ్వాలల్లో చిక్కుపడిపోయాయి. అందుకు మొదట బలైంది గ్రీస్ కాగా, వరుసగా ఆస్ట్రియా, కెనడా, డెన్మార్క్, బ్రిటన్, జర్మనీ, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, హాంకాంగ్, లగ్జెంబర్గ్, నెదర్లాండ్, నార్వే, స్వీడన్, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతినిపోతున్నాయి. 1997 నాటి ఆసియాలో వచ్చిన సంక్షోభం గుర్తున్న వారికి డాలర్ కరెన్సీతో ముడిపడివున్న ఆసియా, ఆగ్నేయాసియా దేశాలను కూడ అమెరికా సంక్షోభం చుట్టబెట్టే దశలో వుందనేది అర్థం అవుతుంది. అమెరికాతో మితిమీరిన సంబంధాల వల్ల భారత్ వంటి వర్ధమాన దేశాలు ఆర్థికంగానూ, రాజకీయంగానూ తీవ్రమైన ఒడిదుడుకులకు గురి కాక తప్పదు.

అమెరికాలో సంక్షోభ ప్రభావంతో దారిద్రానికి గురైన ప్రజల ఆకలి, ఆక్రందనలతో, నిరసన జ్వాలలతో న్యూయార్క్ నగరం దద్దరిల్లింది. 2011 సెప్టెంబర్ 17న అమెరికాలో న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య మార్కెట్ (స్టాక్ మార్కెట్ – ఎం.ఎన్.సిలు)కేంద్రస్థానం వాల్ స్ట్రీట్‌ను ఒక వేయి మంది దిగ్బంధించడంతో ఆరంభమైన 'వాల్‌స్ట్రీట్ ఆక్రమిద్దాం' నినాదం ఒక నెల రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తమయింది. ప్రజల నిరసనలతో మహానగరాలన్ని హోరెత్తాయి. అమెరికాలోని పలు నగరాలలో నిరసనలు వెల్లువెత్తాయి. అత్యంత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశమైన అమెరికాలోని వాల్‌స్ట్రీట్‌ను ప్రజలు ముట్టడించారు. కార్పోరేట్ మీడియా వాల్‌స్ట్రీట్‌లోనూ, ఇతర అమెరికా నగరాలలోనూ

జరుగుతున్న సామాన్యుల నిరసన ప్రదర్శనలను 'కమ్యూనిస్టుల కుట్ర' అని ప్రచారం చేస్తోంది. జనసామాన్యంలోని అత్యధికులు కమ్యూనిస్టులు కారన్నది పత్రికలకు తెలుసు. అయినా అవి అసత్య ప్రచారాలు మానుకోవు.

పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛంద సంస్థ యాడ్‌బస్టర్స్ మీడియా ఫౌండేషన్ వినియోగ సంస్కృతికి వ్యతిరేకంగా పనిచేస్తున్నది. ఈ సంస్థ వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండని జులైలో ఇంటర్నెట్‌లో పిలుపునిచ్చింది. ఈ పిలుపు నందుకొని సెప్టెంబర్ 17 నుంచి ప్రపంచవ్యాప్తంగా పదులు, వందలు, వేల సంఖ్యలో నిరసన కారులు వీధుల్లోకి వచ్చారు. అమెరికాలోని వాల్‌స్ట్రీట్‌ను ముట్టడించిన నిరసనకారులు ప్రభుత్వంపై కార్పోరేట్, లాబీయిస్టుల ప్రమేయం ఉండకూడదంటూ నినదించారు. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక, సామాజిక అంతరాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. కార్పోరేట్ సంస్థల దురాశను దుయ్యబట్టారు. అక్టోబర్ 9 నాటికి ఒక్క అమెరికాలోనే ఆ నిరసనజ్వాల 70 ప్రధాన నగరాలకు, 600 కమ్యూనిటీలకు చేరింది. ఆ తర్వాత అమెరికా, యూరప్, ఆసియాలోని 80 దేశాల్లో అక్టోబర్ 15న తీవ్రంగా ఆందోళనలు సాగాయి. ఆర్థిక కేంద్రాలను ఆక్రమించి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. లండన్, కెనడా, రోమ్, బ్రస్సెల్స్, ఫ్రాంక్‌ఫర్ట్, సిడ్నీ, టోక్యో, బెర్లిన్, మాడ్రిడ్, లిస్బన్, హాంకాంగ్, టొరంటో సహా 951 నగరాల్లో నిరసన ప్రదర్శనలు, నినాదాలతో హోరెత్తాయి. అక్టోబర్ 17న అమెరికాలో వాల్‌స్ట్రీట్ భరో ఉద్యమం నిర్వహించారు. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఉద్యమానికి సల్మాన్ రష్దీ, నీల్ గైమన్, జెన్నిఫర్ ఈగన్, మైఖేల్ కన్నింగ్‌హామ్ తదితర వందకు పైగా రచయితలు మద్దతు తెలిపారు. ఈ ఉద్యమం కార్పోరేట్ గుండెల్లో గుబులు పుట్టించింది. అయితే ఈ ఉద్యమానికి నిర్మాణం లేదు. స్థిరమైన నాయకత్వం లేదు. ఓ ప్రత్యేకమైన డిమాండ్, లక్ష్యమంటూ లేదు. తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, పోలీసులు అడ్డుకున్నా ఉద్యమం ఆగదని ఉద్యమకారులు స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి అమెరికాలో 40 నుండి 57 శాతం మంది మద్దతు పలుకుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. విచిత్రమేమంటే ఈ ఉద్యమానికి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం సంఘీభావం తెలపాల్సి వచ్చింది. నెలల వ్యవధిలోనే ప్రపంచంలోని వెయ్యి నగరాలకు వ్యాపించిన ఈ ఉద్యమం ధాటికి ప్రభుత్వాలు కూలుతాయా, లేదా అనేది అటుంచితే, పెట్టుబడిదారీ సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభాన్ని ఈ ఉద్యమాలు బయటపెట్టాయి.

## సంక్షోభపు మంటల్లో బ్రిటన్

అమెరికాను చుట్టిముట్టిన రుణసంక్షోభం ప్రకంపనల మధ్యనే లండన్ అగ్నిగుండం అయ్యింది. లండన్‌లోని ఒక ప్రాంతంలో శాంతి యుతంగా నిరసన ప్రదర్శన రూపంలో మొదలైన ఒక కార్యక్రమం చూస్తుండగానే హింసాత్మకంగా మారి, విధ్వంస రూపం దాల్చి ఇతర ప్రాంతాలకు దావానలంలా విస్తరించింది. రోజుల తరబడి బ్రిటన్‌లోని అనేక నగరాలను దహిస్తున్న ఆ నిరసన జ్వాలల్ని ఆర్పడానికి పోలీసులకు తలప్రాణం తోకలోకచ్చింది. లండన్ ఉత్తర భాగంలో ఆఫ్రో-కరీబియన్ జాతికి చెందిన నల్లవారు ఎక్కువగా నివసించే టాటెన్‌హామ్ అనే ప్రాంతంలో మార్క్ దుగ్గన్ అనే యువకుని పోలీసులు కాల్చి చంపడం హింసా విధ్వంస జ్వాలలకు ఆజ్యం పోసినట్లయింది.

వివరాలను పరిశీలిస్తే, సభ్యతా, మర్యాదల గురించి ఘనంగా చెప్పుకునే ఆంగ్లేయ జాతికి జాత్యహంకారం మాసిపోలేదు. నల్లవారిని, ఇతర జాతుల వారిని వెలివేసినట్లు నిర్దిష్ట ప్రాంతాలకు పరిమితం చేయడం, వారిపై నిరంతరం నిఘా వుంచడం, రోడ్డుమీద వెళుతున్నవారిని ఆపడం, సోదా చేయడం, వేధించడం జరుగుతున్నది. లండన్‌లోని ఈ వెలివాడలు శరణార్థి శిబిరాలను తలపించేవిగా వున్నాయి. మార్క్ దుగ్గన్ అనే యువకుని వద్ద మాదక ద్రవ్యాలు వున్నాయని అరెస్టు చేయబోగా, అతడు ప్రతిఘటించడంతో పోలీసులు కాల్చిచంపడం ఇటువంటి వేధింపుల పాశవిక పార్శ్వమే తప్ప మరొకటి కాదు. 1998 నుంచి ఇంత వరకు లండన్‌లో 333 లాకప్ మరణాలు జరిగాయి. ఒక్కరిపైనా చర్య తీసుకోలేదు.

లండన్ వెలివాడలలో యువత ఇలా ఆగ్రహంగా విరుచుకు పడటానికి దుగ్గన్ కాల్చివేత ప్రేరేపించి వుండవచ్చు కానీ, అదొక్కటే కారణం కాదు. దాని మూలాలు బ్రిటన్‌నే కాక, మొత్తంగా యూరప్‌ను అట్టుడికిస్తున్న ఆర్థిక సంక్షోభంలో వున్నాయి. గత 25 ఏళ్ళుగా బ్రిటన్ వృద్ధి స్థంభించిపోయింది. జనాభాలో 10 శాతం వున్న సంపన్నులు సుఖభోగాలు అనుభవిస్తుంటే, పేదలు మరింత అడుగంటిపోతున్నారు. సామాజికాభివృద్ధి బ్రిటన్‌లో వున్నంత దారుణంగా మరే అభివృద్ధి చెందిన దేశంలోనూ లేదని నిపుణులు అంటున్నారు. ఉన్నత పాఠశాల విద్యతోనే చదువు మానేసిన యువత మరే పాశ్చాత్య దేశంలో లేని స్థాయికి బ్రిటన్‌లో పెరిగిపోయింది. ఒక తరం మొత్తం ఇదే స్థితిలో వుంది. బ్రిటన్ యువతలో విద్య, ఉద్యోగం, ఉపాధి శిక్షణ లేనివారు ఏకంగా 17శాతం వున్నారు.

దీనికితోడు యూరప్ మొత్తం రుణ సంక్షోభపు ఊబిలో గొంతులోతు కూరుకు పోయింది. దీన్నుంచి బయటపడటానికి

బ్రిటన్‌లోని డేవిడ్ కెమెరూన్ సారధ్యంలోని మితవాద ఉదారవాద ప్రజాస్వామిక సంకీర్ణ ప్రభుత్వం సంక్షేమ వ్యయంపై భారీగా కోతపెట్టి అనేక పొదుపు చర్యలు ప్రారంభించింది. దాంతో ఆ దేశంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మూలనపడ్డాయి. ఉద్యోగాలు ఆవిరైనాయి. జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయి. గత కొద్ది నెలల కాలంలో విశ్వవిద్యాలయ ట్యూషన్ ఫీజును ప్రభుత్వం మూడురెట్లు పెంచింది. 16-18 ఏళ్ళ యువతకు ఉన్నత విద్యాభ్యాసం కోసం యిచ్చే "ఎడ్యుకేషన్ మెయిన్‌టెనెన్స్‌అలవెన్స్" ఆపివేసింది. బ్రిటన్‌లోకెల్లా అతి నిరుపేదలు టొటెన్‌హామ్‌లోనే నివసిస్తున్నారు. దేశమంతటికంటె ఇక్కడ నిరుద్యోగం ఎక్కువ(20శాతం). నిరుద్యోగ భృతి కోసం గతం కంటె అభ్యర్ధనలు పెరగగా, ప్రభుత్వం దీనికి కేటాయించిన బడ్జెట్‌లో 75శాతం కోత విధించింది. యువజన క్లబ్బులు మూతపడ్డాయి. ఈ సంక్షేమ వ్యయంపై కోతల వల్ల పేదవర్గాలకు, నిరుద్యోగులకు బ్రతుకు దుర్భరమైంది. దాంతో యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విద్యార్ధులు, కార్మికులతో సహా అన్ని వర్గాల వారు వీధులకెక్కి నిరసన ప్రదర్శనలు జరపడం దాదాపు నిత్యకృత్యమైంది. లండన్ నగరాన్ని అగ్ని గుండంగా మార్చిన ఇటీవలి హింస, విధ్వంసాలు ఇందులో భాగమే. వీటిని అణచివేయడానికి బ్రిటన్ ప్రధాన రాజకీయ పార్టీలతో సహా అక్కడి మీడియా కూడా ఇవి "నేర ప్రవృత్తిగల మూకల"(కాపీ క్యాట్ క్రిమినల్స్) లేక దోపిడి మూకల పనిగా దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రధాని డేవిడ్ కెమెరూన్ "థగ్గులను సహించేది లేదని, కఠినంగా అణచివేస్తామని ప్రకటించాడు. కాని, ప్రజలు లండన్ ఘటనలకు కారణమైన యువకులు నేరస్తులు కారని అంటున్నారు. బ్రిటన్ పాలకుల లోపభూయిష్ట ఆర్ధిక, సామాజిక విధానాలే ఇందుకు ప్రధాన కారణం.

ఆర్ధిక సంక్షోభంలో కూరుకున్న ఆస్ట్రేలియాలో నిరుద్యోగ యువత జాత్యంహకారాన్ని తలకెక్కించుకొని భారతీయులపై దాడులు, హత్యలు చేస్తే, నార్వేలో మైనారిటీ జాతి యువకులపై ఒక ఉన్మాది ఊచకోతకు పాల్పడ్డాడు. పాశ్చాత్య సమాజాలు ఇంతకాలం పేద దేశాల నుంచి లభించే చవక శ్రమపై ఆధారపడి సంపదలు పోగేసుకున్నాయి. జాతుల సహజీవనం, సామరస్యం, ప్రజాస్వామ్యం వంటి అందమైన మాటల ముసుగులో వలసలను ప్రోత్సహించాయి. ఇప్పుడు ఆర్ధిక సంక్షోభం తమ జీవన భద్రతను ప్రశ్నార్ధకం చేస్తే, తమ యువతనే నిరుద్యోగం పట్టి పీడిస్తుండటంతో ఒక్కసారిగా పాశ్చాత్యేతర జాతుల ఉనికి కంటగింపుగా మారిపోయింది. ప్రజాస్వామ్యం, జాతుల సహజీవనం వంటి ముసుగులు తొలగిపోయి స్వార్ధం, క్రౌర్యంతో కూడిన అసలు రూపం బయటపడుతున్నది. అది నాజీయిజాన్ని తలపించే జాతి వివక్ష విషాన్ని తలకెక్కించుకొంటున్నది. ఈ విషం తలకెక్కించుకున్న ఆండర్స్ బెహ్రింగ్ బ్రెవిక్ అనే ఒక ఉన్మాది నార్వే రాజధాని ఓస్లోలో 92 మందిని కాల్పులు జరిపి హతమార్చాడు. ఆర్ధిక సంక్షోభం నేపధ్యంలో పాశ్చాత్య ముఖచిత్రంలో రంగులు మారటం స్పష్టంగానే కనిపిస్తున్నది. ప్రపంచాన్ని కొల్లగొట్టి సామ్రాజ్యవాదులు పోగేసిన సంపదలు కరిగిపోతుంటే దారిద్ర్యం బారిన పడుతున్న అక్కడి ప్రజల అసంతృప్తి జ్వాలలు తమను దహించకుండా పక్కదారి పట్టించడానికి సామ్రాజ్యవాదులు జాత్యహంకారాన్ని రెచ్చగొట్టే అవకాశాలు ఎప్పుడూ వున్నాయి.

ఆర్ధిక సంక్షోభంలో పడి అమెరికా, బ్రిటన్‌లు కొట్టుమిట్టాడుతుంటే, అమెరికాపై ఆధారపడిన యూరోపియన్ యూనియన్ దేశాల పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది.

## దివాళా తీసిన గ్రీస్

నయా ఉదారవాద ఆర్ధిక విధానాల అమలులో భాగంగా ప్రపంచబ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల సూచనల మేరకు అన్ని దేశాలలాగే గ్రీస్, స్పెయిన్ దేశాలు కూడా గత రెండు దశాబ్దాలుగా సంస్కరణలు అమలు చేస్తున్నాయి. అమెరికాలో ఏర్పడిన ఆర్ధిక సంక్షోభ ప్రభావం గ్రీస్, స్పెయిన్ దేశాలపై కూడా పడింది. యూరోపియన్ యూనియన్‌లో భాగస్వామి అయినందున 2002లో గ్రీస్ దేశ కరెన్సీ 'డచ్మ'ను రద్దుచేసి యూరోపియన్ యూనియన్ కరెన్సీ అయిన యూరోను తమ కరెన్సీగా మార్చుకుంది. దీని వల్ల గ్రీస్ దేశం యూరోపియన్ యూనియన్ దేశాల నుండి రుణాలు పొందడం సులభమైంది. వివిధ యూరోపియన్ దేశాల నుండి అందినకాడికి రుణాలు తెచ్చి, దేశ అభివృద్ధి కోసం కాక పెట్టుబడిదారుల లాభార్జన కోసం ఖర్చు చేయడంతో ప్రస్తుత సంక్షోభం ఏర్పడింది. అప్పులిచ్చిన బ్యాంకులు, ఐ.ఎం.ఎఫ్ విధించిన షరతులు అమలు చేయడం వలన, నేడు అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని దివాళా స్థితికి గ్రీస్ దిగజారింది.

భౌతికంగా, జనాభా పరంగా గ్రీస్ చాలా చిన్న దేశం. జనాభా ఒక కోటి పదమూడు లక్షలు. అప్పు మాత్రం 340 బిలియన్ యూరోలకు పైగా వుంది. ఆ దేశ బడ్జెట్ లోటు 2009లో 13శాతం. వసూలు కాని గృహ రుణాల వల్ల సంక్షోభం (సబ్‌ప్రైమ్ సంక్షోభం) ఏర్పడింది. గ్రీస్‌లో పెట్టుబడులు పెట్టిన వివిధ యూరోపియన్ యూనియన్ దేశాల బ్యాంకులు దివాలా తీశాయి. స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. గ్రీస్‌ను ఈ సంక్షోభం నుండి బయట పడవేయడానికి 2009లోనే యూరోపియన్ యూనియన్ ప్రయత్నాలు ప్రారంభించింది. రానున్న మూడు సం॥లలో ఐ.ఎం.ఎఫ్, జర్మనీ,

యు.కె వంటి దేశాల సహకారంతో 110 బిలియన్ యూరోల రుణ సహాయం (బెయిల్ అవుట్ ప్యాకేజి) అందిస్తామని ప్రకటించింది. రుణమివ్వడానికి అనేక షరతులు పెట్టింది. వీటి ప్రకారం గ్రీస్ 2012 నాటికి బడ్జెట్ లోటు 3శాతానికి తగ్గించుకోవాలి. అంటే పాలనా వ్యయంలో ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలకు చేసే వ్యయంలో కోతలు పెట్టాలి. గ్రీస్ ప్రధాని జార్జి పపాండ్రో ఈ షరతులకు అంగీకరించాడు. 2010లో రుణంలోని తొలి కిస్తీ కింద 11వేల కోట్ల డాలర్లు స్వీకరించింది. ఈ రుణం గ్రీస్ ఆర్థిక వ్యవస్థను పతనం నుండి కాపాడేందుకు దోహదం చేస్తుందని ప్రభుత్వం నమ్మబలికింది. కాని, ఆచరణలో జరిగింది వేరు. ప్రజలను పూర్తిగా వంచించింది.

బెయిల్-అవుట్ ప్యాకేజీ ద్వారా వచ్చిన ధనాన్ని సంక్షోభంలో వున్న బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తిరిగి కోలుకోవడానికి మాత్రమే వినియోగించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికిగాని, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికిగాని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికిగానీ, వినియోగించలేదు. ఐ.ఎం.ఎఫ్, యూరోపియన్ యూనియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వవు కదా! అందువలన బెయిల్ ఆవుట్‌ల ద్వారా సాధారణ ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదు. గ్రీస్ స్వతంత్ర ప్రతిపత్తిని ఎంతగానో గౌరవించి, రక్షించుకొనే అత్యధిక ప్రజానీకం గ్రీస్ సార్వభౌమత్వానికి భంగం కలిగించి ఈ ప్రజావ్యతిరేక విధానాలను గట్టిగా వ్యతిరేకించారు.

ప్రభుత్వం 2010లో అనేక పొదుపు చర్యలను ప్రకటించింది. ఇందులో ముఖ్యమైనవి ఉద్యోగుల వేతనాల్లో కోత, పెన్షన్‌లో 10శాతం కోత, బోనస్ రద్దు, అనేక భత్యాలలో కోత, పదవీ విరమణ వయసు 60 నుండి 65 సం॥లకు పెంపు, ఉద్యోగి మరణిస్తే అవివాహిత కుమార్తెలకు యిచ్చే పెన్షన్ 18 సం॥లకు పరిమితం చేశారు. దీనివల్ల 40వేల మంది మహిళలు పెన్షన్ కోల్పోయారు. వాణిజ్య పన్నులు, ఇంధన ధరలు విపరీతంగా పెంచారు. నిత్యావసర ధరలు పెరిగాయి. ద్రవ్యోల్బణం 14శాతానికి పైగా వుంది. నిరుద్యోగం 21శాతానికి పైగా వుంది. వీటితో దేశం అతలాకుతలం అయింది. నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతూ ప్రజల ఆదాయం తీవ్రంగా పడిపోయి సాధారణ ప్రజల జీవితాలు ఛిద్రమవుతున్నాయి.

అధికార పార్టీ పేరుకు సోషలిస్టు పార్టీ అయినా ప్రజలపై అపరిమితమైన భారాలు మోపి, కార్పోరేట్ల సేవకు అంకితమైంది. ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ సంస్కరణలకు పూర్తి మద్దతు పలుకుతోంది. ప్రజలను పీల్చుకు తినడానికి అతివాద, మితవాద పార్టీలు రెండూ కుమ్మక్కయ్యాయి. ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, యూరోపియన్ కేంద్ర బ్యాంకుల నుండి పొందిన నూతన ప్యాకేజీలను కాపాడుకోవడానికి సంక్షోభంలో వున్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ఈ పొదుపు చర్యలు అనివార్యమని, ప్రజలు త్యాగాలు చేయాలని, గత ప్రభుత్వం అనవసరంగా చేసిన ఆడంబరాలు, రుణాలు, 2004లో నిర్వహించిన ఒలింపిక్ క్రీడల వంటి విలాసవంతమైన ఖర్చుల కారణంగా దేశంలో ఈ దుస్థితి ఏర్పడిందని ప్రధానమంత్రి బుకాయిస్తున్నాడు. నిజానికి ప్రభుత్వం అనేక విడతలుగా చేపడుతున్న పొదుపు చర్యలు ప్రజల కొనుగోలు శక్తిని మరింత కుదించే విధంగా, ఆర్థిక వ్యవస్థను మరింత దిగజార్చే విధంగా వున్నాయి.

2011లో గ్రీస్ పార్లమెంట్ తాజాగా ఆమోదించిన షరతులు చాలా దారుణంగా వున్నాయి. ఈ షరతుల ప్రకారం ఇప్పటికే ఉద్యోగుల వేతనాల్లో విధించిన కోతను 20శాతానికి పెంచారు. పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయ పరిమితిని 12వేల యూరోల నుండి 8వేల యూరోలకు తగ్గించారు. ప్రతి కార్మికుని నుండి ఉద్యోగి నుండి వేతనంలో 5శాతాన్ని "సంఘీభావ లెవీ"గా వసూలు చేస్తున్నారు. స్వయం ఉపాధి పొందే వారు కూడా 450 యూరోలు పన్ను చెల్లించాల్సి వుంటుంది. సామాజిక సేవలపై భారీగా కోత విధించారు. నిరుద్యోగ భృతి, వృద్ధాప్య పెన్షన్, గృహ వసతి పొందేందుకు షరతులను కఠినతరం చేశారు. పరోక్ష పన్నులు 13శాతం నుండి 18శాతానికి పెరిగాయి. దైనందిన వినియోగ సరుకులపైన వ్యాట్‌ను 19 నుండి 22శాతానికి పెంచారు. ఆల్కహాల్‌పై 20శాతం, పొగాకుపై 63శాతం పన్ను పెంచారు. ఇంధన, విద్యుత్ ఛార్జీలు పెంచారు.

ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 2010 నుండి ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు, ఆందోళనలకు దిగుతున్నారు. పోరాటం నిత్యకృత్యమైంది. పొదుపు చర్యలు సంస్కరణలు అమలు చేసిన ప్రతిసారి తీవ్రమైన ఆందోళనలకు దిగారు. ఇంకా ఆయా సందర్భాల్లో లే ఆఫ్‌లు, రుణాలు రద్దు చేయాలని, ఐ.ఎం.ఎఫ్ అధిపతి స్ట్రాస్‌కాన్ (పేద మహిళపై అత్యాచారానికి పాల్పడిన పచ్చి వ్యభిచారి) గ్రీస్ పర్యటనకు వ్యతిరేకంగా, రవాణా, తపాలా, విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఐ.ఎం.ఎఫ్‌తో చేసుకున్న ఒప్పందాలకు వ్యతిరేకంగా పలుమార్లు సమ్మెలు, ఆందోళనలు చేశారు. కార్మికుల పార్లమెంట్ ముట్టడి సందర్భంగా ఆర్థిక మంత్రిపై గ్యాసోలిన్ బాంబులు వేశారు. రెండు సం॥ల్లో 17 సార్లు సార్వత్రిక సమ్మె నిర్వహించారు. ఈ ఆందోళనలు, పోరాటాల్లో ప్రభుత్వ, ప్రైవేటురంగ ఉద్యోగ, కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళా, వ్యాపార తదితర సంఘాల నాయకత్వంలో అన్ని సెక్షన్ల ప్రజలు వేలు, లక్షల్లో పాల్గొన్నారు.

## స్పెయిన్

స్పెయిన్ ఒక పర్యాటక కేంద్రంగా దృఢమైన ఆర్థిక వ్యవస్థ కలిగి వుండేది. స్పెయిన్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిన దేశాల్లో 12వ స్థానంలో, యూరోపియన్ సమాఖ్య దేశాల్లో 5వ స్థానంలో వుండేది. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు చేయటం ప్రారంభించిన తర్వాత కృత్రిమ ఆదాయ మార్గాలైన గృహ నిర్మాణం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జోరందుకున్నాయి. వీటి ద్వారా జి.డి.పిలో 16శాతం ఆదాయం 12శాతం ఉపాధి కనిపించింది. అయితే త్వరలోనే ఇది భ్రమ అని తేలిపోయింది. గృహ రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించక పోవడంతో 2009 నాటికి ఇక్కడ కూడా వసూలు కాని గృహరుణాల సంక్షోభం (సబ్‌ప్రైమ్ సంక్షోభం) ఏర్పడింది. కృత్రిమ పెరుగుదల మీద ఆధారపడిన స్పెయిన్ ఆర్థికవ్యవస్థ దెబ్బతిన్నది. 2009లో స్పెయిన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుంది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు పర్యవసానంగా సంపన్న వర్గాల మితిమీరిన వినియోగం, ప్రభుత్వంలో అవినీతి పెచ్చరిల్లాయి. సంక్షోభంతో ధనిక – పేదల మధ్య అంతరాలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. 5 కోట్ల జనాభా వున్న స్పెయిన్‌లో 20శాతం ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారు. 2008లో 4శాతంగా వున్న ఆర్థికాభివృద్ధి 2011 నాటికి 0.4శాతానికి పడిపోయింది. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి అన్ని పెట్టుబడిదారీ దేశాల వలె స్పెయిన్ ప్రభుత్వం కూడా పొదుపు చర్యలు చేపట్టి సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు కోతలు విధించింది.

అనేక విడతలుగా అమలు చేసిన పొదుపు చర్యలతో ప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయి. దారిద్ర్యం, నిరుద్యోగం పెరిగింది. 2009 జూలైలో 12లక్షల మందిని ఉద్యోగాల నుంచి స్పెయిన్ ప్రభుత్వం తొలగించింది. 2010 నాటికి నిరుద్యోగం 21శాతానికి చేరుకుంది. చరిత్రలో ప్రప్రథమంగా స్పెయిన్ దేశంలో నిరుద్యోగుల సంఖ్య 40లక్షలకు చేరుకుంది. వేతనాల్లో కోత, కార్మికుల హక్కుల హరింపు, ఉద్యోగాల తొలగింపు, ప్రైవేటీకరణ, ధరల పెరుగుదల మొదలైన ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలకు బ్రతుకుదెరువు దుర్భరమైంది. ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 2010 చివరి నుండి పెద్దయెత్తున నిరసనలు, ఆందోళనలు పెల్లుబికాయి.

ప్రభుత్వ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా, యూరోపియన్ యూనియన్ 'యూరో' స్థిరీకరణ చర్యలకు వ్యతిరేకంగా 2011 మే 5న, జూన్ 19న స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో లక్షలాది మంది ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పలుమార్లు సమ్మెలకు, వీధి పోరాటాలకు పూనుకుంటున్నారు. ఈ హింసాకాండలో అనేక మంది ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ప్రజలు ఇంతగా తెగించి ముందుకు రావడానికి ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభ భారాన్ని కార్మికులు, ఉద్యోగులు, ఇతర సామాన్య ప్రజానీకంపై మోపడమే అసలు కారణం.

రాజకీయ పార్టీలతో, ట్రేడ్ యూనియన్లతో సంబంధం లేకుండా స్పెయిన్ ప్రజలు ఒక స్వతంత్ర ఉద్యమ వేదికను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా డిమాండ్లు రూపొందించి ఉద్యమిస్తున్నారు. ఉద్యమ నాయకులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకొని విడిచిపెట్టే వరకు పోరాడుతున్నారు. అనేక పట్టణాల్లో స్వల్ప వ్యవధిలో ప్రజాకోర్టులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొంటున్నారు. కిక్కిరిసిపోతున్న ఈ ప్రజాకోర్టుల్లో ప్రభుత్వ విధానాలు ప్రజావ్యతిరేకమైనవని, వాటికి వ్యతిరేకంగా ఉద్యమం న్యాయమైనదని 70 నుండి 84శాతం వరకు అభిప్రాయం తెలిపారు.

ప్రజావ్యతిరేక నయా ఉదారవాద ఆర్థిక విధానాలపై జరుగుతున్న చర్చల్లో భాగంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ), 'ప్రపంచ ఉపాధి ధోరణులు – 2011' పేరిట ఒక అధ్యయన నివేదికను విడుదల చేసింది. అందులో ఈ విధానాలు ప్రజలను దారిద్ర్యంలోకి మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడతాయని హెచ్చరించింది. పూర్తి ఉపాధి, పని భద్రత, గౌరవంగా జీవించగలిగే వేతనాలు లభించే విధంగా ఆర్థిక పెరుగుదల లక్ష్యం వుండాలని ఐ.ఎల్.ఓ ప్రపంచ దేశాలను కోరింది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో 16వ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో జరిగింది. దీనికి 101 దేశాల నుండి 881 మంది ప్రతినిధులు హాజరయ్యారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు, ఆర్థిక సంక్షోభ ప్రభావం, కార్మిక హక్కుల హరింపుపై చర్చించారు. "దోపిడి పీడనలు లేని వ్యవస్థ కోసం ఒక మనిషిని మరో మనిషి దోపిడి చేయని, చేయలేని వ్యవస్థ కోసం అన్ని దేశాల శ్రామిక వర్గంతో కలిసి సంఘటితంగా ఉద్యమిద్దాం." అని కాంగ్రెస్ తీర్మానించింది.

ఇప్పుడు మళ్ళీ గ్రీస్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి రుణ సహాయం(బెయిల్–అవుట్ ప్యాకేజి) అందించాలని యూరోపియన్ యూనియన్ నిర్ణయించింది. సంక్షోభంలో పడి దివాలా స్థితిలో ఉన్న తమ బ్యాంకులను కాపాడుకోవడానికి బెయిల్–అవుట్ ప్యాకేజికి సహాయం అందిస్తున్నది. కాని, గ్రీస్ ప్రజలపై ప్రేమతో కాదు. ఆ మేరకు సోషలిస్టు పార్టీ ప్రధాని పపాండ్రో అధికారం నుంచి తప్పుకొని జాతీయ ఉమ్మడి ప్రభుత్వం (సంకీర్ణ ప్రభుత్వం) ఏర్పాటు చేయాలని అధికార, ప్రతిపక్ష పార్టీల

మధ్య ఒప్పందం జరిగింది. బెయిల్ అవుట్ ప్యాకేజి ఇవ్వడం ద్వారా గ్రీస్ సంక్షోభ ప్రభావం, తమ దేశాల మీద పడకుండా జర్మనీ, ఇంగ్లాండు లాంటి యూరోపియన్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అయినా గ్రీస్ సంక్షోభ ప్రభావం వలన "యూరో" విలువ అనూహ్యంగా పతనమైంది. డాలర్‌కు పోటీగా అంతర్జాతీయ కరెన్సీగా యూరోను నిలపాలని ప్రయత్నించినా యూరోపియన్ యూనియన్ ఆశలు అడుగంటాయి. గ్రీస్‌లోనే కాక ఐర్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, పోలాండ్, పోర్చుగల్, స్పెయిన్ మొదలగు దేశాలలో కూడా ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతున్నది. ఈ సంక్షోభం యూరప్ అంతటా వ్యాపిస్తున్నది.

అంతేకాదు, అమెరికా డాలర్‌తో ముడి పెట్టుకున్న దేశాల ఆర్థిక వ్యవస్థలన్నింటిపై సంక్షోభ ప్రభావం పడుతున్నది. భారతదేశంపై సంక్షోభ ప్రభావం ఇప్పటి వరకు లేదని ప్రభుత్వం బుకాయిస్తూ వచ్చింది. ఇప్పుడు స్వల్పకాలిక అభివృద్ధిపై ఆ ప్రభావం పడుతున్నదని కేంద్ర ఆర్థికమంత్రి మాట్లాడుతున్నాడు. ఈ సంక్షోభ ప్రభావం ఇంకా తీవ్రంగానే వుంది. ధరల పెరుగుల, లక్షల మంది ఉపాధి కోల్పోవడం, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిధులకు కోతలు, సబ్సిడీల రద్దు మొదలైనవన్నీ సంక్షోభ పర్యవసానమే.

సామ్రాజ్యవాదులు సంక్షోభంలో దివాలా తీసిన బ్యాంకులను పరిశ్రమలను రక్షించుకోవడానికి బెయిల్-అవుట్ పథకాల కింద లక్షల కోట్ల డాలర్లు వెచ్చించారు. తిరిగి ఆ సొమ్మును రాబట్టుకోవడానికి ఆ భారాన్నంతా అక్కడి కార్మికవర్గం, ఉద్యోగులు, ప్రజలతో పాటు వెనుకబడిన దేశాలపై మోపుతున్నారు. దీనివల్ల బ్రతుకు దుర్భరమైన ప్రజలు ఎక్కడికక్కడ మిలిటెంట్ ఆందోళనలు చేపడుతున్నారు.

అమెరికా లేదా సామ్రాజ్యవాద విధానాల్లో నయా ఉదారవాద విధానాల వల్ల ఉత్పత్తి రంగంపై కంటే సర్వీసు రంగంపై పెట్టుబడులు కేంద్రీకరించడం ప్రధానమైంది. సర్వీసు రంగంలో వచ్చిన సంక్షోభం ఉత్పత్తి రంగాన్ని కూడా ప్రభావితం చేస్తున్నది. అలా అమెరికాలో, ప్రపంచంలో ఉత్పత్తి దెబ్బ తింటున్నది. మాంద్యం-నిరుద్యోగం-ద్రవ్యోల్బణం నిరంతరంగా కొనసాగుతూ ప్రజల కొనుగోలు శక్తి మళ్ళీ కోలుకోలేని స్థితికి పడిపోతున్నది. దీంతో సంక్షోభాలు మరింత లోతుల్లోకి విస్తరిస్తున్నాయి.

సామ్రాజ్యవాదులు వారి తొత్తులైన పాలక ప్రభుత్వాలు ఎంతగా ప్రయత్నించినా పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణమైన ఆర్థిక సంక్షోభాలను శాశ్వతంగా పరిష్కరించలేరు. ఒక సంక్షోభం మరింత లోతైన సంక్షోభాలకే దారితీస్తుంది. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే సంక్షోభాలకు పరిష్కారం. ఇది మార్క్సిజం నిరూపించిన సత్యం. ఈ సత్యాన్ని గుర్తించిన ప్రజలు పోరాటాల్లో సమీకృతులవుతున్నారు. నిజమైన కార్మికవర్గ పార్టీలు ఈ ప్రజలను సంఘటితపరిచి సోషలిజం లక్ష్యంగా సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాలను విజయం వైపు నడిపించాలి. మరణశయ్యపై వున్న సామ్రాజ్యవాదం అంతం, సోషలిజం విజయం తథ్యం. ❍

---

*(...........23వ పేజీ తరువాయి)*

ప్రభుత్వం జాతీయ ఆదాయంలో వైద్యానికి ఖర్చు చేస్తున్నది 2 శాతం, దానిలో పట్టణ ప్రాంతానికి ఎక్కువ భాగం ఖర్చు చేస్తున్నారు. 74 శాతం వున్న గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు తక్కువే. వైద్యాన్ని ప్రైవేటీకరణ చేయడం ఫలితంగా రాజధానిలో కార్పొరేటు హాస్పిటల్స్ వెలిశాయి. రాయగఢ్, కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలలో వందలాది మంది హైజా (వాంతులు, విరోచనాలు)కు గురై మరణిస్తున్నారు.

జాతీయ ఆదాయం వృద్ధిరేటు పెరుగుతున్నది. మరో పక్క 1997 - 2006 మధ్యలో భారత్‌లో ఒక లక్షా 20 వేల రైతులు ఆత్మహత్యలతో మరణించారు. పేదలు పెరుగుతున్నారు. 1998లో ప్రపంచంలోని పేదరికంలో 25 శాతం ప్రజలు భారత్‌లో వున్నారు. 2010 నాటికి వీరి సంఖ్య 40 శాతం పెరిగింది.

భారత ప్రభుత్వం మహారాష్ట్ర నుండి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వరకు బహుళజాతి కంపెనీలకు, దళారీ బూర్జువాలకు ఖనిజ, ఇతర ప్రకృతి సంపదను దోచిపెట్టడానికి విశాల పారిశ్రామిక కారిడర్ నిర్మిస్తున్నది. పోస్కో, బిఎచ్‌పి, వేదాంత, ఆర్సిలార్, మిత్తల్, ఎస్సార్, టాటా, బిర్లా, డాలిమియా, రిలయన్స్, భూషణ, జిందాల్ మొదలైన కంపెనీలకు ప్రకృతి సంపదను ధారాదత్తం చేసింది. విదేశీ, దేశీ గుత్త సంస్థల లూటీకి ప్రజలు ప్రతిఘటిస్తే భారత ప్రభుత్వం గ్రేహౌండ్స్, కోబ్రా, సిఆర్‌పిఎఫ్, నాగా బెటాలియన్ లాంటి బలగాలతో దమనకాండ కొనసాగిస్తున్నది. ప్రజలను ప్రకృతి సంపద నుండి తొలగించి మరో పక్క జాతీయ సంపద వృద్ధిరేటు చూపిస్తున్నది. రాజకీయ నేతల, బ్యూరోక్రాట్ల, దేశ, విదేశ గని యజమానుల చేతిలో సంపద పోగుబడుతున్నది. ఇది సాధారణ ప్రజల గుణాత్మక అభివృద్ధి కాదు. దీని మూలాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో వున్నాయి. దీనికి మానవతా వాదం ముఖం తొడిగినా మానవతా వాదం కనిపించదు.

(ఒడియా పత్రిక 'నిశాన్' లో ప్రచురితమైన డా. గోలక బీహారీనాథ్ వ్యాసానికి అనువాదం) ❍

# కబళిస్తోన్న పోస్కో; అడ్డుకుంటున్న ఉద్యమ కవచం

ఇటీవలి కాలంలో ప్రభుత్వ అభివృద్ధి నామూనాను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు పలు వీరోచిత పోరాటాలను నిర్మిస్తున్నారు. ఈ పోరాటాలకు, పోస్కో వ్యతిరేక ఉద్యమం వొక ఉత్తేజవంతమైన కొనసాగింపును ఇస్తోంది.

భారత్‌లో పుష్కలంగా వనరులుండడం, శ్రమ చౌకగా దొరకడమే కాక; వనరులను చౌకగా దోచిపెట్టే, విదేశీ పెట్టుబడులకు రెడ్‌కార్పెట్ పరిచే దళారీ పాలకులు వుండడం అనేది బహుళ జాతి కంపెనీలను విపరీతంగా ఆకర్షించే అంశం. అందుకే ఉక్కు దిగ్గజం పోస్కో (పొహాంగ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ)ని కూడా ఆకర్షించింది. దక్షిణ కొరియాకు చెందిన పోస్కో ప్రపంచంలోనే మూడో అతి భారీ ఉక్కు సంస్థ. తన దేశంలో కార్మికులకు వేతనాలు అధికంగా వుండడంతో భారత్‌లో ఈ కంపెనీ తన యూనిట్లను స్థాపించదలుచుకుంది. ఈ మేరకు ఒడిశా సర్కార్‌తో అది వొక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ వొప్పందం ప్రకారం ఒడిశాలోని జగత్సింగ్‌పూర్ జిల్లాలో పోస్కో–ఇండియా పేరుతో సంవత్సరానికి ఒక కోటీ ఇరవై లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ఒక భారీ ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించతలపెట్టింది. దేశంలో ఇప్పటి దాకా వున్న ఉక్కు ఫ్యాక్టరీలన్నింటి ఉత్పత్తితో ఇది సమానమని భావిస్తున్నారు. ఈ వుత్పత్తి లక్ష్యాన్ని సాధించడం కోసం ఈ కంపెనీ చుట్టుపక్కల వున్న కియోంఝర్, సుందర్‌గఢ్ జిల్లాల నుండి ఏటా 60 కోట్ల టన్నుల ముడి ఇనుమును తవ్వుకుంటుంది. అంతేకాదు తయారైన ఉక్కును విదేశాలకు తరలించడానికి ప్లాంటు సమీపంలో ఒక పోర్టును కూడా నిర్మించతలపెట్టింది. ఫ్యాక్టరీ ఆవరణలోనే ఒక విద్యుత్ ప్లాంటును కూడా నిర్మించతలపెట్టింది. ఇంకా యీ ప్రాజెక్టు మొత్తానికి అవసరమైన టౌన్‌షిప్ వగైరాలను మైనింగ్ ప్రాంతంలోనూ, భువనేశ్వర్‌లోనూ నిర్మించతలపెట్టింది. మొత్తంగా ఈ ప్రాజెక్టు 54 వేల కోట్ల విలువైనది. ఇది యిప్పటికి దేశంలోనే అతి భారీ విదేశీ పెట్టుబడి అవుతుంది.

ఇంత భారీ ప్రాజెక్టును పొందినందుకు నవీన్ పట్నాయక్ మురిసిపోతున్నాడు. కానీ ఒడిశా ప్రజలు ఆ మురిపాన్ని ముక్కలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలు ఆరు సంవత్సరాలుగా పోరాడుతున్నారు. ఎందుకంటే ఈ ప్రాజెక్టు ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారబోతోంది. ఉక్కు ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వం నాలుగు వేల ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమి జగత్సింగ్‌పూర్ జిల్లా, ఎర్రసామ బ్లాక్‌లోని ధింకియా, గొడొకుజంగ్, నువాగాం పంచాయితీలోని పలు గ్రామాలకు చెందినది. ఇందులోని మూడు వంతుల భూమి అటవీ హక్కుల చట్టం పరిధిలోని రక్షిత భూములే. అంటే ఇవి అన్యాక్రాంతం కావడం నిషేధం. ఈ గ్రామాల్లో దాదాపు



పోస్కోను అడ్డుకొంటున్న పోరాటంలో ముందువరుసలో పిల్లలు

నాలుగు వేల కుటుంబాలున్నాయి. అంటే దాదాపు ఇరవై వేల ప్రజలు నిర్వాసితులు కానున్నారు.

ఈ కంపెనీ కోసం రక్షిత అడవులను ధ్వంసం చేయడం ఒకటైతే, ఏడాదికి దాదాపు ఐదు కోట్ల ఆదాయాన్నిచ్చే పండ్ల తోటలను కూడా ధ్వంసం చేయనున్నారు. మరెన్నో పంట పొలాలను, తమలపాకుల తోటలను ధ్వంసం చేయబోతున్నారు. ఇది తీవ్రమైన పర్యావరణ వినాశనానికి కారణమవుతుంది. అంతేకాదు ఈ ఫ్యాక్టరీ ఏటా ఏడువేల కోట్ల లీటర్ల నీటిని వాడుకుంటుంది. దీనివలన వందల కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం వుంది.

ఇంత విధ్వంసాన్ని భరించాల్సిన ప్రజలకు ఈ కంపెనీ వల్ల కించిత్తు ప్రయోజనం లేదు. ఎందుకంటే యిది భారీ యంత్రాల మీద ఆధారపడే కంపెనీ కనుక స్థానిక ప్రజలకు ఇందులో వుద్యోగాలు దొరికే అవకాశం లేదు. ఇక యింత భారీ కంపెనీ ప్రతిపాదించిన పునరావాసం ఏంటంటే, రెండేళ్లపాటు నెలకు 1500 రూపాయలను చెల్లించడం!

పోనీ ప్రజలు నష్టపోయినా ఇంత భారీ ఎత్తున గనులనూ, అడవినీ, భూములనూ, నీటినీ పోస్కోకి కట్టబెడుతున్నందుకు రాష్ట్రానికైనా ఒరిగేదేమన్నా వుందా? కొంత మంది స్వార్థపరుల వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం లేదు. కేవలం నామమాత్రపు రాయల్టీకే కొన్ని లక్షల కోట్ల విలువైన సంపదనూ, అమూల్యమైన ప్రజల భవిష్యత్‌నూ నిస్సిగ్గుగా పణంగా పెడుతున్నాడు నవీన్ పట్నాయక్.

అందుకే ఈ ఫ్యాక్టరీని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రతిపక్షాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఈ కంపెనీ చేస్తున్న ప్రతిపాదనలు కొన్నింటిపై అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం పారాదీప్ పోర్ట్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోనే వున్నప్పటికీ, ప్రత్యేకంగా మరొక పోర్టు ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. అలాగే ఈ ప్లాంట్‌కు సెజ్ హోదా కలిపించాలనే ప్రతిపాదనను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇటువంటి ఏ వ్యతిరేకతలనూ పట్టించుకోకుండా కేంద్రం 2007 జూన్ 15న ఈ ప్రాజెక్టుకు హడావుడిగా అనుమతులిచ్చేసింది. ఇలా అనుమతులిచ్చే ముందు అటవీ చట్టం, పర్యావరణ చట్టం, ఆదివాసీ చట్టాలు, అటవీ మంత్రిత్వ శాఖ రూపొందించిన నిబంధనలు... ఇవన్నింటినీ తుంగలో తొక్కింది. ఉదాహరణకు ఆదివాసీ, అటవీ చట్టాల ప్రకారం అటవీ సంపదను తరలించాలంటే గ్రామసభల ఆమోదం తప్పనిసరి. ధింకియా, గోవిందపూర్‌లలో జరిగిన గ్రామసభల్లో 65 శాతానికి పైగా ప్రజలు కంపెనీకి భూములను కట్టబెట్టడాన్ని వ్యతిరేకించారు. అయితే ఈ తీర్మానాలు బూటకమయినవని రాష్ట్ర ప్రభుత్వం అటవీ మంత్రిత్వశాఖ దగ్గర పచ్చి అబద్ధాలాడింది. పైగా జిల్లా మేజిస్ట్రేట్ భూ సేకరణకు అనుమతులిచ్చినట్టు దొంగ సర్టిఫికేట్లు సృష్టించింది. ఇక యీ ప్రాంతంలో 20 వేలకు పైగా ఆదివాసీ ప్రజలు జీవిస్తుండగా, నవీన్ సర్కార్ ఇక్కడ ప్రజలే లేరని నిస్సిగ్గుగా చెబుతోంది. ఇలా పూర్తి అసత్యాల మీద ఆధారపడి కేంద్రం నిరభ్యంతరంగా అనుమతులిచ్చేసింది.

దీనికి వ్యతిరేకంగా ప్రజలు 'పోస్కో ప్రతిరోధ్ సంగ్రాం మంచ్'ను ఏర్పాటు చేసుకొని 2005 జూలై నుండి ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రాజెక్ట్‌కు కేటాయించిన భూములను సర్వే చేయడానికి వచ్చిన ప్రభుత్వ అధికారులనూ, పోస్కో ఉద్యోగులను అడ్డగించారు. వలుసార్లు వీళ్లను నిర్బంధించి మళ్లీ ఈ గ్రామాల్లో అడుగుపెట్టకూడదని హెచ్చరించి వదిలేశారు. ఈ ఆందోళన నేపథ్యంలో కేంద్ర పర్యావరణ శాఖ ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడానికి సక్సేనా కమిటీనీ, మీనా గుప్తా కమిటీనీ నియమించింది. ఈ కమిటీలు చేసిన నిజనిర్ధారణల్లో ఇక్కడ ప్రజలున్నారనీ, వారు ఈ అడవిపైనే ఆధారపడి వున్నారనే వాస్తవంతో పాటు, ఈ ప్రజలు చెందుతున్న ఆందోళన సహేతుకమైనదేనని తేలింది. అంతేకాదు ప్రభుత్వం ఇష్టానుసారం నిబంధనలను ఉల్లంఘించినట్టు కూడా ఈ కమిటీలు నిర్ధారించాయి. ఈ నివేదికల నేపథ్యంలో ప్రస్తుత కేంద్ర అటవీశాఖ మంత్రి జైరాం రమేష్ 2010 ఆగస్టు 5న ప్రాజెక్ట్‌కు అనుమతులను నిరాకరిస్తూ ప్రకటన చేశాడు. కానీ అదే జైరాం రమేష్ తిరిగి ఈ సంవత్సరం మే నెలలో 'షరతులతో' కూడిన అనుమతులిచ్చాడు. మన్మోహన్ సింగ్ కూడా ఈ కంపెనీకి వత్తాసు పలికినట్టూ, ఈ కంపెనీకి అనుమతులు నిరాకరించడమనేది దేశంలోకి ప్రవహించే విదేశీ పెట్టుబడులను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వాదించినట్టూ తెలుస్తోంది. జైరాం రమేష్ కూడ ఇదే గూటి పక్షి కాని, పాలకవర్గాలు అవసరం కొద్దీ మరో ముఖాన్ని ప్రదర్శన చేయిస్తాయి.

అనుమతులు లభించడంతో వెంటనే భూముల ఆక్రమణ కార్యక్రమం మొదలైంది. మొదట గొడొకుజంగ్, నువాగాం పంచాయితీలలో రెండు వేల ఎకరాల భూములను ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో తమలపాకుల తోటల విధ్వంసాన్ని అడ్డుకున్నందుకు, జూన్ 2న గొడొకుజంగ్ పంచాయితీ సభ్యుడూ, పోస్కో ప్రతిరోధ్ సంగ్రాం మంచ్ ఉపాధ్యక్షుడు అయిన బసుదేవ్ బెహరా సహా 17 మందిని బాగా కొట్టి అరెస్టు చేశారు. ఈ సంఘటనతో ఆందోళన వేడెక్కడం మొదలయింది.

భూ స్వాధీనం కోసం వచ్చే పోలీసులనూ, అధికారులను అడ్డుకోవడం కోసం ధింకియా పంచాయితీలోని గోవిందపూర్ గ్రామంలో ప్రజలు మానవహారాలుగా ఏర్పడ్డారు. కానీ పోలీసులూ, అధికారులూ ప్రజలు లేని వైపు నుంచి గ్రామంలోకి ప్రవేశించి 24 తమలపాకుల తోటలను ధ్వంసం చేశారు. జూన్ 10న జరిగిన ఈ సంఘటనతో ఉద్యమం మరింతగా ఉధృతం అయింది. ధింకియా, గోవిందపూర్ గ్రామాలలో 14 వందల ఎకరాలను ఆక్రమించుకోవాల్సి వుంది. కానీ ఇక్కడి ప్రజలు 'ప్రాణాలు పోయినా సరే కంపెనీని కట్టనివ్వం, అంగుళం భూమిని కూడా వదులుకోం' అంటూ వీరోచితంగా పోరాడుతున్నారు. పిల్లలూ, వృద్ధులూ అనే తేడా లేకుండా మహిళలూ, పురుషులూ మండుటెండనూ, వానలను లెక్క చేయకుండా మానవ హారాలుగా ఏర్పడి రోడ్ల మీద పడుకొని తమ గ్రామాల్లోకి కంపెనీ, ప్రభుత్వ, పోలీసు సిబ్బందినెవరినీ అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్నారు. మొదటి వరుసలో పిల్లలూ, వారి వెనుక మహిళలూ, ఆ తరువాత పురుషులు పడుకుని తమ గ్రామాలకు అక్షరాల రక్షణ కవచంగా మారిన తీరు దేశవ్యాప్తంగా ప్రజలను కదిలిస్తోంది. జూన్ నెల బడులు తెరిచే కాలం. కానీ ఇక్కడి పిల్లలెవరూ బడికెళ్లకుండా పోరాటంలో పాల్గొంటున్నారు. ప్రస్తుతం యీ ఆందోళనకు గోవిందపూర్ కేంద్రంగా వుంది.

గొడొకుజంగ్, నువాగాం పంచాయితీలలో రెండు వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారని చెప్పుకున్నాం. ఇక్కడి ప్రజలు ప్రాజెక్టుకు అనుకూలంగా వున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ గొడొకుజంగ్‌లో 17 మందిని అరెస్టు చేశారనే వార్త ఇక్కడి ప్రజల అసమ్మతిని వెల్లడిస్తోంది. దీన్ని బట్టి పోలీసు బలగాలను మోహరించడం వల్లనే ఇక్కడ భూస్వాధీనం సాధ్యం అయిందని అర్థం చేసుకోవచ్చు. వందలాది నువాగాం గ్రామస్తులు మానవహారాల్లో చేరడాన్ని చూస్తే కూడా ఈ గ్రామానికి చెందిన మెజారిటీ ప్రజలు పోస్కోను సమర్థిస్తున్నారనేది వాస్తవం కాదని తెలుస్తుంది. ఈ వూర్లో ప్రాబల్య స్థానంలో వున్న పలువురికి అధికార బిజూ జనతా దళ్‌తో సంబంధాలు వున్నాయి. వీళ్లు భూములు ఇవ్వడానికి ప్రజలను వత్తిడి చేస్తున్నట్టు గ్రామస్తులే వెల్లడిస్తున్నారు.

గోవిందపూర్‌లో బలప్రయోగానికి పాల్పడి 24 తమలపాకుల తోటలు ధ్వంసం చేశారనే వార్తలను దృష్టిలో పెట్టుకుని జైరాం రమేష్ 'భూ సేకరణ ప్రశాంతంగా, ధర్మ బద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరపాల'ని ఒడిశా సర్కార్‌కు 'హితవు' పలికాడు. ఇంతకు మించిన వింత మరొకటి వుండదు. దేశంలో ఎక్కడయినా, ఎప్పుడైనా ప్రశాంతంగా, ధర్మబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా భూ సేకరణ జరిగిందా? భవిష్యత్‌లో జరగబోయే ఘర్షణలకు, లేదా రక్తపాతానికి తన బాధ్యత ఏమీ లేదనిపించుకోవడానికి కేంద్ర మంత్రి ఇలా 'సూక్తులు' ప్రవచిస్తున్నాడు. రాష్ట్రంలో వున్నది కాంగ్రెస్ సర్కార్ కాదు గనక భవిష్యత్ పరిణామాలకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాన్నే బాధ్యురాలిగా చేసే ఎత్తుగడ కూడా యిది.

అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జైరాం రమేష్ 'సూక్తులను' ఏమీ చెవిన పెట్టదలుచుకోలేదు. అది ఆచరణ సాధ్యం కాదని దానికి తెలుసు కనుక ఈ పోరాటం పట్ల చాలా మొరటుగానే వ్యవహరిస్తున్నది. అసలు నవీన్ పట్నాయక్ ప్రభుత్వం మొదటి నుండీ కూడా బాధితులతో ఎన్నడూ చర్చలకు సిద్ధపడింది లేదు. కేవలం పోలీసు బలగాల మీద ఆధారపడి మాత్రమే భూములు లాక్కోవాలని చూస్తున్నది. ప్రస్తుతం కూడా అడ్డంకులు కల్పిస్తే చర్యలు తప్పవని బెదిరిస్తున్నది. ఈ గ్రామాలన్నింటిలోనూ 20 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించింది. ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోతే ఉక్కు పాదంతో అణచివేయమని ఆదేశాలు కూడా ఇచ్చింది. కళింగనగర్‌లో 12 మందిని చంపిన అనుభవం దానికెలాగూ వుంది. మరో వైపు పిల్లల మీద లాఠీ ఛార్జ్ జరిపారనో లేదా కాల్పులు జరిపారనో అపవాదు రాకుండా వుండడం కోసం పిల్లలను యీ ఉద్యమం నుండి తప్పించడానికి రకరకాల ఎత్తుగడలు పన్నుతున్నది. ఈ రాష్ట్ర ప్రాథమిక విద్యా శాఖ మంత్రి బడికెళ్లని పిల్లల వివరాలను తెలియజేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించాడు. భవిష్యత్‌లోనూ ఈ పిల్లలను వేధించడానికేమో! మహిళా శిశు సంక్షేమ శాఖ కూడా ఈ విషయంలో 'ఆందోళన' చెందుతోంది. అందుకే పిల్లలను ఇలా 'ఉపయోగించుకోవడం' పట్ల నివేదికను కోరింది. కానీ పోషకాహారం కరువై పిల్లలు అలమటిస్తుంటే, చనిపోతుంటే ఈ శాఖ ఎన్నడూ యింతగా ఆందోళన చెంది వుండదు. పిల్లలను ఇలా పోరాటాల్లో ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ అన్నాడు. పిల్లలను పోరాటాల్లో ఉపయోగించుకోవడం చట్ట అతిక్రమణ అవుతుందేమోగానీ, మరి కర్మాగారాల్లో ఎందరో బాలలు నలిగిపోవడం చట్టబద్ధమేనా? ఇండ్లల్లో పనిమనుషులుగా బతుకులీడ్చడం చట్టబద్ధమేనా? పనిపిల్లలను చిత్రహింసలు పెట్టడం చట్టబద్ధమేనా? పెంటకుప్పల మీద కాగితాలు ఏరుకోవడం చట్టబద్ధమేనా?

అసలిక్కడ పోరాటంలో పిల్లలను ఎవరూ ఉపయోగించుకోవడం లేదు. పిల్లలు ఎంతో చైతన్యవంతంగా ఈ పోరాటంలో భాగమయ్యారు. తాము సర్వం కోల్పోయి బాలకార్మికులు గానో, పని మనుషులు గానో, వీధి బాలలుగానో మారకుండా వుండడం కోసం ఈ పిల్లలు స్వచ్ఛందంగా చేస్తున్న పోరాటమిది. తమ భవిష్యత్‌ను కాపాడుకోవడం కోసం తమ తల్లిదండ్రులతో కలిసి చేస్తున్న పోరాటమిది. ఈ విషయాన్ని పిల్లలే చాటుతున్నారు. 'మా

తల్లిదండ్రులు ఆరేళ్లుగా ఆందోళన చేస్తున్నారు. వాళ్లు చంపకముందే చావడానికి సిద్ధంగా వున్నాం. నవీన్ పట్నాయక్ ప్రభుత్వం మా తల్లిదండ్రులను, మా తమలపాకుల తోటలను లేకుండా చేయాలనుకుంటోంది' అని ఒక పిల్లవాడన్నాడు. 'మా తండ్రిని ఇదివరలో పోస్కో మద్దతుదారులు చంపేశారు. మా పెద్దలు ఆరేండ్లుగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం వినడం లేదు. ఇప్పుడు మేము ముందుండి పోరాడాలనుకుంటున్నాం. ప్రభుత్వం వినాల్సి వస్తుంది. మేము పోలీసు బలానికి భయపడడం లేదు' అని మరో బాలిక చెప్పింది. పోరాటంలో పాల్గొంటున్న ఈ పిల్లలను చూసి 'ఇక్కడి పిల్లలు పాలకులకు ప్రకృతీ, పర్యావరణ పరిరక్షణ పాఠాలు చెబుతున్నార'ని వందనాశివ చాలా చక్కగా వ్యాఖ్యానించింది.

తమతో పాటు పిల్లలు పాల్గొనడం గురించి ఓ తల్లి స్పందిస్తూ 'ఈ పిల్లలు ఎలాగూ చనిపోతారు. ఇక్కడి నుండి తరిమేసి తిండి దొరకకుండా చేస్తే వాళ్లెలా బతుకుతారు? మేమంతా చావడానికి సిద్ధమే' అంది.

అవును మరి ఇక్కడ సర్వస్వమూ పోగొట్టుకొని, ఎక్కడికో వెళ్లి ఆకలితో అలమటించి, బికారుల్లా చావడం కంటే తమ గడ్డ మీద, అదీ పోరాటంలో ప్రాణాలు వదలడం వాళ్లకు గౌరవప్రదం కాదా?

ప్రజలు చేస్తున్న ఈ వీరోచితమైన పోరాటం ఒడిశా రాష్ట్రానికే పరిమితమై వున్నా, దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. దేశవ్యాప్తంగా ప్రజలు మద్దతును తెలుపుతుండగా, పలువురు సామాజిక, పర్యావరణ కార్యకర్తలు ఈ గ్రామాలకు వెళ్లి తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు.

ఇక ఒడిశాలో అధికార పార్టీ తప్ప అన్ని పార్టీలూ ఈ పోరాటానికి మద్దతును ఇస్తున్నాయి. కేంద్రంలో కాంగ్రెస్ నేతలు ఈ వినాశన ప్రాజెక్టుకు అనుమతినివ్వగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వుద్యమానికి మద్దతునివ్వడం ఎంత అవకాశవాదం! తాము సుదీర్ఘ కాలం ఏలిన పశ్చిమ బెంగాల్‌లో ఇదే విధంగా ప్రజల భూములను పరిశ్రమలకు కట్టబెట్టాలని చూసి ఘోరంగా భంగపడ్డ వామపక్షాలు ఈ పోరాటంలో పాల్గొనడం కూడా అంతే అవకాశవాదం. సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు చేయడంలో కాంగ్రెస్‌తో పోటీపడే బిజెపికి కూడా ఈ పోరాటానికి మద్దతు ప్రకటించే అర్హత లేదు. అయినా ఈ పార్టీలన్నీ ఓట్ల రాజకీయాల్లో ప్రజలను గెల్చుకోవడం కోసం ఈ పోరాటంలో పాల్గొంటున్నాయి, మద్దతును ఇస్తున్నాయి. అయితే అవకాశం వచ్చినప్పుడు ఇవి పోరాటాలను పక్కదారి పట్టించడానికీ, చల్లార్చడానికి ప్రయత్నించే అవకాశం వుంది. కాబట్టి నిజమైన పోస్కో ఉద్యమకారులు అప్రమత్తంగా వుండడం అవసరం.

ఇంత ఉధృతంగా ఈ పోరాటం సాగుతున్నప్పటికీ, ఈ పోరాటానికి ఇంత విస్తృతమయిన మద్దతు వున్నప్పటికీ ప్రభుత్వమూ, పోస్కో మాత్రం ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఈ వొప్పందం కాలపరిమితి ముగిసి పోవడంతో ఒప్పందాన్ని నవీకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పొలంగ గ్రామంలో పోలీసు బందోబస్తు నడుమ కంపెనీ ప్రహరీ నిర్మాణం కోసం భూమి పూజ జరిగింది. ఆక్రమించుకున్న భూములను బలగాల సాయంతో చదును చేస్తున్నారు కూడా.

అయితే గోవిందపూర్, ధింకియా గ్రామ ప్రజలు పోరాటాన్ని పట్టువిడవకుండా కొనసాగిస్తుండడంతో దిక్కు తోచని ప్రభుత్వం భూ సేకరణను నిలిపివేస్తున్నట్టు జూన్ 21న ప్రకటించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకూ భూ సేకరణను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది కనుక ఈ నిలిపివేత తాత్కాలికమేననేది స్పష్టం. మరిన్ని బలగాలతో సమీప భవిష్యత్‌లోనే భూ సేకరణకు దిగడానికి ప్రభుత్వం ఎంత మాత్రమూ వెనుకాడదనేది కచ్చితంగా చెప్పవచ్చు.

పోస్కో శాశ్వతంగా ఈ భూముల జోలికి రాకుండా వుండాలంటే ఈ ప్రజలు తమ పోరాటాన్ని ఇలాగే కొనసాగించాలి. కర్ణాటకలోని గదగ్ జిల్లా హళ్లిగుడి గ్రామంలోనూ పోస్కో ఒక స్టీల్ ప్లాంటును నిర్మించతలపెట్టింది. దీన్ని కూడా ఇక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే పోస్కోకు వ్యతిరేకంగా చేస్తున్న ఈ పోరాటాన్ని మొత్తంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి. ఈ పోరాటాలను బాధిత రాష్ట్రాలకే పరిమితం చేయకుండా, వీటికి సంఘీభావంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్మించాలి. అప్పుడే సామ్రాజ్యవాదుల, బహుళజాతి కంపెనీల, భారత దళారీ పాలకుల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది.

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# ఆఫ్రికా దేశాలను మార్కెట్ వనరుగా మార్చే భారత్ విదేశాంగ విధానాన్ని వ్యతిరేకిద్దాం

ఆకలి చావులు, కరువు కాటకాలు, అవినీతికి ఆలవాలమై నలిగిపోతున్న ఆఫ్రికా దేశాల్లో, మిలిటరీ రాజ్యాలు, నియంతృత్వాలు, రాచరికాలు, సృష్టిస్తున్న మారణహోమాలకు తోడు గల్ఫ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం – ఇదీ ఆఫ్రికా ఖండంలోని పరిస్థితి. ప్రపంచం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులకు కొత్త ప్రాంతాలుగా ఆఫ్రికా ఖండ దేశాలు కనబడుతున్నాయి. 54 దేశాలు (దక్షిణ సూడాన్ కొత్తది), 150 కోట్ల జనాభా గల, అపారమైన శ్రమ శక్తి, చమురు, వజ్రాలు, బంగారం, బొగ్గు, యురేనియం లాంటి సహజ వనరులతో ఆఫ్రికా ఖండం నిండి వుంది. ఇక్కడ కోట్ల ఎకరాల భూమి సాగు చెయ్యకుండా వుంది. ఆఫ్రికా ఖండంలో సాగు చెయ్యకుండా వున్న భూమి, ప్రపంచం మొత్తంలో సాగవుతున్న భూమిలో సగ భాగం వుంటుంది. అదంతా సాగు యోగ్యమైనదే. ఉదాహరణకు ఇథియోపియాలో సాగులో లేని 70 లక్షల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమిని సాగు చేసేందుకు భారతీయ కంపెనీలు ముందుకు రావాలని ఆ దేశ ప్రధాని మెలెస్ జెనావి స్వయంగా ఆహ్వానిస్తున్నాడు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'కరతూరి' అనే వ్యవసాయ పెట్టుబడిదారుడు ఇథియోపియాలోని గంబెలా ప్రావిన్స్‌లో మొక్క జొన్న పండించడానికి రెండున్నర లక్షల ఎకరాల భూమిని తీసుకున్నాడు. ఆ లావాదేవీలన్నీ పారదర్శకంగానే ఉన్నాయని అధ్యక్షుడు ప్రకటిస్తున్నాడు. ప్రపంచంలో పెరుగుతున్న ఆహార అవసరాలు, డీసిల్, బయోడీసిల్, గ్యాస్ అవసరాల రీత్యా భవిష్యత్‌లో ఆఫ్రికా దేశాలు కీలకం కాబోతున్నాయి. ఈ చారిత్రక పరిణామంలో భాగంగానే సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో పాటు నూతన పొందికలు ఏర్పడుతున్నాయి.

ఆఫ్రికా ఖండ దేశాలు శతాబ్దాలుగా యూరోపియన్ దేశాలకు, తర్వాత అమెరికన్ సామ్రాజ్యవాదానికి వలసలుగా వుండడంతో శ్రమశక్తి, చమురు, బంగారం లాంటి విలువైన సహజ వనరుల దోపిడీకి గురయ్యాయి. పాశ్చాత్య దేశాల భౌగోళిక రాజకీయాల కారణంగా అవి నెత్తుటి క్షేత్రాలుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే లిబియాతో సహా అనేక దేశాలు నెత్తురోడుతూనే వున్నాయి. ప్రపంచీకరణ తెచ్చిన నూతన ఆర్థిక విధానాలూ, సంస్కరణలు ప్రపంచమంతటా తెచ్చిన సమస్యలనే ఆఫ్రికాలోనూ తెచ్చి ఆర్థిక సంక్షోభాన్ని పెంచడంతో పాటు నిరుద్యోగాన్ని పెంచాయి. అది రాజకీయ సంక్షోభానికి, పెద్ద ఎత్తున నిరసనోద్యమాలకు దారి తీసింది.

ఒక దశాబ్దకాలంగా ఆఫ్రికా దేశాల్లోకి చైనా పెట్టుబడులు వేగంగా ప్రవహిస్తున్నాయి. భారత్ కంటే చైనా వాణిజ్యం మూడు రెట్లు అధికంగా వుంది. ఉదాహరణకు కిందటి సంవత్సరం ఆఫ్రికా ఖండ దేశాలతో భారత వాణిజ్యం నాలుగు వేల కోట్ల డాలర్లుంటే చైనా వాణిజ్యం 12 వేల 690 కోట్ల డాలర్లుంది.

ఆఫ్రికా దేశాలతో భారత్ సంబంధాలు సుదీర్ఘ కాలంగానే వున్నాయి. అయితే ఆనాడు అలీనోద్యమ సహకారం పేరిట రష్యా పెట్టుబడులకు అనుకూలంగా సంబంధాలు కొనసాగించింది, కాగా, నేడు ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులకు అనుకూలంగా, చైనాకు పోటీగా ఆఫ్రికా దేశాలతో భారత్ ఆర్థిక, రాజకీయ సంబంధాలను పెంచుకుంటున్నది. ఈ నేపథ్యంలోనే 'ఆఫ్రికా – భారత్ ఫోరం' సదస్సులను చూడాలి.

2008లో జరిగిన మొదటి సదస్సులో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆఫ్రికా ఖండ దేశాలకు భారత్ 540 కోట్ల డాలర్ల సహాయాన్ని అందించింది. ఎక్కడెక్కడి ముడి పదార్థాలను స్వాధీనం చేసుకోవాలనే ఆరాటంతో, ఆఫ్రికా దేశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడుతున్న పేరుతో చైనా అక్కడ పెద్దయెత్తున పెట్టుబడులు పెంచింది. ఆ కారణంగా కూడా చైనా వాణిజ్యం భారత్ కన్నా అనేక రెట్లు ఎక్కువగా వుంది. చమురు రంగంలో చైనా కంపెనీలే అధికంగా కాంట్రాక్టు పొందాయి.

2011 మే చివరలో, రెండవ 'ఆఫ్రికా – భారత్ ఫోరం' ఇథియోపియా రాజధాని 'అడిస్ అబాబా'లో రెండు రోజుల పాటు జరిగింది. ఉగ్రవాదం, సోమాలియా సముద్రపు దొంగలు లాంటి సమస్యలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై ఉమ్మడిగా కృషి చేయాలని తీర్మానించాయి. ఎనిమిది పేజీల 'అడిస్ అబాబా డిక్లరేషన్'ను మే 25న ప్రకటించాయి. భారత్ సహా ఆఫ్రికన్ దేశాలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. ఈ సదస్సుకు భారత్ నుండి ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి హాజరయ్యారు. ఈ సదస్సును భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడం

⇨

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## విఆర్‌పి, విఓడబ్ల్యూల అవినీతిని నిలదీసిన ప్రజలు

ఏ.ఓ.బిలోని ఈస్టు డివిజన్ విశాఖ జిల్లా పరిధిలో కోరుకొండ ఏరియా పెద బయలు మండలం, ఇంజేరి పంచాయితీలో 500 మంది ప్రజలు 2011 జూలై 1న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవినీతిపై విఆర్‌పిలను నిలదీసారు.

ఈ సంవత్సరం తీవ్రమైన వర్షాల కారణంగా ప్రజలు చేతికి వచ్చిన పంట కోల్పోయి చేసిన అప్పులు తీర్చ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సమయంలో జాతీయ గ్రామీణ ఉపాధీ హామి పథకం ద్వారా పనులు చేసారు. ఈ పనులతో వచ్చిన డబ్బుతో నైనా బియ్యం తెచ్చుకొని గంజి కాచుకుందామనే ఆశతో ప్రజలు తిండి లేకపోయినా పస్తులతో కష్టపడి పనులు చేసారు. పొలంగట్లు వేయటం, చెరువులు తవ్వటం, నీరు ఇంకుడు కాలువలు తియ్యటం వంటి పనులు రెండు, మూడు నెలల వరకు చేసినారు. ఈ పనుల్లో వచ్చిన డబ్బును విఆర్‌పిలు సరిగా ఇవ్వకుండా దాదాపు 5 లక్షలు కాజేసినారు.

ఈ దోపిడీని సహించలేని ప్రజలు పాట్ ఏఆర్‌సిఎస్ కమిటీ దృష్టికి తీసుకొచ్చినారు. ఈ కమిటీ నాయకత్వం కింద ప్రజలు సంఘటితంగా అవినీతిని వ్యతిరేకిస్తూ నిలదీసారు. ప్రజలు శ్రమ చేసిన డబ్బు చెల్లించకపోతే మీ ఆస్తులన్నీ ప్రజల పరం చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆగ్రహానికి భయపడి రెండు విడతలుగా డబ్బు ఇస్తామని హామి పత్రం రాసి ఇచ్చారు.

ఈ సందర్భంగానే రమేష్, రంగారావు అనే వ్యక్తులు జెమిని సంస్థ పేరు చెప్పి ప్రజల దగ్గర 2,60,000 రూపాయలు రంగారావులు వసూలు చేశారనే సమస్య ముందుకు వచ్చింది. 2011 జూలై 5న 600 మంది ప్రజల ముందు నిలదీసారు.

జెమినికి డబ్బుకడితే వారం రోజుల లోపే వడ్డీతో సహా డబ్బులు

---

కోసం ఈ సందర్భంగా భారత్ అనేక ఆఫ్రికన్ దేశాల్లో పర్యటించి అనేక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నది.

ఆఫ్రికా – ఇండియన్ ఫోరమ్ సదస్సు సందర్భంగా 'సామర్థ్య నిర్మాణం' నినాదం ఇచ్చారు. మానవ, భౌతిక వనరుల అభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి, పాలనలోను, వాణిజ్య నిర్వహణలోను సహకారం అందించేందుకు భారత్‌తో ఆఫ్రికన్ దేశాలకు అవగాహన కుదిరింది.

ఆఫ్రికా దేశాల వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు 500 కోట్ల డాలర్లు, అలాగే ఇథియోపియా – జిబేటీ రైల్వే నిర్మాణానికి వంద కోట్ల డాలర్లు రుణంగా అందిస్తున్నది. ఒకప్పుడు సోవియట్ యూనియన్ కూటమిలోని దేశమైన ఇథియోపియాతో, ఇప్పుడు భారత్ అనేక వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. గత నాలుగేళ్లుగా 470 కోట్ల డాలర్లుగా వున్న భారత్ పెట్టుబడులు 2015 నాటికి వెయ్యి కోట్ల డాలర్లకు అభివృద్ధి కానున్నాయి. టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వ్యవసాయం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నది.

అంతర్జాతీయ విపణిలో వడ్డీ రేట్లు తక్కువ వుండడంతో భారతీయ వాణిజ్యవేత్తలు అక్కడ నుండి తెచ్చి ఆఫ్రికాలో పెట్టుబడులు పెడుతున్నారు. ఆఫ్రికా దేశాల్లో ప్రైవేటు రంగాన్ని విస్తరింప జేసేందుకు శ్రమ శక్తిని, వనరులను దోచుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. 43 దేశాలను అనుసంధానించే ఇ–నెట్‌వర్క్ ఏర్పాటు చేసే ప్రాజెక్టు చేపడతానని భారత్ గతంలోనే హామీ ఇచ్చింది. చమురును ఉత్పత్తి చేసే ఎనిమిది ఆఫ్రికా దేశాలలో మన కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. ఆఫ్రికన్ వజ్రాలను, బంగారాన్ని అధికంగా ఇండియానే కొంటున్నది. మొజాంబిక్ నుండి బొగ్గు, మాల్వాయి నుంచి యురేనియంను కూడా కొనుగోలు చేస్తున్నది.

భారతదేశంలో ప్రభుత్వ ఆస్తుల్ని తెగనమ్మి ప్రైవేటు పరం చేస్తూ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచి అప్పుల ఊబిలో దిగబడుతున్న గడ్డు పరిస్థితి. దేశంలోని సహజ వనరుల్ని విదేశీ కంపెనీలకు దారాదత్తం చేసిన మన పాలకవర్గాలు ఇక్కడ ప్రజా ఆందోళనల్ని కౄరంగా అణచివేస్తున్నాయి. దీనికి పూర్తి భిన్నంగా ఆఫ్రికా దేశాలకు ఆర్థిక సహకారం పేరుతో దోపిడీ విధానాలు అవలంభించడం భారత్ – ఆఫ్రికా దేశాల ప్రజలకు వ్యతిరేకం. భారత పాలకవర్గాల విదేశాంగ విధానాన్ని, మార్కెట్ విధానాల్ని ఖండించి ఓడించాల్సిన అవసరం మనముందున్నది.

బయోడీసిల్, ఖనిజాల డిమాండ్ పెరిగి పోతున్న నేటి పరిస్థితుల్లో ఆఫ్రికా దేశాల సాగుభూముల లీజుకు, సహజ వనరులపై పట్టుకోసం భారత్ – చైనా దేశాల మధ్య పోటీ పెరిగింది. ఆఫ్రికా దేశాల ప్రజల శ్రమశక్తిని, సహజ వనరులను దోచి సామ్రాజ్యవాదుల అవసరాలకు భారత ఆర్థిక, రాజకీయాలను బలి చేస్తున్న భారత పాలకవర్గాల విధానాలను ఓడించడం మన కర్తవ్యంగా వుండాలి.

తిరిగి వస్తాయనే ప్రచారాన్ని నమ్మిన ప్రజలు కోళ్ళు, మేకలు, అమ్మి, అవి లేని వాళ్ళు అప్పు తీసుకొని కట్టినారు. సంవత్సరాలు దాటి పోతున్న ప్రజల డబ్బును తిరిగి ఇవ్వటం లేదు. అడిగితే దాటవేస్తూ తప్పించుకుంటు తిరుగుతున్న మల్లేష్, రంగారావులను ఏఆర్‌సిఎస్ నాయకత్వం కింద ప్రజలు సంఘటితమై నిలదీసారు. ప్రజలు ఆగ్రహానికి తలవంచక తప్పని పరిస్థితుల్లో మూడు విడతలుగా డబ్బు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ పత్రం రాసి ఇచ్చారు. సంఘ నిర్మాణం ద్వారానే తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోగలమనే నమ్మకం ఈ పోరాటాల ద్వారా ప్రజల్లో కలిగింది.

## అమరుల సంస్మరణ వారోత్సవాలు

ఉత్తర తెలంగాణలోని ఖమ్మం జిల్లా, చర్ల ఏరియాలో అమరుల వారోత్సవాల సందర్భంగా జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు పలు గ్రామాల్లో ప్రజలు ఆర్.పి.సిల, సంఘాల నాయకత్వంలో సంస్మరణ సభలు జరుపుకున్నారు. ఎల్.ఓ.ఎస్, ప్లాటూన్‌ల ఆధ్వర్యంలో తిప్పాపురం సభలో 8 గ్రామాల నుండి 450 మంది ప్రజలు పాల్గొన్నారు. కుర్మపల్లిలో జరిగిన సభలో 14 గ్రామాల నుండి వెయ్యిమంది వరకు ప్రజలు పాల్గొన్నారు. పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లో అమరుడైన చెన్నాపురం ఆర్.పి.సి అధ్యక్షుడు కామ్రేడ్ రామాల్ సహచరి కుర్రం దేవి జెండా ఆవిష్కరించి, ప్రసంగించింది.

అమరుల త్యాగాలను ఎత్తి పడుతూ, పాలకవర్గ పార్టీల, సి.పి.ఐ, సి.పి.ఐ(ఎం) రివిజనిస్టు పార్టీల అవినీతి, అక్రమాలను ఎండగడుతూ వక్తలు ప్రసంగించారు. స్థానిక సమస్యలపై, ఆదివాసుల హక్కుల గురించి దళకమాండర్ వివరించి, జల్, జంగల్, జమీన్‌పై అధికారం దక్కే వరకు పోరాడాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. నిత్య నిర్బంధంలో సైతం విజయవంతంగా జరిగిన అమరుల సంస్మరణ సభలు ప్రజలకు ఎంతో ఉత్తేజాన్నిచ్చాయి.

## ఉద్యమానికి నష్టదాయకంగా తయారైన ఇన్‌ఫార్మర్ల నిర్మూలన

ఏ.ఓ.బి. లోని ఎం.కె.బి డివిజన్, కలిమెల ఏరియా నల్లగొండి పంచాయితీ కొత్తకొండ గ్రామానికి చెందిన గంగాల్ మొదట మన సంఘంలో పనిచేసి, వ్యక్తిగత కక్షలతో గ్రామ పెద్దాల్‌ను హత్యచేసి జైలుకు వెళ్ళాడు. విడుదలైనప్పటి నుండి పార్టీ పేరు చెప్పుకొని ప్రజలను బెదిరించటం, దళసభ్యులను లొంగిపోయే విధంగా కుటుంబాలపై వత్తిడి చేయడం, సంఘసభ్యులను అరెస్టులు చేయించడం, పోలీసులతో సంబంధాలు పెట్టుకొని సమాచారం చేరవేయడం వంటి ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడు.

కలిమెల ఏరియా, సలిమెల కొండ గ్రామానికి చెందిన దామాలు కలిమెల బ్లాక్ కేంద్రంలో ఆఫీసు ప్యూన్‌గా పనిచేస్తూ, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారాడు. సంఘ కార్యకర్తలను నమ్మించి, పోలీసులకు పట్టించి అరెస్టులు చేయించాడు. వారిని విడిపించడానికి కుటుంబాల వద్ద డబ్బులు గుంజాడు. చుట్టుపక్కల గామాల్లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తున్నాడు.

డైక్-3 లో వుంటూ చౌకిదారుగా పనిచేస్తున్న లలిత్ ద్యూటీ మాటున ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. టన్నెల్ క్యాంపులోని బి.ఎస్.ఎఫ్ క్యాంపుతో నిత్యం సంబంధాలు కొనసాగిస్తూ గంజాయి పండించే ఆదివాసీ రైతులను బెదిరించి డబ్బు వసూళ్ళు చేయడం, పోలీసులకు మన సమాచారం చేరవేయటం చేస్తున్నాడు.

పోలీసు ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తూ, ప్రజావ్యతిరేకులుగా, ఉద్యమానికి తీవ్ర ఆటంకంగా తయారైన వీరిని పి.ఎల్.జి.ఎ, మిలీషియాలు ప్రజాభీష్టం మేరకు నిర్మూలించాయి.

## పోలీసు హెడ్ కానిస్టేబుల్, కాంట్రాక్టర్ల హతం

ఎం.కె.బి డివిజన్ పొడియా బ్లాక్ కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాంచందర్ పేద ప్రజలను బెదిరించి డబ్బు గుంజటం, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేయటంలో ముఖ్యపాత్ర వహిస్తూ ఉద్యమానికి తీవ్ర ఆటంకంగా తయారయ్యాడు. ఇతడి బారినపడి నానా ఇక్కట్ల పాలవుతున్న ప్రజల అభీష్టం మేరకు పి.ఎల్.జి.ఎ యాక్షన్ టీం, మిలీషియా కలిసి పొడియా బ్లాక్ కేంద్రంలో సంత జరిగే రోజు పట్టపగలే కాల్చి చంపాయి. ఇతడి పీడ విరగడ కావడంతో ప్రజలు ఎంతగానో సంతోషించారు.

## ప్రజావ్యతిరేకి, కాంట్రాక్టర్ సిత్తు హతం

ఎం.కె.బి డివిజన్ కలిమెల ఏరియాలో కాంట్రాక్టర్ సిత్తు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ పోలీసులకు నమ్మినబంటుగా తయారయ్యాడు. ఏరియాలో లోతట్టు ప్రాంతంలో రోడ్లు వేయడానికి ఎవరూ ముందుకు రాకపోయినా ఇతను ముందుండి రోడ్లు వేయిస్తూ, లక్షలాది రూపాయల డబ్బు కాజేస్తూ ఉద్యమానికి తీవ్ర ఆటంకంగా మారాడు. ఇతని ప్రజా వ్యతిరేక చర్యలకు తగిన శిక్ష విధిస్తూ కాంట్రాక్టర్ సిత్తును దళం హతమార్చింది.

## పోలీసు ఇన్‌ఫార్మర్లకు గ్రామ బహిష్కరణ

ఈస్ట్ డివిజన్ గాలికొండ ఏరియాలోని గేదెరుబ్బల గ్రామానికి చెందిన నాగేష్ పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేసూ, గ్రామంలో ఆధిపత్యం చెలాయిస్తూ ప్రజావ్యతిరేకిగా మారాడు. దీనిపై దళం ఆరు గ్రామాల ప్రజలను సమావేశపరిచి ప్రజాభిప్రాయం మేరకు గ్రామ బహిష్కరణ

⇨

*(..........48వ పేజీ తరువాయి)*
ప్రధానులు తమ ప్రసంగాల్లో వామపక్ష తీవ్రవాదం అత్యంత ప్రమాదకరంగా ఉందని, ఇప్పటికే 65 వేల సిఆర్‌పిఎఫ్ బలగాలను అణచివేతకు వినియోగిస్తున్నట్లు చెప్పుకున్నారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా ఓర్చా బ్లాక్‌లో 8 పంచాయితీలలోని 51 గ్రామాల పరిధిలో ఒక బ్రిగేడ్ స్థాయి శిక్షణా శిబిరం ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. జూన్ 2న 65 వాహనాల్లో 2వేల మంది సైన్యం వచ్చారు. అంటే 2 సైనిక బెటాలియన్లు వచ్చాయి. వీరంతా రాయబరేలి డివిజన్ కమాండ్‌కు చెందిన వాళ్ళని చెబుతున్నారు. నారాయణపూర్‌లోని కొండగాంలో బేస్‌క్యాంప్ వద్ద విడిదిచేసారు. ఇంకా ఒక డివిజన్ ఆర్టిలరీ బలగాలు వస్తాయని అంటున్నారు. "ఎన్ని బలగాలు వచ్చినా విస్థాపన జరగదు, అడవులను నష్టపరచరు" అని అంటున్నారు. ఇందులో ఎంత నిజం ఉందో మనకు తెలియనిదికాదు.

ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ మొత్తం 7 రాష్ట్రాల పరిధిలో పనిచేస్తున్న సెంట్రల్ కమాండ్ కింద ఈ సైనిక శిక్షణా శిబిరం పనిచేస్తుంది. ఈ సెంట్రల్ కమాండ్ 1963 మే 1న ఏర్పాటయ్యింది. దీని హెడ్‌క్వార్టర్ లక్నోలో వుంది. దీనిలో 25 మిలటరీ కంటోన్మెంట్స్, 76 మిలటరీ స్టేషన్లు, 34 రెజిమెంటల్ ట్రైనింగ్ సెంటర్స్ ఉన్నాయి. ఈ సెంట్రల్ కమాండ్‌కు కమాండర్ ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ వి.కె అహ్లువాలియా.

ఛత్తీస్‌గఢ్ – ఒడిషా సబ్ సెక్టార్ (దీనిని కోసా (సిఒఎస్ఎ) సెక్టార్ అంటారు) హెడ్‌క్వార్టర్ బిలాస్‌పూర్‌లో ఉంది. దీనికి బ్రిగేడియర్ బి.కె సింగ్ కమాండర్ ఇన్ చీఫ్. "ఈ శిక్షణా శిబిరం కేవలం శిక్షణ కోసమే, ఆపరేషన్స్ నిర్వహించడానికి కాదు" అని చెబుతున్నారు. ఇది ఎంత అబద్ధమో భవిష్యత్‌ను ఊహించగలవారికి స్పష్టమే.

ఈ సెంట్రల్ కమాండ్ ఇప్పటికే 35 వేల బలగాలకు శిక్షణ ఇచ్చింది. పోలీసు బలగాలకు, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి లాంటి అర్ధసైనిక బలగాలకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. వాయుసేనకోసం కూడా బిలాయ్ దగ్గర 'నందిని' గ్రామంలో ఏర్పాట్లు

⇨

విధించింది. పోలీసులకు సమాచారం అందించటంలో సహకరిస్తున్న ఇతడి బంధువులు దోవిగుమ్మ గ్రామానికి చెందిన మల్లేశ్, సంపెంగొంది గ్రామానికి చెందిన బాలన్నలను కూడా గ్రామాల నుండి బహిష్కరించారు.

## బిల్ట్ పేపర్ మిల్లు డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను హతమార్చిన పి.ఎల్.జి.ఏ.

ఉత్తర తెలంగాణలోని వరంగల్ జిల్లా మంగపేట మండలం కమలాపురం పేపర్ మిల్లు (బిల్ట్ గ్రాఫిక్ పేపర్ ప్రోడక్ట్ లిమిటెడ్) డిజిఎమ్ రామకృష్ణను ఏప్రిల్ 30వ తేదీ మిట్ట మధ్యాహ్నం కార్మికులు, ప్రజల మద్దతుతో అతడి ఛాంబర్‌లోనే పిఎల్‌జిఏ హతమార్చింది.

కె.కె.డబ్ల్యూ డివిజన్ పరిధిలోని ఇ.ఎన్–ఎమ్.డి.పి ఏరియాలో గల బిల్ట్ పేపర్‌మిల్లులో దాదాపు 2000 మంది శాశ్వత, తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తున్నారు. షిఫ్ట్ పద్ధతిలో ఉత్పత్తి కొనసాగుతుంది. గతంలో (దాదాపు 10, 15 సం॥ల క్రితం) కార్మికులు, మావోయిస్టు పార్టీ (గత పీపుల్స్‌వార్) నాయకత్వంలో తమపై జరుగుతున్న యాజమాన్య దోపిడీ, అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడి వేతన ఒప్పందం, పిఎఫ్, వర్క్ పర్మినెంట్, క్వార్టర్స్, విద్య, వైద్యం లాంటి సౌకర్యాలను, హక్కులను సాధించుకున్నారు.

డివిజన్‌లో మావోయిస్టు పార్టీ బలహీనపడడంతో యాజమాన్యం తిరిగి అక్రమాలకు, అవినీతికి పాల్పడుతూ, పోలీసులతో కుమ్మక్కై ఫ్యాక్టరీలో ఇన్‌ఫార్మర్లకు, మాజీలకు ఉద్యోగాలు కల్పిస్తూ, కార్మికులపై నిరంతరం నిఘాను పెంచింది. బూర్జువా పార్టీల నాయకత్వం కిందగల కార్మిక యూనియన్ నాయకులతో మిలాఖత్ అవుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నది. కార్మికుల నుండి లక్షలాది రూపాయల లంచాలు తీసుకుంటూ, అక్రమ పద్ధతులలో పర్మినెంట్, పదోన్నతులు కల్పిస్తూ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నది. దాదాపు 4 సంవత్సరాల క్రితం నుండి కార్మికులు వేజ్‌బోర్డు, పర్మినెంట్, పిఎఫ్ మొదలైన తమ సమస్యల పరిష్కారానికి సమ్మెలు, నిరసనలు, ఆందోళనలు చేసి పోరాడినప్పటికీ యాజమాన్యం మొండి వైఖరిని అవలంభించింది. మరోవైపు కార్మికులకు అండగా వున్న మావోయిస్టు పార్టీని దెబ్బతీయటానికి కుట్రలు పన్ని దళాన్ని దెబ్బతీయాలని ప్రయత్నాలు చేసింది. దీనితో పార్టీ నిర్ణయం మేరకు కార్మికులు, ప్రజల మద్దతుతో ఫ్యాక్టరీ డిప్యూటీ మేనేజర్‌ను పి.ఎల్.జి.ఏ హతమార్చింది.

డిజిఎమ్ రామకృష్ణను చంపిన తర్వాత ఎ.పి.ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేస్తానంటున్న ప్రభుత్వానికి, పోలీసులకు ఈ చర్య ఒక సవాలుగా నిలిచింది. ఈ చర్యతో కార్మికులు, విప్లవ ప్రజానీకం నూతనోత్తేజంతో తిరిగి పోరాడడానికి సంఘటితపడుతున్నారు.

చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో, జార్ఖండ్‌లోని 'దేవ్‌రిద్రిమి' దగ్గర ఇదే తరహా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో మూడు, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఐదు పోలీసుస్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు.

వైమానిక, సైనిక బలగాలు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపేందుకు హోంశాఖ నుండి అనుమతి ఉంది. వీరి "ఆత్మరక్షణ కాల్పులు" మనకు తెలియనివి కాదు. కాశ్మీర్‌లో హత్యాకాండ, విప్లవకారుల్ని బూటకపు ఎదురుకాల్పుల పేరుతో హత్యలు చేయడం ఈ 'ఆత్మరక్షణ' కోసమేనని మరచిపోకూడదు.

మాడ్‌లో కుతుల్ పంచాయితీని ఫైరింగ్ రేంజ్ సెంటర్‌గా మారుస్తున్నారు. మాడ్‌ను సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీకి కేంద్రం అని తప్పుడు ప్రచారం చేసిన ప్రభుత్వం ఇప్పుడు అక్కడే సైనిక కేంద్రం పెడుతోంది.

బీజాపూర్, దంతెవాడ, గడ్‌చిరోలి ప్రాంతాల్లో డ్రోన్ విమానాలను వినియోగిస్తున్నారు. నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (దీనిని నెట్రో అంటున్నారు) ఆధ్వర్యంలో రిపోర్ట్సు, మ్యాప్స్ (నక్ష) అధ్యయనం చేస్తారు. ఇది 5 రాష్ట్రాల పరిధిలో పనిచేస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లోని అయిదు ఉద్యమ ప్రాంత జిల్లాలలోను నక్ష అధ్యయనం చేయాలని నిర్ణయించారు. దీనికి గాను 6 డ్రోన్ విమానాలను కేటాయించారు. యుఎవి (మనుషుల్లేని విమానాలుగా ప్రసిద్ధి)ల గురించి ఇతర సైనిక విషయాల గురించి కొన్ని నిర్వహణ నియమాలను రూపొందించుకున్నారు. అందులో ప్రధానమైనది రహస్యాన్ని కాపాడుకోవడం. భారతసైన్యం కార్గిల్ యుద్ధంలో ఈ రకమైన పరిశోధన, అధ్యయనం చేయడం వలననే విజయం సాధించింది. దీనినే ఇక్కడ అమలు చేస్తామని అంటున్నారు.

జూన్ 14న కేంద్ర హోంమంత్రి చిదంబరం ఒడిశా – ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులతో నిర్వహించిన ఒక సమావేశంలో అనేక నిర్ణయాలు చేశాడు. అందులో ఛత్తీస్‌గఢ్ – ఒడిశా సరిహద్దులలో 15 బెటాలియన్ల బలగాలను మోహరించడం, అలాగే 5 అంచెలలో కార్యక్రమం చేపట్టడం మొదలైనవి ఉన్నాయి. అందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్‌కు రెండు, ఒడిశాకు ఒక బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ బలగాలు అదనంగా వచ్చి చేరాయి. అంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 18 సిఆర్‌పిఎఫ్, 5 బిఎస్ఎఫ్, 2 ఐటిబిపి, 2 ఎస్ఎస్‌బి బెటాలియన్లకు ఇవి రెండు అదనంగా వచ్చి చేరాయి. ఎమ్ఐ – 17 రకం హెలికాప్టర్లు 17 వినియోగిస్తున్నారు. ఝార్ఖండ్‌కు ప్రత్యేకంగా మరో 2 వినియోగిస్తున్నారు.

జూలై 2న ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్ నాయకత్వంలో యూనిఫైడ్ కమాండ్ మీటింగ్ జరిగింది. అందులో వర్షాకాలంలో కూడా దాడులు చేయాలని నిర్ణయించారు. మహాసముంద్ జిల్లాలో ఒక చిన్న శిక్షణా శిబిరం ఏర్పరచాలనుకున్నారు. సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టంలో భాగంగా దాడులకు సంబంధించిన విధానాలను రూపొందించాలని ఆలోచనలు చేస్తున్నారు.

జూలై మొదటి వారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుండి విడుదలైన ప్రకటనలో 83 జిల్లాలలో 400 పోలీసుస్టేషన్ల ఆధునీకరణకు 800 కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం 365 కోట్ల రూపాయలతో పాటు నక్సల్స్ ప్రభావిత 65 జిల్లాలకు ఒక్కో జిల్లాకు 25 కోట్ల రూపాయలు అదనంగా కేటాయించారు. ఇదంతా అభివృద్ధి కోసం అంటున్నారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న 18 జిల్లాలను ఇప్పుడు 27 జిల్లాలుగా మార్చాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 9 జిల్లాలలో 5 జిల్లాలు ఉద్యమ ప్రాంతంలోని జిల్లాలే. అవి కొండగాం, సుక్మా, గరియాబంద్, బలరాంపూర్, సూరజ్‌పూర్‌లు. వీటిలో చివరిమూడు గతంలోనే పోలీసు జిల్లాలుగా ప్రకటించి ఉన్నారు. ఈ విభజన వెనుక కూడా ఉద్యమ అణచివేత పథకాలున్నాయని సులభంగానే అర్థం చేసుకోవచ్చు.

ఒక వైపు కేంద్ర ప్రభుత్వం ఉద్యమ అణచివేత చర్యల్లో తలమునకలై వుండగా మరోవైపు ప్రతిపక్ష బీజెపీ కూడా కోర్ మీటింగ్ జరిపి నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయాలని తీర్మానించింది.

దేశం మధ్యలో యుద్ధ రంగాన్ని ప్రారంభించడాన్ని సైనిక కమాండర్లు కొందరు వ్యతిరేకిస్తున్నారు. కాని వారి మాటను లక్ష్యపెట్టని పరిస్థితి కనబడుతున్నది. "మేమంతా రాజ్యంలో పనిముట్ల లాంటి వాళ్ళం. వారి ఆదేశాలు పాటించాల్సిందే" నని వారంటున్నారు. ఈ రాజ్యం దోపిడి రాజ్యం. దళారీ పాలకులు సామ్రాజ్యవాదులకు దేశసంపదలను కొల్లగొట్టి పెట్టడానికి ప్రజాఉద్యమాలను, విప్లవోద్యమాలను అణచివేస్తూ, తుడిచివేత చర్యలు చేపడుతున్నారు.

పోస్కోతో సహా అన్ని రకాల ప్రాజెక్టులను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అడవుల్లో పచ్చదనాన్నీ ఆదివాసీ బతుకుల్లో వెలుగుల్నీ చిదిమే చర్యలు చేపడుతూ ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను కొనసాగిస్తున్న పాలకుల దోపిడీ విధానాలను, సైనిక చర్యలను దేశంలోని అన్ని సెక్షన్ల ప్రజలను ఐక్యం చేసి ఓడిద్దాం. సైనిక బలగాల మోహరింపుకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దాం – ప్రజాయుద్ధ జ్వాలల్లో దోపిడీవర్గాల రాజ్యాన్ని కూల్చి జనతా ప్రజాతంత్ర రాజ్యాన్ని నిర్మిద్దాం.

# ఛత్తీస్‌గఢ్‌లో సైన్యం మోహరింపునూ, బ్రిగేడ్‌స్థాయి సైనిక శిక్షణా శిబిరం ఏర్పాటును నిరసిద్దాం!

దోపిడీ భారత పాలకవర్గాలు పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని సైన్యంతో పాశవికంగా అణచివేయడానికి, నిర్మూలించడానికి సైనికీకరణ కోసం చట్టంలో ప్రత్యేక సదుపాయాలు కల్పించుకుంటున్నాయి.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సల్వాజుడుం దాడులతో ప్రజల్లో భయభీతావహ వాతావరణాన్ని సృష్టించింది. వందల గ్రామాల్లో గృహదహనాలు, సామూహిక అత్యాచారాలు, లూటీలు, వేలమంది ఆదివాసీ ప్రజల హత్యలు, పంటల విధ్వంసాలు చేసి, వేలాదిగా ప్రజల్ని శిబిరాలలో నిర్బంధించిన రమణ్‌సింగ్ ప్రభుత్వం పౌరసమాజపు అసహ్యానికి గురయ్యింది. అన్ని సెక్షన్ల ప్రజలు నిరసన తెలియజేశారు. అయినప్పటికీ ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3 సం॥లుగా అదే విధానాలను అమలుచేస్తూ దేశవ్యాప్తంగా ప్రజల అసహ్యానికి గురవుతున్నాయి. ఎస్‌పిఓ లను, కోయకమాండోలను రద్దు చేయాలని జూలై 4న సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా వస్తున్న నిరసనలను లెక్కచేయకుండా ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్ హంట్ 2వ దశను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నది. అందులో భాగంగానే ఈ సైనిక సమీకరణ, శిక్షణ, సమన్వయాలు.

భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకులు జాతీయోద్యమాన్ని , సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచివేయడానికి అనుసరించిన విధానాలనే మన దేశ పాలకులు తు.చ. తప్పకుండా అనుసరిస్తున్నారు. ఈశాన్య భారత దేశంలో జాతుల ఉద్యమాలను అణచివేయడంలో సాయుధ బలగాల ప్రత్యేక చట్టాలను అమలుచేస్తూ నిత్యం ప్రజల ప్రాణాలను హరించివేస్తున్నారు. జమ్మూ – కాశ్మీర్, మణిపూర్‌లతో సహా ఈశాన్యంలో జరిగిన, జరుగుతున్న వాస్తవాలు ఇప్పటికీ మనల్ని వేధిస్తూనే ఉన్నాయి. కాశ్మీర్‌లో 60 వేల మంది ప్రజల్ని కాల్చి చంపిన పాలకవర్గాలు ప్రజాస్వామ్య ముసుగును తొలగించుకొని పౌరహక్కుల్ని కాలరాచివేస్తూ అమానుష అత్యాచారాల్ని, హత్యాకాండల్ని కొనసాగిస్తూనే ఉన్నాయి. అదే విధానాల్ని, సాంప్రదాయాల్ని, సంస్కృతిని ఇప్పుడు ఇక్కడ కొనసాగిస్తున్నాయి. భూంకాల్ పోరాటం (1910) కాలంలో బ్రిటీష్ ప్రభుత్వ సేనలు బస్తర్ మూలవాసులపై యుద్ధం ప్రకటించాయి. నేడు అదే బస్తర్‌లో మూలవాసులపై భారత ప్రభుత్వమే (స్వంత ప్రజలపైనే) యుద్ధం చేస్తున్నది.

భారతదేశానికి 'స్వతంత్రం' ప్రకటించుకున్నాక మన పాలకులు 1948 సెప్టెంబర్‌లో వీరతెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచివేయడానికి 50 వేల సైన్యాన్ని దించారు. నైజాం రజాకార్లతో వీరోచితంగా పోరాడుతున్న తెలంగాణ రైతాంగాన్ని సైన్యం విచక్షణారహితంగా కాల్చి చంపి రక్తపుటేరులు పారించింది. గత చరిత్ర గాయాలు ఇప్పటికీ రైతాంగాన్ని, పీడిత ప్రజల్ని బాధిస్తూనే ఉన్నాయి.

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల్ని అర్ధసైనిక బలగాలతో అణచివేసిన భారతపాలక వర్గాలు బీర్భూంలో రైతాంగ పోరాటాన్ని అణచివేయడానికి ఒక బ్రిగేడ్ సైన్యాన్ని వినియోగించారు. నూతన ఆర్థిక విధానాల అమలు మొదలయ్యాక 1992లో ఉత్తర తెలంగాణాలోను, 2003లో ఛత్తీస్‌గఢ్‌లోనూ ప్రత్యక్షంగా అర్ధ సైనిక బలగాలను వినియోగించి దాడులు చేసారు.

ఆనాటి (1861) బ్రిటీష్ చట్టాలనే 1990 నుండి కాశ్మీర్‌లోను, ఈశాన్య రాష్ట్రాలలోను అమలుచేస్తున్నారు. ఆనాటి ఎస్‌పిఒల నియామకాలనే ఇక్కడ అమలుచేస్తూ ప్రజలతోనే ఈ ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. దేశ సరిహద్దులలో నిలబడి విదేశీ సైన్యాలతో యుద్ధం చేసి దేశాన్ని కాపాడాల్సిన బలగాలు నేడు దేశం నడిబొడ్డున ప్రజలపైనే యుద్ధం ప్రకటించడం ఘోరమైన విషయం.

దేశవ్యాప్తంగా ఎస్‌ఈజెడ్‌లకు అనుమతినిస్తూ ఎమ్ఒయులపై సంతకాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బలమైన ప్రతిఘటనను ఎదుర్కొంటున్నాయి. ఆ ప్రతిఘటనలన్నీ విప్లవోద్యమంలో భాగం కాకముందే, అభివృద్ధి చెందుతున్న మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేసేందుకు అనేక అణచివేత, నిర్మూలనా దాడులను చేపట్టింది.

ఆగస్టు 15న 65 సం॥ల భారత స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్రపతి,

***(మిగతా 46వ పేజీలో......)***